అధికారుల ప్రాథమిక అంచనా	
మండలాల సంఖ్య	19
గ్రామాలు	188
బాధిత రైతులు	12,315
దెబ్బతిన్న పంటల విస్తీర్ణం	6439 హెక్టార్లు
ఇళ్లు	మూడు
మృతి చెందిన పశువులు	3
చెరువులు, కాలువలు	85 చోట్ల
విద్యుత్ సబ్‌స్టేషన్లు	8
ట్రాన్స్‌ఫార్మర్లు	30
33 కేవీ ఫీడర్స్	14 చోట్ల
11 కేవీ ఫీడర్స్	11
స్తంభాలు	31

అప్పులు తెచ్చి నాట్లు వేశా...

ఈసారి చెరువుల్లో నీరు బాగా ఉండటంతో అప్పులు చేసి మరీ నాట్లు వేశాను. తీరా తుఫాన్ దెబ్బకు నాట్లన్నీ మునిగిపోయాయి. బాగా నష్టపోయాను. చివరికి అప్పులే మిగిలేలా ఉన్నాయి. అధికారులు మునిగిన పంటలను పరిశీలించి, ప్రభుత్వం ఆదుకునేలా చూడాలి.

- కూరాకు అశోక్, రాపూరు



మనుబోలు : నీటమునిగి దెబ్బతిన్న నారును చూపుతున్న రైతులు

దిత్వా.. వేలాది మంది రైతుల కష్టాన్ని నీళ్లపాలు చేసింది. లక్షలాది రూపాయల ఆర్థిక నష్టాన్ని తెచ్చిపెట్టింది. దానికన్నా ముఖ్యమైన పంట కాలాన్ని 45 రోజులపాటు వెనక్కు నెట్టింది. అదునుకు పంట పెట్టాలని ఆశించిన రైతుల ఆశలను గల్లంతు చేసింది. నాలుగు రోజులపాటు ఎడతెరపి లేకుండా వానలు కురిపించిన తుఫాన్ పోతూ పోతూ రైతు తినేకూటిలో మట్టి కొట్టిపోయింది. అన్నదాతల నెత్తిన అపార నష్టాన్ని మిగిల్చింది. తిరిగి పంట పెట్టుకోవాలంటే 45 రోజులు వేచి ఉండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.



ముత్తుకూరు : పొలాల్లో నిలిచిన నీటిని మోటార్లతో తోడుకుంటున్న రైతులు

తుఫాన్.. ఏడిపించెన్!

పెట్టుబడి అంతా పోయింది!



26 ఎకరాల్లో సేద్యం పాలికి (కౌలు) చేస్తున్నాను. ఎకరా కయ్యిలో విత్తనాలు చల్లి వారం రోజుల్లో నారేతలు వేద్దామని కూలీలను మాట్లాడుకున్నా ఇంతలో వర్షం పట్టుకుంది. పై నుంచి వచ్చిన వరదలకు మొత్తం కొట్టుకుపోయింది. విత్తనాలు, కూలీలు, దుక్కిలు మొత్తం రూ. 44 వేల వరకు పెట్టుబడి అయింది. అదంతా గోవిందా. ఇందులో రూపాయి చేతికిరాదు. నీళ్ల తగ్గేదానికి ఇంకా 10 రోజులు దాకా పడుతుంది. మంచి ఎండల్లో వరికోతలు కొయ్యాల్సి వస్తుంది. అప్పుడు ఏం దిగుబడొస్తాదో.. ఏమో!

- కసుమూరు రవి, సౌత్‌మోపూరు

నారుమళ్లు దెబ్బతిన్నాయి



నాకు తరుణాయి చెరువులో నాలుగెకరాల పొలం ఉంది. నాలుగు బస్తాల (బస్తా 25 కేజీలు) విత్తనాలు నారుమళ్లు వేశా. వర్షంతో నారుమళ్లు నీట మునిగాయి. వర్షం తగ్గడంతో నీటిని బయటకు చల్లాను. సగం నారు దెబ్బతిన్నది. సుమారు రూ.5 వేల వరకు నష్టం జరిగింది.

- వెంకటాద్రి, ఉడ్‌హౌస్‌పేట, సంగం



పొదలకూరులో నీట మునిగిన నారుమళ్లను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

భారీ వర్షాలతో తీవ్ర నష్టం



తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలతో తీవ్రంగా నష్టపోయాం. వేసిన 10 ఎకరాల నారుమళ్లు నీట మునిగి ఎందుకూ పనికి రాకుండాపోయాయి. మళ్లీ వ్యవసాయ పనులన్నీ మొదలుపెట్టి పంట సాగు చేయాలంటే చాలా భారంగా మారుతుంది. సాగు ఖర్చులు అదనంగా పెరగడంతోపాటు సకాలంలో పంట పండించుకునే పరిస్థితి లేదు.

- నెల్లిపూడి రాము, కృష్ణపట్నం, ముత్తుకూరు

- రైతులను కడగళ్లపాలుచేసిన 'దిత్వా'
- 7 వేల హెక్టార్లలో పంటల నష్టం
- తిరిగి పంట పెట్టాలంటే మరో 45 రోజుల సమయం
- అప్పుడు నాట్లు వేస్తే చీడపీడల భయం
- దిక్కుతోచని స్థితిలో అన్నదాత

నెల్లూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఇది రబీ సీజన్. జిల్లా రైతులకు ఇది ప్రాణపదం. ఈ సీజన్‌లో వరి మంచి దిగుబడి ఇస్తుంది. ముఖ్యంగా చీడపీడల బాధ లేకుండా పంట చేతికందుతుంది. ముందు కురిసిన వర్షాలకు సోమశిల జలాశయంతో పాటు చెరువుల్లోకి పుష్కలంగా నీరు చేరడంతో రబీ పంటపై పుట్టెడాశతో నారు మళ్లు పోశారు. నాట్లూ వేశారు. అయితే 4 రోజులపాటు ఎడతెరపి లేకుండా కురిసిన వర్షం కారణంగా డెల్టా పరిధిలో సుమారు 6 వేల హెక్టార్లలో వరి నాట్లు, నారుమళ్లు మునిగిపోయాయి. కుంటలు, కయ్యలు ఏకం కావడంతో కయ్యల్లో నీళ్లు తగ్గాలంటే మూడు, నాలుగు రోజుల సమయం పడుతుంది. ఆలోగా వరి నాట్లు కుళ్లిపోతాయి. ఇక నారుమళ్ల విషయం చెప్పాల్సిన పనిలేదు. మళ్లీ నారు పోసుకోవాల్సిందే. ఒక హెక్టారు విస్తీర్ణంలో వరినాట్లు వేయడానికి రూ.25వేలు ఖర్చు అవుతుంది. నారుమళ్లకు హెక్టారుకు రూ.5వేలు ఖర్చు అవుతుంది. వరినాట్లు, నారుమళ్లు రెండింటిపై సగటున రూ.15వేల ఖర్చుతో లెక్కించినా నీట మునిగిన 6వేల హెక్టార్ల ద్వారా సుమారు రూ.9 కోట్ల రైతు కష్టార్జితం నీళ్లపాలయ్యింది.

● దిగుబడిపై ఆందోళన

రైతులకు ఇప్పటికి జరిగిన నష్టం కంటే భవిష్యత్తులో జరగబోయేది ఎక్కువ నష్టం. వర్షాల దెబ్బ లేకుంటే ఈ 6 వేల హెక్టార్లలో వరి పంట మంచి దిగుబడి ఇచ్చేది. సాధారణంగా రబీ సీజనల్‌లో ఎకరాకు 4 నుంచి 4.5 పుట్ల ధాన్యం దిగుబడి వస్తుంది. ఇప్పుడు నారుమళ్లు, నారేతలు దెబ్బతినడంతో తిరిగి సాగుకు 45 రోజుల సమయం పడుతుంది. అంటే వరి కోతలు ఏప్రిల్ ఆఖరు లేదా మే నాటికి జరుగుతాయి. అప్పటికి ఎండలు ముదరడంతో పంటలకు చీడపీడల తాకిడి ఎక్కువ అవుతుంది. ప్రధానంగా వెన్నుపోయే సమయానికి మొంపిప్పి, అగ్గి తెగులు పంటను సోకే ప్రమాదం ఉంటుంది. దీనివల్ల దిగుబడి గణనీయంగా తగ్గిపోతుంది. పెట్టుబడి కూడా చేతికందే అవకాశం ఉండదు. పోనీ వరి తప్ప మరో పంట సాగు చేద్దామన్నా కుదరదు. డెల్టా ప్రాంతంలో ప్రత్యేకించి ఈ సీజన్ ఆరుతడి పంటలకు ఏమాత్రం అనువైనది కాదు. దీంతో కష్టమైనా నష్టమైనా పంట పెట్టాల్సిన పరిస్థితి రైతులకు ఎదురయ్యింది.

రూ.10వేలు నష్టపోయా



నాకున్న ఆరెకరాల పొలంలో 6 బస్తాల విత్తనా లు నారుమళ్లు వేశాను. కురిసిన భారీ వర్షానికి నారుమళ్లు నీట మునిగాయి. నాటే సమయంలో నారు దెబ్బ తినడంతో మళ్లీ నారు వేయాలంటే పంట ఆలస్యమవుతుంది. వర్షపు నీరు తగ్గితే విత్తనాలను నేరుగా పొలంలో చల్లాలనుకుంటు న్నాను. దుక్కిలతో కలిపి సుమారు రూ.10 వేల నష్టం వాటిల్లింది.

- రమణయ్య, మర్రిపాడు, సంగం

150 ఎకరాల్లో నాట్లు దెబ్బతిన్నాయ్



రేబాలలో రైతులు 300 ఎకరాలకుపైగా రైతులు వరినాట్లు వేశారు. సుమారు 150 ఎకరాల్లో ఇప్పటివరకు నాట్లు దెబ్బతిన్నాయి. ముంపు నీళ్ళు తగ్గితేనే పంటనష్టం పూర్తిగా తెలుస్తుంది. నారుమళ్ళు కూడా దెబ్బతిన్నాయి. మళ్ళీ నార్లుపోసి, నాట్లు వేయాలంటే మరో నెల వెనుకబడిపోవాల్సి ఉంటుంది.

- టీ. వెంకటరామిరెడ్డి, రేబాల, బుచ్చి

సబ్సిడీపై విత్తనాలు అందించాలి



8 ఎకరాల్లో వరి నారు వేశాను. భారీ వర్షాలకు పూర్తిగా దెబ్బతిన్నది. నాలాగే చాలా మంది రైతుల నార్లు వానకు కొట్టుకుపోయాయి. ప్రభుత్వం వెంటనే సబ్సిడీతో విత్తనాలు అందించాలి. వ్యవసాయ అధికారులు వచ్చి మా పొలాల్లో వరద నష్టాన్ని నమోదు చేసుకున్నారు.

- జీ. శ్రీనివాసులు, పొదలకూరు

విత్తనాల వడ్లు ఇవ్వాలి



నాకున్న 6 ఎకరాల్లో నారు పోస్తే మొత్తం మునిగి పోయింది. కయ్యల్లో మోకాలి లోతు నీళ్లున్నాయి. అవి తగ్గేసరికి నారు ఉంటాదని నమ్మకం లేదు. ప్రభుత్వం విత్తనాలు ఇస్తే మరోసారి నార్లు పోసుకోగలం.

- ముంగర శివారెడ్డి, మనుబోలు

దుత్తలూరు వీఆర్వో సస్పెన్షన్

దుత్తలూరు(ఉదయగిరి), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : దుత్తలూరు-1 ఇన్‌చార్జి వీఆర్వో సీహెచ్ శ్రీనివాసులను సస్పెండ్ చేస్తూ జిల్లా ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేసినట్లు తహసీల్దారు నాగరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఏరుకొల్లు వీఆర్వోగా ఉన్న సమయంలో శ్రీనివాసులు అప్పటి నాయకుల మాటలు విని అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందకుండా చేయడంతోపాటు వారి పట్ల దురుసుగా ప్రవర్తించారని పేర్కొన్నారు. ఇటీవల ఆయనపై గ్రామస్థులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారని, విచారణలో వాస్తవమని తేలడంతో శ్రీనివాసులపై చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

'ట్రాప్' గ్యాంగ్‌లపై గురి!

- ముఠాల ఆగడాలపై పోలీసుల దృష్టి
- కీలక ముఠా నేతల వరుస అరెస్టులు
- మిగిలిన వారి కోసం జల్లెడ
- రికవరీ చేస్తారా..? బాధితులకు అందిస్తారా..?



నెల్లూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : తక్కువ ధరకు బంగారం పేరుతో ఆశచూపి అమాయకులను 'ట్రాప్' చేసి దోచుకుంటున్న ముఠాలపై పోలీసులు దృష్టి పెట్టారు. కీలక ముఠాల ఆగడాలను గుర్తించిన పోలీసు యంత్రాంగం.. ఆ ముఠాల్లోని ప్రధాన నేతలను వరుసగా అరెస్టులు చేస్తున్నారు. వారం రోజుల వ్యవధిలో అనేక ట్రాప్‌లు వేసి రూ.కోట్లు దోచుకున్న దేవరకొండ సుధీర్, షేక్ హసన్‌లను జైలుకు పంపారు. వీరితోపాటు కొందరు అనుచరులను కూడా పట్టుకున్నారు. వారం రోజుల క్రితం షేక్ హసన్ ముఠాను పట్టుకోగా వారి నుంచి 22.4 కేజీల గంజాయితోపాటు రూ.37.50 లక్షల నకిలీ కరెన్సీ నోట్లను కూడా స్వాధీనం చేసుకున్నారు. అలానే బుధవారం కావలిలో దేవరకొండ సుధీర్‌ను పట్టుకోగా అతడి నుంచి సుమారు 25 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అలానే అతడి ఇంట్లో నగదు, క్యాష్ కౌంటింగ్ మిషన్లు వంటి మరికొన్ని వస్తువులను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఇప్పుడు సుధీర్ ముఠా సభ్యుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. అలానే మోనా సద్దాం హుస్సేన్ గ్యాంగ్ ఆటలను కూడా పట్టేందుకు పోలీసులు సిద్ధమయ్యారు.

● కావలి కేంద్రంగా..

కావలి కేంద్రంగా కొన్నేళ్ల క్రితం మొదలైన ట్రాప్ గ్యాంగ్ ఆగడాలు ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు విస్తరించాయి. మీడియేటర్లను ఏర్పాటు చేసుకొని తక్కువ ధరకు బంగారం ఇస్తామని ఆశచూపడం, నకిలీ కరెన్సీ నోట్లు తయారు చేయడం వంటి చేస్తూ కొన్ని వందల మంది బాధితుల నుంచి రూ.కోట్లు దోచుకున్నారు. సుధీర్, హసన్, హుస్సేన్ మొదట ఒకే గ్యాంగ్‌గా పనిచేసేవారు. అయితే దోచుకున్న సొత్తులో పంపకాల్లో తేడాలు రావడంతో ఒక గ్యాంగ్ కాస్తా మూడు గ్యాంగ్‌లుగా విడిపోయాయి. ఈ ముగ్గురు మూడు ముఠాలను ఏర్పాటు చేసుకొని రకరకాల ప్రదేశాల్లో మోసాలు చేస్తూ వస్తున్నారు. ఈ 'ట్రాప్' గ్యాంగ్‌ల ఆగడాలను ఇటీవల 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలతో వెలుగులోకి తెచ్చింది. ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవడంతో ముఠాల ఆగడాలకు

- మిగతా 7వ పేజీలో..



నెల్లూరు : విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి నారాయణ



చేజర్ల : ట్యాబ్‌లను పరిశీలిస్తున్న విద్యార్థులను గమనిస్తున్న మంత్రి ఆనం

అంబరాన్నంటిన సంబరం

- ఉత్సాహంగా మెగా పేరెంట్, టీచర్ మీటింగ్
- అభివృద్ధిలో తల్లిదండ్రుల భాగస్వామ్యం

నెల్లూరు(విద్య), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంచడంతోపాటు సహృద్భావ వాతావరణం కల్పించేందుకు విద్యా శాఖ పాఠశాలల్లో శుక్రవారం నిర్వహించిన సంబరాలు అంబరాన్నంటాయి. పాఠశాలల్లో ఉత్తమ విద్య అందించేందుకు, అభివృద్ధిలో అందరినీ భాగస్వాములను చేసేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులను కలిపి ఒకే వేదికపైకి చేర్చడంతో ప్రభుత్వ బడుల్లో పండగ వాతావరణం నెలకొంది. ప్రజా ప్రతినిధులు, అధికారుల కలిసి తల్లిదండ్రులతో విద్యాపరమైన అంశాలను చర్చించడంతోపాటు సహపంక్తి భోజనాలు చేసి పిల్లల ప్రగతి నివేదికలు అందచేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లావ్యాప్తంగా 2,527 ప్రభుత్వ పాఠశాలల్లో, 23 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నిర్వహించిన మెగా పేరెంట్, టీచర్ మీటింగ్ 3.0 కార్యక్రమాలు విజయవంతంగా జరిగాయి. రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ నెల్లూరులోని పలు స్కూళ్లలోనూ, రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చేజర్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో పాల్గొని, ప్రసంగించారు. కావలి, చేవూరులలో నిర్వహించిన మెగా పేటీఎం సమావేశాల్లో కలెక్టర్ హిమాన్షుశుక్లా పాల్గొనగా, జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఎమ్మెల్యేలు, అధికారులు ఆయా ప్రాంతాల్లో పాల్గొని ప్రసంగించారు.

పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలి

- రామాయపట్నం పోర్టు, ఇండోసోల్‌లా వ్యవహరించొద్దు!
- అధికారులకు తేల్చి చెప్పిన రైతులు
- బీపీసీఎల్ ఏర్పాటుపై చేవూరులో ప్రజాభిప్రాయ సేకరణ

గుడ్లూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : తమ ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న పరిశ్రమల్లో స్థానిక యువతకే ఉద్యోగాలు ఇవ్వాలని చేవూరు, రావూరు, సాలిపేట రైతులు స్పష్టం చేశారు. చేవూరులో బీపీసీఎల్ ఏర్పాటుపై శుక్రవారం జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో కలెక్టర్ హిమాన్షు శుక్లా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఈ ప్రాంత యువతకు ఉద్యోగాలు వస్తాయన్న ఆశయతో రామాయపట్నం పోర్టు, ఇండోసోల్‌కు భూములిస్తే తీరా ఎక్కడో దూరంగా ఉన్నవారిని ఉద్యోగాల్లో చేర్చుకుని తమకు మొండిచేయి చూపించారని వాపోయారు. ఇండోసోల్‌లో బీహార్ వాళ్లను చేర్చుకొని స్థానిక యువతను మోసం చేశారని మండిపడ్డారు. అదే తరహాలో బీపీసీఎల్ కూడా వ్యవహరిస్తే తాము తీవ్రంగా నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే, బీపీసీఎల్

- మిగతా 6వ పేజీలో..



చేవూరులో జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొన్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, పాల్గొన్న రైతులు

ఉచితంగా విత్తనాలు సరఫరా చేయండి

వ్యవసాయ శాఖ మంత్రికి సోమిరెడ్డి లేఖ

నెల్లూరు (వ్యవసాయం)/తోటపల్లిగూడూరు : దిత్వా తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులకు ఉచితంగా విత్తనాలు అందించి ఆదుకోవాలని కోరుతూ సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి శుక్రవారం వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడికి లేఖ రాశారు. భారీ వర్షాల కారణంగా పొలాలన్నీ సముద్రాన్ని తలపిస్తున్నాయని పేర్కొన్నారు. దాదాపు జిల్లాలోని 20 మండలాల్లో 16,132 మంది రైతులు నష్టపోయారని, 2116 హెక్టార్లలో నారుమడులు, 6546 హెక్టార్లలో వరినాట్లు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. ఒక్క సర్వేపల్లి నియోజకవర్గంలోనే 6,997 ఎకరాల్లో వరినాట్లు, 80హెక్టార్లలో వేరుశనగ దెబ్బతిందని తెలిపారు. ఇప్పటికీ వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయని దీంతో నష్టం మరింత పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నష్టాలను అంచనా వేయించే ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని కోరారు.

'సోమశిల'కు పెరిగిన ఇన్‌ఫ్లో

అనంతసాగరం డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం క్యాచ్‌మెంట్ ఏరియాలో కురుస్తున్న వర్షానికి వరద పెరుగుతోంది. గురువారం 22,186 క్యూసెక్కులు వస్తుండగా శుక్రవారం నాటికి 28,080 క్యూసెక్కులకు పెరిగింది. ఇక డ్యాంలో 73.593 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, ఉత్తర కాలువకు 50, దక్షిణ కాలువకు 200, డెల్టాకు 2,650, కండలేరుకు 2,000 క్యూసెక్కులు వదులుతున్నారు.

● కండలేరుకు తగ్గిన ప్రవాహం

రాపూరు : కండలేరు డ్యాంకు వరద ప్రవాహం తగ్గింది. శుక్రవారం సాయంత్రం ఇన్‌ఫ్లో 1920 క్యూసెక్కులు ఉండగా, హెడ్ రెగ్యులేటర్ నుంచి 1970 క్యూసెక్కులు, సత్యసాయి గంగ కెనాల్‌కు వెయ్యి, పిన్నేరువాగుకు 850, ఫస్ట్ బ్రాంచ్ కెనాల్‌కు 35, రాపూరు మంచినీటి పథకానికి 5 క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తున్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ఇందుకూరుపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండల సర్వసభ్య సమావేశం శనివారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో నాగేంద్రబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో 17 శాఖలకు సంబంధించిన అభివృద్ధి పనులపై ఆయా శాఖల అధికారులు సభ్యుల ప్రశ్నలకు వివరణ ఇస్తారన్నారు. ఈ సమావేశానికి జడ్పీటీసీ, ఎంపీటీసీ, కో ఆప్షన్ సభ్యులు, సర్పంచ్‌లు హాజరు కావాలని ఆయన కోరారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 12286
వెండి కిలో ధర	రూ. 183000
వెండి ఒక గ్రాము	రూ. 188.00

కామాక్షితాయికి పల్లకీ సేవలు

బుచ్చిరెడ్డిపాళెం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడ శ్రీ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయంలో శుక్రవారం కామాక్షితాయికి పల్లకిసేవలు వైభవంగా జరిగాయి. ముందుగా కామాక్షితాయికి భక్తులతో సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ఆలయంలో గంగా, కామాక్షితాయి సమేత శ్రీ మల్లికార్జున స్వామి వారికి నిత్య కళ్యాణోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయానికి వచ్చిన భక్తులు ముందుగా స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు.

డిప్యూటీ ఎంపీడీవోగా గరుడయ్య

మనుబోలు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలానికి డిప్యూటీ ఎంపీడీవోగా మనుబోలు పంచాయతీ కార్యదర్శి గరుడయ్య పదోన్నతిపై నియమితులయ్యారు. ఆయన శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. మనుబోలు పంచాయతీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శ్రీహరికి ఇన్‌చార్జి కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించారు.

ఎల్లవ కాలువలో పూడికతీత

విడవలూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఎల్లవ కాలువ పూడిక తీత పనులు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సహకారంతో శుక్రవారం జరిగాయి. దీంతో సుమారు 200 ఎకరాలు ముంపుబారిన పడకుండా రైతులకు మేలు జరిగింది. వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా కాలువ పూడిక తీయించారు.ఈ సందర్భంగా టీడీపీ నాయకులు, రైతులు మాట్లాడుతూ ఎల్లవ కాలువ పూడిపోవటం వలన వర్షాలు పడినప్పుడు ఎల్లవనీరు ఏటుపోకా పోలాల్లో ఉండటంతో పంటలు దెబ్బతిన్నాయన్నారు. ఎమ్మెల్యే సొంత నిధులతో పనులు చేయించారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆవుల వాసు, పొన్నాడి చంద్రశేఖర్, అత్తిరాల సురేష్, ఉప్పాల వెంకటరమణయ్య, పురిణి హరి పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించండి

పొదలకూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : సంగం నుంచి నెల్లూరు చెరువుకు నీరు వెళ్లే కాలువ (లుడుంవాగు) ఆక్రమణలకు గురైందని ఆ కాలువ ఆక్రమణలను తొలగించాలని జిల్లా రైతు సంఘం కార్యదర్శి మూలి. వెంగయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంగం - నెల్లూరు కాలువ, తన సహజ స్వరూపాన్ని కోల్పోయిందని, కాలువ స్థలాన్ని రైతుల ఆక్రమించేశారని, దీనివల్ల 200 ఎకరాలు నీట మునిగాయన్నారు. కార్యక్రమంలో మండల రైతు సంఘం అధ్యక్షులు నీలం కోదండరామిరెడ్డి, కార్యదర్శి వెంకటశేషయ్య, సీపీఎం మండల ఇన్‌చార్జ్ అల్లాడి గోపాల్ పాల్గొన్నారు.

అవగాహనతోనే హెచ్‌ఐవీ నియంత్రణ

రాపూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రాపూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రపంచ ఎయిడ్స్ నియంత్రణ దినోత్సవం సందర్భంగా కళాశాల విద్యార్థులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.వి. హనుమంతయ్య, రెడ్ రిబ్బన్ కో ఆర్డినేటర్ కె.మోహన్ రావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భాస్కర్‌రావు వర్ధంతి సందర్భంగా అన్నదానం

బుచ్చిరెడ్డిపాళెం,డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): బీజేపీ నేత, మాజీ ఎంపీటీసీ సభ్యుడు, బుచ్చి రూరల్ బ్యాంకు వైస్ చేర్మన్, దివంగత రామిశెట్టి భాస్కర్‌రావు వర్ధంతి సందర్భంగా శుక్రవారం మండలంలోని అనాధ ఆశ్రమాలలో అన్నదానం చేశారు. స్థానిక కొత్త బస్టాండ్ సెంటర్‌లో భాస్కరయ్య విగ్రహానికి కుటుంబ సభ్యులతోపాటు పలువురు బీజేపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కాసా శ్రీనివాసులు, కార్యవర్గ సభ్యుడు రామిశెట్టి మోహన్‌బాబు, సీనియర్ నాయకులు ఎం. శ్రీనివాసులు. మణికంఠ, శివ, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయ మండలాధికారి శ్యామ్‌సుందర్

కొడవలూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల గ్రామ సచివాలయ మండల అధికారిగా శ్యామ్ సుందర్ నియమితులయ్యారు. ఆయన్ను ఎంపీడీవో సుబ్బారావు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయాల్లో ప్రజా సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు.

ఉజ్వల గ్యాస్ కనెక్షన్ల పంపిణీ

బుచ్చిరెడ్డిపాళె,డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): బుచ్చి మున్సిపాలిటీలోని రామచంద్రాపురంలో శుక్ర వారం మహిళలకు బీజేపీ అర్బన్ అధ్యక్షుడు రామిశెట్టి కళ్యాణ్ కుమార్, పలువురు నాయకులు ఉచిత ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కళ్యాణ్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ ప్రతి మహిళా ఆరోగ్యంగా వుండాలనే ఉద్దేశంతో ప్రతి నిరుపేద కుటుంబానికి ఉచిత గ్యాస్ కనెక్షన్లు పంపిణీకి ఉజ్వల పథకంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కాసా శ్రీనివాసులు, 10వవార్డు టీడీపీ ఇన్‌చార్జ్ సీహెచ్.సునీల్, సురేంద్ర,కోటయ్య, మల్లికార్జున పాల్గొన్నారు.

తల్లిదండ్రులు.. గురువులదే కీలక పాత్ర!

ఘనంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాలు

తోటపల్లిగూడూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : గిరిజన పిల్లల స్కూలుకు వచ్చే విధంగా వారి అభ్యున్నతికి ఉపాధ్యాయులు కృషి చేయాలని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని తోటపల్లిగూడూరు ఎస్ఎస్ఆర్ ఉన్నత పాఠశాలలో మెగా పేరెంట్స్ డేకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. విద్యా వ్యవస్థ రూపురేఖలు మార్చేందుకు విద్యాశాఖ మంత్రి లోకేష్ కృషి చేస్తున్నారని తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో ఒక్క పిల్లవాడికి అమ్మఒడిని ఇస్తే అదే తెలుగుదేశం ప్రభుత్వంలో కుటుంబంలో ఎంత మంది పిల్లలు ఉన్నా తల్లికి వందనం అందజేశామన్నారు. నియోజక వర్గంలో 32600 మందికి రూ.42.38 కోట్లు పిల్లలకు అందజేశామని, సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్లు 22149 మంది విద్యార్థులకు రూ.6 కోట్ల15 లక్షలతో పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఇన్‌లాండ్ వాటర్ అథారిటీ చైర్మన్ జెడ్డా శివప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, మండల అధ్యక్షులు రఘుబాబు, జహర్‌సాహెబ్ డిస్ట్రిబ్యూటర్ చైర్మన్ సోమిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కోడూరు శ్రీనివాసులురెడ్డి, సన్నారెడ్డి సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● **ఇందుకూరుపేట :** ముదివర్తిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం తల్లిదండ్రులు ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం జరిగింది. బీజేపీ మండల అధ్యక్షులు కైలాసం శ్రీనివాసులు పాల్గొన్నారు. పిల్లలను బాధ్యతగల పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులదే కీలకపాత్ర అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సదానందరావు, నేదురుమల్లి సుబ్బారెడ్డి, నారాయణ, శేషకుమార్ పాల్గొన్నారు.

● **బుచ్చిరెడ్డిపాళెం:** పిల్లల చదువు విషయంలో తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకమని బుచ్చి మున్సిపల్ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ అన్నారు. బుధవారం బుచ్చి మున్సిపాలిటీ, మండలవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో మెగా పీటీఎం, 3.0 (పేరెంట్స్, టీచర్స్ మీటింగ్) ఆత్మీయ సమావేశం జరిగింది. పట్టణంలోని డీఎల్ఎన్ఆర్ హైస్కూల్లో జరిగిన సమావేశంలో చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ మాట్లాడారు. విద్యాబోధన గురించి అడిగి తెలుసుకుని, తల్లిదండ్రులు ఏవైనా సమస్యలుంటే ఉపాధ్యాయుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ అధ్యక్షుడు గుత్తా శ్రీనివాసులు, హెచ్ ఎంలు, ఎస్ఎంసీ కమిటీ చైర్మన్లు, సర్పంచులు, ఎంపీ టీసీలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

● **విడవలూరు :** తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం మండలంలోని ముదివర్తి, అలగానిపాడు ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం ఘనంగా జరిగింది. ముదివర్తి పాఠశాల్లో జరిగిన వేడుకల్లో మండల కోఆప్షన్ మెంబరు ఎస్.కె.రఫీ మాట్లాడుతూ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కలసికట్టుగా విద్యార్థుల భవిష్యత్తుకి కృషి చేయాలన్నారు. పాఠశాల ఆభివృద్ధికి రూ. 50 వేలు విరాళంగా అందజేసి ఉపాధ్యాయులను సన్మానించారు. అలగానిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో గ్రామ సర్పంచు శీలు శేషయ్య, టీడీపీ నాయకులు కొపర్తి హరనాథ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ముదివర్తి హైస్కూల్ ఎస్ఎస్‌సీ చైర్మన్ ఎస్.కె. కర్ముల్లా, పీఏసీఎస్ చైర్‌పర్సన్ రాజ, గ్రామ పార్టీ అధ్యక్షుడు గుమ్మడి లక్ష్మీనారాయణ, అలగానిపాడు టీడీపీ నాయకులు నారాయణ, జనార్ధన్ పాల్గొన్నారు.

● **పొదలకూరు :** పొదలకూరులోని డీఎన్ఆర్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు శుక్రవారం హైదరాబాద్‌లో స్థిరపడిన పాఠశాల పూర్వ విద్యార్థి ఇరుగంటి శ్రీనివాస ప్రసాద్ ప్రింటర్‌ను బహూకరించారు. పాఠశాల హెడ్మాస్టర్ సీహెచ్ సురేష్‌కు దాత మేనమామ రిటైర్డ్ టీచర్ ఉప్పల రాధాకృష్ణయ్య ఈ ప్రింటర్‌ను అందజేశారు. రిటైర్డ్ టీచర్ రాధాకృష్ణయ్య, పూర్వ విద్యార్థి వాసు, విద్యా కమిటీ చైర్మన్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

● **ముత్తుకూరు :** శుక్రవారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలు పలు పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. ముత్తుకూరు ఉన్నత పాఠశాలలో కెనరా బ్యాంకు సౌజన్యంతో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్ మొదలగు విద్యా వసతులను తల్లిదండ్రులు పరిశీలించారు. అదానీ ఫౌండేషన్ సీఎస్ఆర్ హెడ్ రాజేష్‌రంజన్ తల్లిదండ్రులను ఉద్దేశించి తమ ఫౌండేషన్ ద్వారా పాఠశాలలకు కల్పించే వసతులు గురించి వివరించారు. విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు స్వప్న, ఎంపీడీవో నాగమణి, మండల విద్యాశాఖాధికారులు మధుసూదన్, హేమ సుందర్ రావు పాల్గొన్నారు. బ్రహ్మదేవి పంచాయతీ జడ్పీ హైస్కూల్‌లో మెగా పేరెంట్స్ ఆత్మీయ సమావేశంలో తిరుపతి పార్లమెంటు గౌరవాధ్యక్షుడు కొత్తపల్లి రమేష్ కుమార్ శర్మ, సాగునీటి సంఘం అధ్యక్షులు ఆలూరు వెంకట విష్ణువర్ధన్ రావు, విద్యా కమిటీ చైర్మన్ మహేష్, సీనియర్ నాయకులు దాసరి శ్రీనివాసులు, బొబ్బేపల్లి అంకయ్య, వెంకట రమణయ్య పాల్గొన్నారు.

● **రాపూరు:** మండలంలోని కళాశాలలు, పాఠశాలల్లో శుక్ర వారం మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ పండుగ వాతావరణంలో నిర్వహించారు. విద్యార్థుల పురోగతిపై ఉపాధ్యాయులతో తల్లిదండ్రులు చర్చించారు. పిల్లలచేత ఎంఈవో శ్రీనివాసులు ప్రతిజ్ఞ చేయించారు. టీడీపీ మండల అధ్యక్షులు చెన్ను అశోక్ రెడ్డి, ఎంపీడీవో మారెళ్ల భవాని, ప్రధానోపాధ్యాయులు అనిల్ కుమార్, క్లస్టర్ 3 ఇన్‌చార్జ్ వెంకటరమణా రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి మధు రెడ్డి, సర్పంచ్ భూపతి జయమ్మ, జనసేన వీర మహిళ కస్తూరి తదితరులు పాల్గొన్నారు.

● **పొదలకూరు :** విద్యాశాఖలో మంత్రి లోకేష్ విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని పీఏసీఎస్ చైర్మన్ తలచీరు మస్తాన్‌బాబు, ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం పొదలకూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, పాఠశాలల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో వారు మాట్లాడారు. నియోజక వర్గంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను అంతర్జాతీయ ప్రమాణాలతో సిద్ధం చేయాలన్నదే ఎమ్మెల్యే సోమిరెడ్డి లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు మల్లికార్జున నాయుడు, బోగోలు భాస్కర్‌రెడ్డి, పేరెంట్స్ కమిటీ చైర్మన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ నాహిద్, తల్లిదండ్రులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

● **వెంకటాచలం :** విద్యార్థులు కష్టపడి చదువుకుని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జిల్లా ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి (ఆర్ఐఓ) టీ వరప్రసాద్ రావు సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డులను తల్లిదండ్రులకు అందజేశారు. విశ్రాంత డిప్యూటీ జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ కేఈసీ విద్యాసాగర్, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకట్ నాయక్, అధ్యాపకులు శ్రీదేవి, వెంకటరత్నం, బాలసుబ్రహ్మణ్యం, ప్రసాద్, ఆశీర్వాదం, ఖాదర్ బాషా తదితరులు పాల్గొన్నారు మంగళంపాడు ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం జరిగిన మెగా పీటీఎం ఆత్మీయ సమావేశంలో ఎస్ఐయుఓ సుధాకర్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణ ప్రసాద్, ఉపాధ్యాయులు, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు. చవటపాళెం పీఏసీఎస్ చైర్మన్ రావూరి రాధాకృష్ణమనాయుడు వెంకటాచలం ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం పీటీఎం సమావేశంలో పాల్గొన్నారు. నిడిగుంటపాళెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంపీడీఓ కల్పన, సర్వేపల్లి కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కెనాల్ చైర్మన్ చల్లా నాగార్జున్‌రెడ్డి, టీడీపీ మండలాధ్యక్షుడు కట్టం రెడ్డి రాధాకృష్ణారెడ్డి, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ వల్లెపు మునుస్వామి, హెచ్‌ఎం లతా, నేతలు రావూరి పద్మనాభ నాయుడు, శ్రీనితారెడ్డి పాల్గొన్నారు. కనుపూరు ఆదర్శ ప్రాథమిక పాఠశాలకు శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన దాత ఒంగోలు సుబ్రహ్మణ్యం రూ.10 వేల విలువ చేసే ఒక బీరువా, రెండు కుర్చీలను వితరణ చేశారు. హెచ్‌ఎం సైదా పర్వీన్, విద్యా కమిటీ చైర్మన్ శిరీష పాల్గొన్నారు.



తోటపల్లిగూడూరులో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



విడవలూరు : ముదివర్తిలో ఉపాధ్యాయినిని సత్కరిస్తున్న టీడీపీ నాయకులు



ఇందుకూరుపేటలో..



కోవూరులో మాట్లాడుతున్న ఎమ్పీడీవో శ్రీహరిరెడ్డి



బుచ్చిరెడ్డిపాళెంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సుప్రజ



ముత్తుకూరులో జరిగిన సమావేశంలో పాల్గొన్న టీడీపీ నాయకులు, తల్లిదండ్రులు



రాపూరులో విద్యార్థులతో అధికారులు

వారి కష్టాలకు కారణం కాకాణే

● సర్వేపల్లి టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

వెంకటాచలం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : తిరుమలమ్మపాళెం వాసుల కష్టాలకు కారణం మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డేనని సర్వేపల్లి టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని తిరుమలమ్మపాళెం గ్రామాన్ని కండలేరు వరద చుట్టుముట్టిన నేపథ్యంలో శుక్రవారం టీడీపీ నేతలతో కలిసి ఆయన సందర్శించారు. ఈసందర్భంగా వివిధ శాఖల అధికారులు, నేతలతో కలిసి బోటులో గ్రామానికి వెళ్లారు. గ్రామస్థుల కష్టాలను స్వయంగా చూసి వారికి ధైర్యం చెప్పారు. ఆయన మాట్లాడుతూ ద్విత్వా తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు కండలేరు వాగు పొంగి గ్రామాన్ని చుట్టుముట్టిందన్నారు. జలదిగ్బంధనంలో చిక్కుకున్న గ్రామస్థులు బోటులో రాకపోకలు సాగిస్తున్నారన్నారు. ఇంత మంది ఇబ్బందులకు కారణం కాకాణేనన్నారు. 2019లో మంత్రిగా తిరుమలమ్మపాళెం హైలెవల్ బ్రిడ్జికి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి నిధులు సాధించి శంకుస్థాపన చేశారన్నారు. పనులు ప్రారంభమయ్యే సమయంలో అధికారం మారడంతో కాకాణి బ్రిడ్జి నిర్మాణాన్ని అర్థంతరంగా అడ్డుకున్నారని విమర్శించారు. వైసీపీ ఐదేళ్ల బ్రిడ్జి ఊసే ఎత్తలేదన్నారు. కాకాణి తన చేతకానితనంతోనే ఈ రోజు గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి మళ్లీ నిధులు సాధించి పనులు పూర్తి చేయించే బాధ్యత తమదేనన్నారు. రైతులకు ఉచితంగా విత్తనాలు అందజేసి ఆదుకోవాలని ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకెళ్లారన్నారు. ఖచ్చితంగా రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ కల్పన, నేతలు రావూరి రాధాకృష్ణమనాయుడు, చల్లా నాగార్జున్‌రెడ్డి, ఈపూరు సుబ్బారెడ్డి, వల్లెపు మునుస్వామి, పర్రి మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ నేతలతో కలిసి బోటులో వెళ్తున్న సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

కోవూరు చెరువుకట్ట పటిష్టతకు నిధులు

కోవూరు, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కోవూరు చెరువు కట్ట పటిష్టతకు రూ10లక్షలు మంజూరు చేసినట్లు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. కోవూరు చెరువును ఆమె శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోవూరు రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చెరువు కట్టను పటిష్ట పరుస్తున్నామన్నారు. తాను ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకువెళ్లడంతో వెంటనే నిధులు మంజూరయ్యాయన్నారు. చెరువు కట్టపై నివాసముంటున్న 70 కుటుంబాలకు పక్కా ఇళ్ల నిర్మాణానికి నివేశస్థలాన్ని కేటాయిస్తామన్నారు. చెరువు పరిసరప్రాంత జనావాసాలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఆమె వెంట పెన్నాడెల్టా చైర్మన్ జెట్టి రాజగోపాలరెడ్డి, ఎంఎస్ఈ డైరక్టర్ రావెళ్ళ వీరేంద్రనాయుడు, మాజీ ఎంపీపీ యాకసిరి వెంకటరమణమ్మ, టీడీపీ నాయకులు కొల్లారెడ్డి సుధాకరరెడ్డి, మల్లారెడ్డి. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు ఉన్నారు



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

విద్యార్థుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

కొడవలూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గండవరం గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్ ఆత్మీయ సమావేశంలో రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గండవరం సర్పంచ్ బచ్చు సురేష్, దేవస్థానం చైర్మన్ ఆలం మాలకొండయ్య, నీటి సంఘాల ప్రెసిడెంట్ కంచి ఈశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అంతరాయం లేకుండా చూడాలి

కోవూరు, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్తు సరఫరాలో అంతరాయంలేకుండా చూడాల్సిందిగా ఆంధ్రప్రదేశ్ దక్షిణ విద్యుత్తు పంపిణీ సంస్థ(ఏపీఎస్‌పీడీసీఎల్) డైరక్టర్ (టెక్నికల్) కే గురవయ్య ఆ శాఖాధికారుల్ని కోరారు. స్థానిక డివిజన్ కార్యాలయంలో శుక్రవారం అధికారుల సమీక్షలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో విద్యుత్తుశాఖాధికారులు రమేష్ చౌదరి, మధుసూదన్‌రెడ్డి, సతీష్, సురేంద్ర, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మంచి వ్యక్తిని కోల్పోవడం బాధాకరం : సోమిరెడ్డి

వెంకటాచలం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : డబ్బుగుంట గోపాలయ్య లాంటి మంచి వ్యక్తిని టీడీపీ కోల్పోవడం బాధకరమైన విషయమని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి విచారం వ్యక్తం చేశారు. కంటేపల్లి పంచాయతీ మాజీ సర్పంచ్, టీడీపీ సీనియర్ నేత గోపాలయ్య గురువారం సాయంత్రం మృతి చెందారు. దీంతో శుక్రవారం నెల్లూరులోని వారి స్వగృహానికి ఎమ్మెల్యే సోమిరెడ్డి చేరుకున్నారు. ఈసందర్భంగా గోపాలయ్య పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

C.R.I.M.E N.E.W.S

మద్రాసు బస్టాండు వద్ద కారు బీభత్సం

● తోపుడు బండ్లపైకి దూసుకెళ్లిన వైనం
● ఇద్దరు మహిళలకు స్వల్పగాయాలు

నెల్లూరు(క్రైం), డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): నగరంలోని కూరగాయల మార్కెట్ సమీపంలో నెహ్రూ విగ్రహం వద్ద శుక్రవారం ఓ కారు బీభత్సం సృష్టించింది. ఈ ఘటనలో రోడ్డు పక్కన పూలు విక్రయించే ఇద్దరు చిరు వ్యాపారులకు స్వల్ప గాయాలయ్యాయి. నగరానికి చెందిన పీవీ సుబ్బయ్య శుక్రవారం వీఆర్‌సీ సెంటర్ నుంచి ఆర్టీసీ బస్టాండు వైపు కారులో వెళుతుండగా సరిగ్గా నెహ్రూ విగ్రహం వద్దకు వచ్చే సరికి కారుకు ఆటో అడ్డురాగా బ్రేకు వేయబోయి కంగారులో ఎక్స్‌లేటర్ తొక్కడంతో కారు వేగంగా రోడ్డుకు పక్కనే ఉండే పండ్ల బండ్లను గుద్దుకుంటూ అక్కడే ఉన్న పోస్టుబాక్సును ఢీకొని ఆగింది. ఈ ఘటనలో నగరంలోని కేఎల్ఎం షాపింగ్ మాల్‌కు సమీపంలోని ప్రాంతంలో నివాసం ఉంటున్న ఇద్దరు మహిళలకు స్వల్పగాయాలయ్యాయి. వెంటనే కారు నడుపుతున్న పీవీ సుబ్బయ్య క్షతగాత్రులను చికిత్స నిమిత్తం వైద్యశాలకు తరలించారు. ట్రాఫిక్ పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

గూడ్స్‌రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

కావలి రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కావలి రైల్వే స్టేషన్లో గూడ్స్ రైలు ఢీ కొని ఓ గుర్తు తెలియని వ్యక్తి (25) గురువారం అర్ధరాత్రి మృతి చెందాడు. లోకో పైలెట్ జీఆర్పీ పోలీసులకు ఇచ్చిన సమాచారం మేరకు.. రైల్వే స్టేషన్లోని రెండవ నెంబరు ప్లాట్ ఫారం నుండి ట్రాక్ దాటుతుండగా మూడవ లైన్లో చెన్నె వైపు వెళ్తున్న గూడ్స్ రైలు ఢీకొంది. దీంతో అతడు సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. ట్రాక్‌పై మృతదేహం పడి ఉన్న తీరును బట్టి ట్రాక్ దాటుతూ ప్రమాదవశాత్తు గానీ, ఆత్మహత్య చేసుకోవాలన్న ఉద్దేశంతోగానీ ఈ ఘటన జరిగి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ ఎస్ఐ వెంకట్రావ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి...

కోవూరు, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): కడప- నెల్లూరు మార్గంలోని పోతిరెడ్డిపాళెం సమీపంలో శుక్రవారం మోటారు బైకుపై వెళుతున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాల్లో వెళ్తే.. బుచ్చిరెడ్డిపాళెం మండల పరిధిలోని రేబాల గ్రామానికి చెందిన షేక్ ఇబ్రహీం(45) మోటారుబైక్‌పై నెల్లూరు నగరానికి బయలుదేరాడు. వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనాస్థలానికి చేరకున్నారు. అదేమార్గంలో వెళ్తున్న రేబాల గ్రామస్థులు మృతదేహాన్ని గుర్తించారు. బేల్దారి పనులకు వెళుతూ జీవనం సాగించే ఇబ్రహీం నెల్లూరు నగరానికి వెళ్తుండగా ప్రమాదం జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఎస్ఐ ముత్యాలరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలి ఆరోపణలు అవాస్తవం

● కావలి డీఎస్పీ శ్రీధర్

కావలి, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): కావలిఆర్టీసీ బస్టాండ్ పరిధిలో ఓ వృద్ధురాలు యువకుల బలహీనతలను ఆసరాగా చేసుకుని, వారిని ప్రలోభపెట్టి డబ్బు తీసుకుని పోతున్నారని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆమెపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టామని కావలి డీఎస్పీ పీ. శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్‌లో ఉన్న సీసీ పుటేజీలు ఆధారంగానే ఆమెపై విచారణ చేశామన్నారు. ఆమెను ప్రశ్నించగా పొంతనలేని సమాధానాలు ఇచ్చిందన్నారు. అయితే ఆమె వయస్సు రీత్యా గ్రామపెద్దలు, బంధువుల అభ్యర్థన మేరకు హెచ్చరించి పంపామన్నారు. అయితే ఆమహిళ ఏరియా వైద్యశాలలో చేరి కుటుంబ సభ్యులతో కలసి పోలీసులపై తప్పుడు ఆరోపణలు చేయటం బాధాకరమని, ఆమె చెప్పిన విషయాల్లో వాస్తవం లేదన్నారు. ఇలాంటి అసత్య ఆరోపణలు చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకోవాల్సివస్తుందన్నారు. కావలి సబ్‌డివిజన్‌లో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించిఆ చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పెన్నానదిలో మహిళ ఆత్మహత్య

నెల్లూరు (క్రైం), డిసెం బరు 5 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని పెన్నా రైల్వే వంతెనపై నుంచి గుర్తు తెలియని మహిళ శుక్రవారం ఉదయం నదిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికుల సమాచారం మేరకు నవాబుపేట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. సుమారు 45- 50 ఏళ్ల మధ్య వయసున్న మహిళ మృతి చెందిందని, మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించినట్లు పోలీసులు తెలిపారు. మృతురాలి వివరాలు తెలిసినవారు 944079 6306కు సమాచారం ఇవ్వాలని ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్ రెడ్డి కోరారు.



గుర్తు తెలియని మహిళ మృతదేహం

పరిశ్రమల్లో స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలి

(5వ పేజీ తరువాయి)

ఏర్పాటుతో ఈ ప్రాంతం మొత్తం కలుషితమై ఊళ్లకు ఊళ్లు ఖాళీ చేయాల్సిన దుస్థితి ఏర్పడుతుందని అన్నారు. భూసేకరణ చేస్తున్న గ్రామాలకు ఆర్అర్ ప్యాకేజీ అమలుచేసి ఖాళీ చేయించాలని, పునరావాస కాలనీలు నిర్మించాలని విన్నవించారు. ఇప్పటివరకు ఇండోసోల్, రామాయపట్నం పోర్టులలో 10 శాతం కూడా స్థానికులకు ఉద్యోగాలు కల్పించలేదని చాపల రమణయ్య, పోట్లేళ్ల మురళి, పి. శ్రీను, నూతలపాటి శ్రీనివాసులు తదితరులు మాట్లాడారు.

● **బీపీసీఎల్‌తో అభివృద్ధి : కలెక్టర్**

ప్రభుత్వ రంగ సంస్థ అయిన బీపీసీఎల్ రాకతో ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. సుమారు 5 వేల ఎకరాల్లో రూ.1.03 లక్షల కోట్లతో ఈ పరిశ్రమ ఏర్పాటు కాబోతున్నట్లు తెలిపారు. స్థానికులకు ఉపాధి అవకాశాలు దొరుకుతాయని తెలిపారు. కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వర రావు మాట్లాడుతూ తొలుత నైపుణ్య శిక్షణ సంస్థను ఏర్పాటు చేసి, అందులో స్థానిక యువతకు శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. భూములు కోల్పోతున్న రైతులకు, రైతు కూలీలకు న్యాయం చేయాలని, అలాగే మత్స్యకార కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ బోర్డు ఈఈ అశోక్ కుమార్, సబ్‌కలెక్టర్ హిమ వంశీ, కావలి రెవిన్యూ డివిజనల్ అధికారి చైతన్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆర్థిక సంఘం నిధుల మంజూరు

నెల్లూరు (సిటీ), డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థలకు 15వ ఆర్థిక సంఘం 2వ విడత నిధులు రూ.281 మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను ఈ నిధులు మంజూరైనట్లు ఆర్థిక సంఘం ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. కార్పొరేషన్లు, మున్సిపాలిటీలతో ఇతర స్థానిక సంస్థలు ఉండగా, గ్రేడ్లు, జనాభా ప్రాతిపదికన రెండు, మూడు రోజుల్లో నిధులను కేటాయించి ఆయా సంస్థల ఖాతాల్లో జమ చేయనున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	145
స్కిన్ చికెన్	260
స్కిన్‌లెస్	284

కోడిగుడ్ల ధర (100): 670

రూ.4.90 కోట్లతో మాదరాజుగూడూరు రోడ్డు నిర్మాణం

నెల్లూరురూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి) : ప్రజల ప్రాయాణానికి తీవ్ర ఇబ్బందికరంగా మారిన మాదరాజుగూడూరు రోడ్డు నిర్మాణం రూ. 4.90 కోట్లతో చేపట్టనున్నట్లు టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం గ్రామంలో ఎంపీపీ విజయకుమార్, ఆర్అండ్‌బీ అధికారులతో కలిసి రోడ్డు పనులు చేపట్టే ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ రోడ్డు నిర్మాణం కోసం ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి ప్రభుత్వం నుంచి నిధులను సమీకరించారని తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణంతో పాటు రామలింగాపురం నుంచి ధనలక్ష్మీపురం వరకు రోడ్డు పనులకు మరో రూ.3.50 కోట్లు నిధులు మంజూరయ్యాయన్నారు. రూరల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు అభ్యర్థించిన వెంటనే అనుమతులు ఇస్తున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రులు లోకేష్, జనార్దన్‌రెడ్డిలకు ప్రత్యేక ధన్యవాదాలు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి, సర్పంచు వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు సారంగం గున్నయ్య, రాము, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వరుణదేవా.. వానలొద్దయ్యా..!

● ఉధృతంగా ప్రవహిస్తున్న పొట్టేపాళెం, ములుముడి కలుజులు ● వాహన రాకపోకలు ఆపేసిన అధికారులు ● ములుముడి వద్ద కలుజు దాటిస్తే రూ.300 ● రూరల్లో 8 వేల ఎకరాలకు సరిపడ నారుమళ్లు ధ్వంసం ● మరో 900 ఎకరాల వరి పైరు మునక



ఉధృతంగా ప్రవహిస్తున్న పొట్టేపాళెం కలుజు

నెల్లూరు(సిటీ), డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఈశాన్య రుతుపవనాలకు దిత్వా తుఫాన్ తోడై కురిసిన భారీ వర్షాలకు నెల్లూరు నగరం నీట మునిగి జలదిబ్బంధంలో చిక్కుకుంది. అనేక ప్రాంతాలు జలవలయంలో చిక్కుకున్నాయి. నగరానికి శివారునున్న ముంపు ప్రాంతాలన్నీ చెరువులను తలపిస్తున్నాయి. మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధ, గురువారం ఎడతెరపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు నెల్లూరు అతలకుతలమైంది. వాగులు, వంకలు ఏకమయ్యాయి. ఇల్లు, వాకిలి తేడాలేకుండా వరద నీటిముప్పులో చిక్కుకున్నాయి. దీంతో జనజీవనం స్తంభించడంతో సాధారణ పరిస్థితులు ప్రతికూలంగా మారాయి. ప్రజలెవ్వరు బయటకు రాలేని దుస్థితి ఏర్పడింది. నెల్లూరులో ఎక్కడ చూసిన నీళ్లే కనిపించాయి. శుక్రవారం ఉదయం కాస్త తెరపివ్వడంతో నగరవాసులు ఊపిరిపీల్చుకున్నారు. వరుణదేవా... వనలొద్దుయ్యా..! అంటూ ప్రజలు వేడుకుంటున్నారు. రోడ్లమీదకు వచ్చిన జనం రోజువారి కార్యకలాపాల్లో నిమగ్నమయ్యారు. కాగా నవంబరు 30 నుంచి శుక్రవారం వరకు నెల్లూరురూరల్లో ఎప్పుడు లేనంతగా ఏకంగా 33 సెం.మీ వర్షం పాతం నమోదు కాగా నగరంలో 30 సెం.మీ వర్షపడింది. దీంతో సాధారణ స్థితిని కోల్పోయిన ప్రాంతాలన్నీ ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాయి. తీవ్రంగా దెబ్బతిన్న చోట్ల తాత్కలిక మరమ్మతులు చేపట్టిన అధికారులు వాహనరాకపోకలను పునఃరుద్ధరించారు. నగరంలోని నాలుగు ప్రాంతాల వద్దనున్న అండర్ బ్రిడ్జీలలో సాధారణ స్థితి ఏర్పడింది. పొట్టేపాళెం, ములుముడి ప్రాంతాల వద్ద కలుజులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఇక్కడ ప్రమాద పరిస్థితులున్నాయని అధికారులు ప్రకటించారు. అటు అంబాపురం కాలువ, ఉడుములవాగులకు పండిన గండ్లను పూడ్చే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. సౌత్‌మోపూరు పంచాయతీ మొగళ్లపాళెం చిన్న చెరువుకు పడిన గండిని పూడ్చేందుకు ఇరిగేషన్ అధికారులు శ్రమిస్తున్నారు. 8 వేల ఎకరాలకు సరిపడ నారుమళ్లు ధ్వంసమైనట్లు వ్యవసాయ శాఖ ప్రాథమికంగా గుర్తించింది. మరో 900 ఎకరాలలో వరి పంట దెబ్బతిన్నట్లుగా తేల్చారు. అక్కడక్కడ అరటి సాగు పాడైంది. సౌత్‌మోపూరు, ములుముడి, నారాయణరెడ్డిపేట గ్రామాలలో మగ్గం గుంతల్లోనే నీరు ఉండటంతో నేత పనికి కార్మికులు దూరంగానే ఉన్నారు. పంటపొలాలు దెబ్బతిన్న ప్రాంతాలలో పనులు లేక వ్యవసాయ కార్మికులు ఇళ్లకే పరిమితం అయ్యారు.

● ఉధృతంగా ప్రవహిస్తున్న పొట్టేపాళెం, ములుముడి కలుజులు

నెల్లూరురూరల్‌లోని నెల్లూరు-జొన్నవాడ రహదారిలో పొట్టేపాళెం వద్ద ఉన్న నెల్లూరు చెరువు కలుజుపై వరద ప్రవాహం ఉధృతంగా ప్రవహిస్తుంది. పైనుంచి వచ్చిన నీటి దూకుడుతో ఈ ప్రాంతం ప్రమాదకరంగా మారింది. దీంతో వాహన రాకపోకలను పూర్తిగా ఆపేశారు. నెల్లూరు నుంచి జొన్నవాడ వైపు వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో దేవరపాళెం, ములుముడి, సౌత్‌మోపూరు, గొల్లకందుకూరు, తాటిపర్తి ప్రాంతాలకు వెళ్లాల్సిన వారు ఆమంచర్ల, పొదలకూరు, సౌత్‌మోపూరుల మీదుగా, జొన్నవాడ, సంగం, ఆత్మకూరు వైపు వెళ్లాల్సిన వారు నెల్లూరు కొత్త పెన్నావంతెన నుంచి బుచ్చి మీదుగా ప్రయాణం సాగించాల్సి ఉంది. 2,500 క్యూసెక్కుల వరకు ప్రవాహం వెళ్తుండటంతో స్థానిక గ్రామ పంచాయతీ కొందరు సిబ్బందిని ఇక్కడ విధుల్లో ఉంచారు. అటు నెల్లూరురూరల్ పోలీసులు నిత్యం పహారాకాస్తున్నారు. గురువారం ఓ యువకుడు ఇందులోపడి మృత్యువాత పడటంతో యంత్రాంగం అప్రమత్తమైంది. ఈ మేరకు కలుజు వద్ద పంచాయతీ అధికారులు హెచ్చరిక బోర్డును కూడా ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో చేపలుపట్టుకోవడం, సెల్ఫీలు దిగడాన్ని నిషేధించిన అధికారులు కలుజు వద్దకు ఎవరిని వెళ్లనివ్వడం లేదు. కాగా ఈ రోడ్డును ఆధునీకరించి ప్రయాణ కష్టాలు లేకుండా చేయాలని రూరల్ సీపీఎం నాయకులు శుక్రవారం కలుజు వద్ద ఆందోళన చేశారు.



ములుముడి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కలుజు

● ములుముడి వద్ద యువకుల సీజనల్ బిజినెస్

ద్విచక్ర వాహనాన్ని కలుజు దాటిస్తే రూ.300లు ఇవ్వాలి. ఇదేంటి అనుకుంటున్నారా..? పూర్తిగా చదివితే మీకే తెలుస్తుంది. నెల్లూరురూరల్ మండలం ములుముడి వద్ద చెరువు కలుజుపై వరద ప్రవాహం ప్రమాదకరంగా ప్రవహిస్తుంది. ద్విచక్ర వాహనాలు ఇక్కడ వెళ్లలేవు. దీనిని ఆదాయ వనరుగా మలుచుకున్న ఈ గ్రామ యువకులు కొందరు స్కూటర్లకు అటు, ఇటు దాటిస్తే రూ. 300 తీసుకుంటున్నారు. గురువారం నుంచి ఈ ప్రక్రియ కొనసాగుతోంది. నీటి ప్రవాహ ఉధృతికి తమ స్కూటర్‌ను తీసుకుని ముందుకు వెళ్లలేని కొందరు రూ.300 చెల్లించి కలుజు దాటాల్సి వస్తోంది.



రెవెన్యూ కాలనీ వద్ద తెగిన ఉడుములవాగు కట్టకు చేపట్టిన మరమ్మతులు



పొట్టేపాళెం కలుజు వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న గ్రామాధికారులు



ప్రజాదర్బార్‌లో వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

సమస్యల పరిష్కారానికి కృషి

● ప్రజాదర్బార్‌లో రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరురూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): తననియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తన వద్దకు తీసుకువస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం నగరంలోని తన కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో పలు ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమస్య ఏదైనా కానీ దానిని తనవంతు పరిష్కరించేందుకు చొరవ తీసుకుంటానన్నారు. తాను ప్రతీ రోజు ఉదయం 7 నుంచి రాత్రి 8 వరకు కార్యాలయంలోనే ప్రజల కోసం అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌లు ప్రవేశపెట్టిన ప్రజాదర్బార్ కార్యక్రమం ప్రజలకు, ప్రజాప్రతినిధికి చక్కటి సమన్వయం చేసుకునే అవకాశం కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

● తల్లికి వందనం ఓ చరిత్ర

చదువుకునే విద్యార్థుల కుటుంబాలకు ప్రభుత్వం ఇస్తున్న తల్లికి వందనం ఆర్థిక చేయూత దేశ చరిత్రలోనే ఓ అద్భుతమైన పథకమని ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి కొనియాడారు. 28వ డివిజన్ జడ్పీ హైస్కూల్లో నిర్వహించిన మెగా పీటీఎంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో పాఠశాలలోని నాలుగు తరగతులకు ఒక టీచరు ఉండేవారని, కానీ కూటమి ప్రభుత్వంలో లోకేష్ విద్యాశాఖ మంత్రిగా తరగతికి ఒక ఉపాధ్యాయుడుని చేశారని, ఈ అవకాశం విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆవాజ్ జిల్లా మహాసభలు జయప్రదం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అవాజ్ నేతలు

నెల్లూరు(వైద్యం), డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి) : నగరంలోని 54వ డివిజన్ భగత్ సింగ్ కాలనీ టిడ్కో అపార్టుమెంట్ ప్రాంగణంలో ఈనెల 7వ తేదీన జరగనున్న ఆవాజ్ జిల్లా 5వ మహాసభలను జయప్రదం చేయాలని అవాజ్ జిల్లా కార్యదర్శి షేక్ రషీద్ పిలుపునిచ్చారు. శుక్రవారం సీపీఎం జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మైనార్టీల సమస్యలపై 2002లో ఉమ్మడి రాష్ట్రాల్లో ప్రారంభమైన ఆవాజ్ అభివృద్ధి, భద్రత, లౌకికత్వంపై పనిచేస్తుందన్నారు. అనంతరం మహాసభ పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు షేక్ చాన్‌బాషా, షేక్ రియాజ్, సయ్యద్ రవూఫ్, చాన్‌బాషా, ఫయాజ్ పాల్గొన్నారు.

ఝాన్సీరాణికి ఘన సన్మానం



ఝాన్సీరాణిని సన్మానిస్తున్న సహచర ఉద్యోగులు, నాయకులు

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రజలకు 37 ఏళ్లపాటు విశిష్ట సేవలు అందించి పబ్లిక్ హెల్త్ నర్సుగా ఉద్యోగ విరమణ చేసిన కొండా ఝాన్సీరాణి సేవలు ఘనమైనవని హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని ఎన్జీవో హోంలో జరిగిన కార్యక్రమంలో ఆమెను శాలువాలు, పుష్పమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సహచర ఉద్యోగులు, అసోసియేషన్ నాయకులు జయశ్రీదుర్గా, శివకుమార్, సాయిరాం వైద్యశాల డాక్టర్ కే.లలితా షిర్డీషా, రిటైర్డు ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కల్పం శ్రీనివాసులు, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షురాలు స్వరాజ్యలక్ష్మి, మానవసేవయే మాధవ సేవ నిర్వాకురాలు అరవ పరిమళ, తదితరులు పాల్గొన్నారు.

'ట్రాప్' గ్యాంగ్‌లపై గురి!

(5వ పేజీ తరువాయి)

పోలీసులు బ్రేకులు వేశారు. వరుసపెట్టి ముఠాలను వెతికి పట్టుకొని జైలుకు పంపుతున్నారు. అయితే జైలుకెళ్లడం, తిరిగి రావడం ఈ గ్యాంగులకు అలవాటుగా మారింది. ఈ నేపథ్యంలో ముఠా కీలక నేతలపై మరింత కఠిన చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ వినిపిస్తోంది. అదే సమయంలో వందల మంది బాధితుల నుంచి రూ.కోట్లు దోచుకొని ఉన్నారు. ఆ ముఠాలు దోచుకున్న డబ్బును రికవరీ చేసి బాధితులకు న్యాయం చేస్తారో లేదో చూడాలి.

గంజాయి బ్యాచ్‌లను అణచి వేయండి

నెల్లూరురూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): గంజాయి బ్యాచ్‌లు ఎక్కడున్నా సరే కూకటి వేళ్లతో సహా అణచివేయాలని, రౌడీ అనేవాడు కంటికి కనపడకూడదని, భూకబ్జాదారులకు పోలీసులన్నా, చట్టమన్నా వెన్నులో వణుకురావాలని, శాంతిభద్రతలు కాపాడటంతో మీకు పూర్తి స్వేచ్ఛఉందని రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో రూరల్ నియోజకవర్గంలోని పోలీసు అధికారుల నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. నేనుకానీ, మా పార్టీ వాళ్లం కానీ పోలీసు విధులకు ఆటంకం కలిగించమని, అడ్డురామని, కూటమి ప్రభుత్వం వచ్చాక ఇప్పటి వరకు అలాంటి పనులు నా కార్యాలయం నుంచి జరగలేదన్నారు. ఇకపై కూడా జరగవు అని సూచించారు.

పెంచలయ్య హత్యపై ప్రభుత్వం స్పందించాలి

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన పెంచలయ్య హత్యపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని ఆర్‌పీఐ జిల్లా అధ్యక్షుడు ఎస్‌కే మాబు కోరారు. శుక్రవారం నగరంలోని ఆర్పీఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గంజాయికి వ్యతిరేకంగా పెంచలయ్య పోరాటం చేసి, గంజాయి మూకల చేతిలో దారుణ హత్యకు గురయ్యారని తెలిపారు. పెంచలయ్య హత్య జరిగి వారం అవుతున్నా జిల్లా యంత్రాంగం, ప్రభుత్వం స్పందించలేదన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి పెంచలయ్య కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి

● కలెక్టరేట్ వద్ద వీఆర్‌ఏల ధర్నా

నెల్లూరు(వైద్యం), డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి) : గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్‌ఏ)లకు కనీస వేతనం రూ.26వేల చెల్లించాలని కోరారు. ఈ మేరకు వీఆర్‌ఏలు శుక్రవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వీఆర్‌ఏల సంఘం గౌరవాధ్యక్షుడు పెంచల నర్సయ్య, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లచ్చయ్య, ఓబులేసు మాట్లాడారు. రెవెన్యూ శాఖలో సుదీర్ఘకాలం నుంచి చాలా తక్కువ వేతనాలతో వీఆర్‌ఏలు పనిచేస్తున్నారన్నారు. పార్ట్ టైం ఉద్యోగులైనా రాత్రి, పగలు తేడా లేకుండా పనిచేయించుకుంటున్నారని చెప్పారు. గత 8 ఏళ్లుగా ఒక్క రూపాయి కూడా వేతనం పెంచలేదన్నారు. గత 17 నెలలుగా వీఆర్‌ఏలకు వేతనాలు పెంచాలని, అర్హులైన వారికి ఉద్యోగోన్నతి కల్పించాలని ప్రభుత్వానికి వినతులు అందిస్తున్నా ఒక్క సమస్య పరిష్కరించలేదని పేర్కొన్నారు. వీరిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వేతనాలు అమలు చేయాలని కోరారు. వీరిని వీఆర్వో అసిస్టెంట్, రికార్డు అసిస్టెంట్, నైట్ వాచ్‌మెన్ పోస్టులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఏల సంఘం నాయకులు ఫరీద్, భాస్కర్, చిరంజీవి, పెంచలయ్య, మస్తాన్, పద్మ, పుల్లయ్య పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారాయణల

చిత్రపటాలకు పాలభిషేకం



చంద్రబాబు, నారాయణల చిత్రపటాలకు పాలభిషేకం చేస్తున్న దివ్యాంగులు, నాయకులు

నెల్లూరు(వెంకటేశ్వరపురం), డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని దివ్యాంగుల కోసం ఇంద్రధనస్సు వరాలను ప్రకటించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి దివ్యాంగుల ఐక్యసంఘం అధ్యక్షుడు సనావుల్లా ధన్యవాదాలు తెలిపారు. నగరంలోని వెంకటేశ్వరపురంలో శుక్రవారం సీఎం చంద్రబాబునాయుడు, రాష్ట్ర మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణ చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే దివ్యాంగులకు రూ.6వేల పించను పెంచారన్నారు. తాజాగా ఉచిత బస్సు ప్రయాణంతో పాటు పలు వరాలను ప్రకటించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ కో ఆప్షన్ సభ్యుడు జమీర్, ఐక్యవేదిక సభ్యులు అహ్మద్, శీనయ్య, వేణు, అచ్చమ్మ, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల ఉన్నతే లక్ష్యం

● రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ



వీఆర్ హైస్కూల్‌లో విద్యార్థులతో మంత్రి నారాయణ



పీఎస్ఎం పాఠశాలలో మాట్లాడుతున్న వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ అజీజ్

నెల్లూరు(విద్య), డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను అంతర్జాతీయ ప్రమాణాలతో సిద్ధం చేయాలన్న లక్ష్యంతో ఉన్నామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. నగరంలోని ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం నిర్వహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమష్టి ప్రోత్సాహంతోనే విద్యార్థుల శక్తియుక్తులు ద్విగుణీకృతమవుతాయన్నారు. విద్యార్థులకు మార్కులు ప్రామాణికం కాదని, ఎక్కువ వచ్చిన వారిని పొగడడం, తక్కువ వచ్చిన వారిని దండించడం సరికాదన్నారు. రానున్న విద్యా సంవత్సరానికి ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసి ఫౌండేషన్ కోర్సు ప్రారంభిస్తామన్నారు. అనంతరం మాక్ అసెంబ్లీలో సీఎం వద్ద ప్రశంసలు పొందిన మల్లెల సంజీవయ్య పాఠశాల విద్యార్థిని హేమ వర్షితను సన్మానించారు. అలాగే జాతీయస్థాయి క్రీడలకు ఎంపికైన ఆరు గురు విద్యార్థులను అభినందించారు. వీఆర్ హైస్కూల్ విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, డీఈవో బాలాజీరావు, కార్పొరేషన్ కమిషన్ నందన్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ఆంజనేయరెడ్డి, ప్రధానోపాధ్యాయులు మోహన్‌రెడ్డి, హరిప్రసాద్, మధుసూదన్‌బాబు, వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

● విద్యకు అత్యధిక ప్రాధాన్యం : అజీజ్

రాష్ట్రంలో ప్రభుత్వం విద్యపై ప్రత్యేక దృష్టి సారించి అన్ని విభాగాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఏపీ వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ అన్నారు. నగరంలోని పీఎస్ఎం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జరిగిన మెగా పేరెంట్, టీచర్స్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు, ఇంటివద్ద తల్లిదండ్రులు పిల్లల చదువుబాధ్యత తను తీసుకుంటే ఉన్నతంగా ఎదుగుతారన్నారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం సరిగాలేదని కొందరు విద్యార్థులు ఫిర్యాదు చేయగా వెంటనే స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను వేగవంతంగా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ తహసీన్, ప్రజా ప్రతినిధులు, అధికారులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

● డీకేడబ్ల్యు కళాశాలలో...

నగరంలోని డీకే ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహించిన మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో డీవీఈవో కృష్ణారెడ్డి, ఆర్ఐవో వరప్రసాద్ మాట్లాడుతూ నాణ్యమైన విద్య, క్రమశిక్షణ, విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి అన్ని కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రమణారెడ్డి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కే.కొండయ్య, డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రమణరావు, పేరెంట్స్ కమిటీ సభ్యులు, హాస్టల్ వార్డెన్స్, ఎన్ఎస్ఎస్ అధికారులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



డీకేడబ్ల్యూ కళాశాలలో మాట్లాడుతున్న డీవీఈవో కృష్ణారెడ్డి

సముద్రాన్ని తలపిస్తున్న పంటపొలాలు

● ఆందోళనలో అన్నదాతలు

మనుబోలు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గడిచిన పదేళ్లలో ఇలాంటి తుఫాన్ రాలేదని, ఇంతటి బీ భత్సం జరగలేదని మండల రైతాంగం ఆందోళన చెందుతోంది. శుక్రవారం నాటికి గ్రామాల్లోనే పంట పొలాలపై వరద ప్రవాహం తగ్గనేలేదు. సముద్రంను తలపిస్తున్న పొలాల చూసి రైతు కన్నీరు పెట్టుకున్నాడు. పొట్లేళ్లవాగు ప్రవాహం తగ్గి పొదలకూరు-మనుబోలు రాకపోకలు కొనసాగుతున్నాయి. అయితే మనుబోలు రహదారిపై ఇంకా కండలేరు ఉధృతంగా పారుతోంది. నార్లు, నారుమడులు ఇంకా నీటి లోనే నానుతున్నాయి. రెవెన్యూ, పోలీసు, ఇతర శాఖల అధికారులు జలవిలయంలో ఉన్న తీరప్రాంతాలకు ట్రాక్టర్లలో వెళ్ళి సహాయక చర్యలు అందిస్తున్నారు. ఆక్వా గుంతల వద్దనున్న వారిని పడవల ద్వారా ఒడ్డుకు తీసుకువస్తున్నారు.

● నష్టపోయిన రైతులకు విత్తనాలు : సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

మండలంలో వర్షాలకు దెబ్బతిన్న నార్లు, నారుమడులకు గాను నష్టపోయిన రైతాంగానికి విత్తనాలు అందించేలా ఎమ్మెల్యే ప్రభుత్వంతో మాట్లాడుతున్నారని సర్వేపల్లి నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. మండలంలోని తీరప్రాంతాలలో పర్యటించేందుకు ఆయన శుక్రవారం తీర ప్రాంతాల మార్గం వద్దకు చేరుకున్నారు. అయితే సమయానికి వర్షం రావడం, చీకట్లు కమ్ముకోవడంతో మార్గం సుగమంగా లేదని నిలిచిపోయారు. అందుబాటులో ఉన్న తీరప్రాంత రైతులతో మాట్లాడి ధైర్యం చెప్పారు.. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గాలి రామకృష్ణారెడ్డి, మండలాధ్యక్షుడు పొన్నూరు రామకృష్ణయ్య, నాయకులు హనుమంతనాయుడు, మహేంద్ర, మధునాయుడు, కృష్ణమనాయుడు, వెంకటేశ్వర్లురెడ్డి, దండు చంద్రశేఖరరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.




తీరప్రాంత వాసులతో మాట్లాడుతున్న సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

సీపీఎం నేతల గృహనిర్బంధం అన్యాయం

● సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్

నెల్లూరు(వైద్యం), డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక వాడల పేరుతో సీపీఎం నేతలను గృహనిర్బంధం చేయడం దారుణమని ఆపార్టీ జిల్లా కార్యదర్శి మూలం రమేష్ పేర్కొన్నారు. శుక్రవారం సీపీఎం జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కారుచౌకగా భూములు కట్టపెడుతుందన్నారు. చేవూరు, రావూరు, అనేమడగు గ్రామాల్లో బలవంతంగా భూసేకరణ చేసి బీపీసీఎల్ కంపెనీ భూమిపూజ చేస్తుందన్నారు. ఈ నేపథ్యంలో కందుకూరు, కావలి ప్రాంతాల్లో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు తూళ్లూరు మాల్యాద్రి, మరుపూటి రాధాకృష్ణయ్య, కందుకూరులో సీపీఎం కమిటీ సభ్యుడు ఎస్‌కే గౌస్, సీఐటీయూ నేత జీవీబీ కుమార్ తదితర నేతలను గృహనిర్బంధం చేయడం దారుణమన్నారు. దీనిని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. పచ్చటి పొలాలను కారుచౌకగా పెట్టుబడిదారులకు కట్టబెట్టేందుకు కూటమి ప్రభుత్వం పూనుకోవడం సరికాదన్నారు. భూమికోల్పోయిన నిర్వాసితులకు నష్టపరిహారం ఇవ్వకుండా భూమిపూజకు పూనుకోవడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేతలు మాదాల వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మంగళ పుల్లయ్య, కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి తుళ్లూరు గోపాల్, సీఐటీయూ మహిళా నేత రెహనాబేగం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్

నివాసాలు కోల్పోయిన వారికి టిడ్కో ఇళ్లు

నెల్లూరు(సిటీ), డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఆక్రమణలు తొలగింపులో భాగంగా నివాసాలు కోల్పోయిన వారికి టిడ్కో ఇళ్లను కేటాయించారు. నగరంలోని మూడు సినిమా హాళ్ల సమీపం వద్ద కల్యాణి ఫిలింమ్స్ ఎదురు ఆక్రమణలను సిటీప్లానింగ్ అధికారులు తొలగించారు. అక్కడ ఇళ్లు కోల్పోయిన బాధితులతో కమిషనర్ నందన్ శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. వారందరికీ టిడ్కో ఇళ్లు కేటాయిస్తూ పత్రాలు అందచేశారు. అలాగే ఎల్ఆర్ఎస్, బీపీఎస్‌లపై కార్పొరేషన్ కార్యాలయంలో ఓపెన్ ఫోరం, సిటీప్లానింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు.



టిడ్కో ఇళ్లు కేటాయింపు పత్రాలు అందజేస్తున్న కమిషనర్ నందన్



కొండ.. కోనల్లో.. లోయల్లో...

గల గల గంగమ్మ పరవళ్లు

కనువిందు చేస్తున్న జలపాతాలు





చుట్టూ అడవులు.. పచ్చని చెట్లు.. ఎత్తయిన కొండలు.. అక్కడ నుంచి పాలవెల్లువలా దుమికే జలపాతం.. హోరెత్తే నీటి హోయలు ఇవన్నీ పెంచలకోన సొంతం. మొన్న మొంథా.. ఇప్పుడు దిత్వా తుఫాన్ల తాకిడితో వరుసగా కురుస్తున్న భారీ వర్షాలకు రాపూరు మండలం పెంచలకోన, జిల్లా పొరుగున ఉన్న భైరవకోన పర్యాటకులను పరుస్తున్నాయి. పెంచలకోనలో దాదాపు 500 మీటర్ల కన్నా ఎక్కువ ఎత్తు నుంచి స్వచ్ఛమైన నీటి ప్రవాహంతో పరవళ్లు తొక్కుతూ జలపాతం కిందకు దూకుతోంది. కణ్వనది నుంచి స్వచ్ఛమైన నీరు కోన మీదుగా కండలేరుకు చేరుతోంది. అటు పర్యాటకులకు, ఇటు ప్రకృతి ప్రేమికులకు మధురానుభూతిని పంచుతూ.. ఎనలేని ప్రకృతి సౌందర్యాన్ని తనలో నిక్షిప్తం చేసుకుని మళ్లీ రారమ్మని ఆహ్వానిస్తోంది ఈ పెంచల నృసింహుడి క్షేత్రం. అలాగే ప్రముఖ పర్యాటక శైవక్షేత్రం భైరవకోనలోనూ జలపాతం కనువిందు చేస్తోంది. ఈ సుందర దృశ్యాలను చూసేందుకు పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు భారీగా తరలివస్తున్నారు. నీటి ప్రవాహంపై తెల్లటి నురగ.. చుట్టేసిన పొగమంచు చూపరుల మదిని హత్తుకుంటున్నాయి. వాగును తలపించేలా ప్రవహిస్తున్న నీరు శ్రీ త్రిముఖ దుర్గాదేవి అమ్మవారి పాదాలను తాకుతున్నాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులు చిన్నాపెద్దా తారతమ్యం లేకుండా జలపాతం వద్ద కేరింతలు కొడుతూ సందడి చేస్తున్నారు.

- రాపూరు/సీతారామపురం (ఆంధ్రజ్యోతి)





సీతారామపురం : భైరవకోన జలపాతంలో కేరింతలు కొడుతున్న పర్యాటకులు

పరమశివుడి పాదాలను తాకుతూ ప్రవహిస్తున్న గంగమ్మ →

రాపూరు : పెంచలకోనలో ఎత్తయిన కొండల్లో నుంచి పాలవెల్లువలా దుముకుతున్న జలపాతం

రాపూరు : కణ్వనదిలో పారుతున్న స్వచ్ఛమైన నీరు

సీతారామపురం : భైరవకోనలో జలపాతం



జాతీయ రహదారిపై బైఠాయించిన అయ్యప్ప భక్తులు

సేవ్ కలువాయి!

● తిరుపతిలో కలపొద్దు! ● హైవేపై బైఠాయించిన అయ్యప్ప భక్తులు

కలువాయి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి జిల్లాలో కలపొద్దు.. సేవ్ కలువాయి నినాదాలతో అయ్యప్పభక్తులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. వెంకటరెడ్డిపల్లి సమీపంలోని జాతీయ రహదారిపై స్వాములు బైఠాయించి కలువాయిని నెల్లూరులోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. దీంతో సుమారు అరగంటపాటు వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ నిరసనలో మండలంలోని యువత పాల్గొని వారికి మద్దతు తెలిపారు. ఎస్‌ఐ కోటయ్య ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

● దాచూరులో సంతకాల సేకరణ

మండలంలోని దాచూరు గ్రామంలో జిల్లా మార్పుపై సర్పంచు రాజుల అనురాధ ఆధ్వర్యంలో ప్రజలతో సంతకాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచు శ్రీనివాసులరెడ్డి, టీడీపీ, బీజేపీ, జనసేన, నాయకులు పాల్గొన్నారు.

వెంకటాచలంలో ఇన్‌క్లూజివ్ స్పోర్ట్స్ అకాడమీ

ముత్తుకూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : స్వతంత్ర విద్యుత్ ఉత్పత్తి సంస్థలలో ఒకటైన ఎస్‌ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ ఇంటెలెక్చువల్ డిసెబిలిటీస్‌తో కలిసి ఇన్‌క్లూజివ్ స్పోర్ట్స్ అకాడమీని నిర్మించనున్నారు. ఈ మేరకు శుక్రవారం ఎస్‌ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ సీఈవో జయమేజయ మహాపాత్ర, ఎన్‌ఐఈపీఐడీ డైరెక్టర్ మేజర్ డాక్టర్ బి.వి.రామ్‌కుమార్ అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సహకారంతో వెంకటాచలంలో ఉన్న కాంపోజిట్ రీజనల్ సెంటర్ ఫర్ స్కిల్ డెవలప్‌మెంట్, రిహాబిలిటేషన్ అండ్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ డిసెబిలిటీస్ ప్రాంగణంలో ఇన్‌క్లూజివ్ స్పోర్ట్స్ అకాడమీ నిర్మాణం చేపట్టనున్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ సీఈవో జనమేజయ మహాపాత్ర మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం ఎస్‌ఈఐఎల్ ఎనర్జీ ఎప్పుడూ కట్టుబడి ఉంటుందన్నారు. ఈ భాగస్వామ్యం ద్వారా దివ్యాంగజనుల కోసం క్రీడలను ప్రోత్సహించడం, వారు తమ పూర్తి సామర్థ్యాన్ని ఆవిష్కరించుకునే అవకాశాలను పెంపొందించడం లక్ష్యమన్నారు.

ఈ నెల 21న పల్స్‌పోలియో

నెల్లూరు (వైద్యం) డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 21వ తేదీన పల్స్‌పోలియో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో సుజాత తెలిపారు. శుక్రవారం నగరంలోని తన కార్యాలయంలో గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యులతో పల్స్‌పోలియో కార్యక్రమ నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. హైరిస్క్ ఏరియాలలో పిల్లలను గుర్తించి పోలియో చుక్కలు వేయించాలని డీఎంహెచ్‌వో సూచించారు. అనంతరం లింగ వివక్ష, మెడికో లీగల్ కేర్‌పై కూడా వైద్యులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి ఉమామహేశ్వరి, అదనపు డీఎంహెచ్‌వో ఖాదర్‌వలి, డీపీఎంవో సునీల్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవల తర్వాత

ఆసరా ఏదీ!?

● శస్త్రచికిత్స అయ్యాక మందులు, ఇతర ఖర్చులకు నగదు ఇవ్వని ప్రభుత్వం

● గతేడాది అక్టోబరు నుంచి ఆగిన ఎన్టీఆర్ వైద్యసేవ ఆసరా

● సుమారు రూ. 9 కోట్ల వరకు బకాయిలు

● ఎప్పుడు వస్తాయో తెలియదంటున్న అధికారులు

ఎన్టీఆర్ వైద్యసేవ పథకం కింద శస్త్రచికిత్స చేయించుకున్న తర్వాత , ఇంట్లో విశ్రాంతి తీసుకుంటూ వైద్యసేవలు పొందుతున్నవారికి నగదు ప్రోత్సాహం అందటం లేదు. ప్రతినెలా వివిధ వ్యాధులకు ఆరోగ్యశ్రీ కింద రోగులు శస్త్రచికిత్సలు చేయించుకుంటారు. అలాంటి వారికి నెట్‌వర్క్ ఆసుపత్రుల నుంచి డిశ్చార్జ్ అయిన 24 గంటల్లో నగదు వారి బ్యాంక్ ఖాతాల్లో పడుతుంది. విశాంత్రి సమయంలో వైద్య చికిత్సలతోపాటు మందులకు, ఇతర ఖర్చులకు నెలకు సుమారు రూ. 5వేల వరకు ఆర్థికసాయం అందుతుంది. అయితే గత ఏడాది అక్టోబరు నుంచి ఈ సాయం అందటం లేదు.



నెల్లూరు (వైద్యం), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత ప్రభుత్వం ఆరోగ్య ఆసరా పథకాన్ని అందుబాటులో తీసుకువచ్చింది. ఈ పథకాన్ని 2019 డిసెంబరు 1న అప్పటి సీఎం జగన్మోహన్‌రెడ్డి ఆర్భాటంగా ప్రారంభించారు. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో శస్త్రచికిత్సలు చేయించుకునే వారికి ఈ పథకం అమలు చేస్తున్నారు. ఇప్పటికే ఎన్టీఆర్ వైద్యసేవ పథకం కింద జిల్లాలోని నెట్‌వర్క్ ఆసుపత్రులకు ఇవ్వాల్సిన బకాయిలు పేరుకుపోయాయి. దీంతో వ్యాధిగ్రస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ తరుణంలో అధికారులు ఏమి చేయలేక చేతులెత్తేస్తున్నారు.

● ఎవరెవరికి ఎంతెంత ?

కాళ్లు, చేతులు విరిగినవారు 3 నెలల ఇంట్లోనే విశ్రాంతి తీసుకోవాలి. వారికి రూ. 15వేల వంతున ఆసరా అందిస్తున్నారు. క్యాన్సర్ రోగులకు మెడికల్ మేనేజ్‌మెంట్ కింద 180 రోజులకు రూ. 30వేలను చెల్లిస్తున్నారు. క్రిటికల్ చర్మవ్యాధుల వారికి ఏడాదికి రూ. 60వేల వంతన అందచేస్తున్నారు. ఈ లెక్కన గతేడాది అక్టోబరు నుంచి రోగులకు రూ. 9 కోట్ల వరకు బకాయిలు చెల్లించాల్సి ఉంది. ప్రతి నెలా 2వేల వరకు ఆరోగ్యశ్రీ కింద శస్త్రచికిత్సలు జరుగుతున్నాయి. కూటమి ప్రభుత్వం మొదటి నాలుగు నెలలు ఆసరా కింద రోగులను ఆదుకుంది. ఆ తర్వాత నుంచి నిధులు విడుదల చేయలేదు.

ఏటా ఆసరా కింద చెల్లిస్తున్న నిధులు

సంవత్సరం	ఆసరా రోగులు	చెల్లింపులు రూ. కోట్లలో
2021-22	33,863	16.94
2022-23	37,286	18.55
2023-24	39,888	20.39
2024-25	18,849	10.31
2025-26	16.500	9.00

ఎప్పుడు వస్తాయో తెలియదు...

జిల్లాలో ఎన్టీఆర్ వైద్యసేవ పథకం కింద చికిత్స చేయంచుకున్న రోగులకు ఆసరా పథకం కింద అందాల్సి నిధులు అందలేదు. ఏడాది కాలంగా బకాయిలు పేరుకుపోయాయి. ఆ నిధులు ఎప్పుడు వస్తాయో తెలియదు. అవి రాక పోవటంతో రోగుల నుంచి ఒత్తిడి ఎక్కువైంది.



- డాక్టర్ సుధీర్‌కుమార్, ఎన్టీఆర్ వైద్యసేవ పథకం జిల్లా కో ఆర్డినేటర్

కదలని గేట్లు.. రైతుల కంగారు !

● మొరాయించిన కండలేరు కాలువ గేట్లు! ● ఆగని నీటి ప్రవాహం... చెరువులపైకి మళ్లింపు

● అధికారులకు టెన్షన్ ● ఇప్పటికే చెరువులు నిండటంతో లబోదిబోమంటున్న రైతులు

కలువాయి. డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఎంకి పెళ్లి సుబ్బి చావుకొచ్చిందన్నట్లు... కండలేరు కాలువ గేట్లు కదలకపోవడం కలువాయి రైతులను కంగారు పెడుతోంది. సోమశిల జలాశయం వద్ద కండలేరు కాలువ గేట్లు పూర్తిగా కిందకు దిగకుండా మొరాయించాయి. దీంతో కండలేరు కాలువలోకి సుమారు 4వేల క్యూసెక్కుల ప్రవాహం వస్తుండటంతో శుక్రవారం తెలుగుగంగ అధికారులు ఈ నీటిని కండలేరు జలాశయం చేరకుండా మధ్యలో ఉన్న ఎస్కేప్ (అత్యవసర) చానల్ గేట్లు ఎత్తి కలువాయి, చవటపల్లి చెరువులపైకి మళ్లించారు. ఇప్పటికే ఈ చెరువులు నిండి కలుజు నీరు పొలాలను ముంచెత్తుంతోంది. ఈ సమయంలో మళ్లీ కండలేరు కాలువలోని నీటిని చెరువులపైకి మళ్లిండంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కండలేరు జలాశయంలో నీటి నిల్వ గరిష్ఠ మట్టానికి చేరుకుంది. ఈ నేపథ్యంలో దిత్వా తుఫాను కారణంగా కండలేరు పరివాహక ప్రాంతంలో కురిసిన వర్షాలకు డ్యాంలోకి వరద పోటెత్తింది. దీనికితోడు సోమశిల నుంచి కూడా కండలేరు డ్యాంకు నీటి విడుదల కొనసాగుతుండగా కండలేరు ప్రాజెక్టు వద్ద ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో అధికారులలో టెన్షన్ మొదలైంది. సోమశిల నుంచి కండలేరు కాలువకు నీటిని పూర్తిగా నిలిపివేసేందుకు ప్రయత్నించగా గేట్లు పూర్తి స్థాయిలో కిందకు దిగకపోవడంతో కాలువలోకి ప్రవాహం కొనసాగుతోంది. ఈ నీరు కండలేరుకు చేరితే అక్కడ ఇబ్బంది అవుతుందని అధికారులు రెండు ఎస్కేప్ గేట్లు తెరచి చెరువులపైకి మళ్లించారు. 18.4 కిలో మీటరు వద్ద ఉన్న ఎస్కేప్ గేట్లు ఎత్తి కలువాయి చెరువుకు అధికారులు నీటి మళ్లిస్తున్నట్లు సమాచారం అందుకుని కలువాయి రైతులు అక్కడికి చేరుకున్నారు. తెలుగుగంగ అధికారులకు వారి పరిస్థితిని వివరించి చెరువు పైకి నీరు మళ్లించద్దని వేడుకున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఉన్నాతాధికారుల ఆదేశాల మేరకు నీరు మళ్లించాల్సి వస్తోందని అధికారులు రైతులకు వివరించారు.



ఎస్కేప్ గేట్లు ఎత్తి నీటిని కలువాయి చెరువుకు మళ్లిస్తున్న తెలుగుగంగ అధికారులు



కలువాయి చెరువుపైకి నీటిని మళ్లించవద్దని అధికారులను కోరుతున్న రైతులు

రాజుపాలెం హైస్కూలుకు 15లక్షల విరాళం

● ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

కొడవలూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రాజుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు రూ.15లక్షల విరాళం అందజేస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ప్రకటించారు. శుక్రవారం రాజుపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మెగా పేరెంట్స్, టీచర్స్ ఆత్మీయ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులను ఒకే వేదికపై తీసుకొచ్చేలా కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేష్‌లకు ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు. పాఠశాల ఆవరణలోని గాంధీ విగ్రహానికి పుష్పాంజలి ఘటించిన అనంతరం ఆమె తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో ముచ్చటించారు. చిన్నారులు రూపొందించిన కళాకృతులను పరిశీలించారు. సాంస్కృతిక ప్రదర్శనలను ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ రాజుపాలెం హైస్కూల్‌లో అత్యవసర మౌలిక సదుపాయాల కల్పనకు వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా రూ.15 లక్షల విరాళాన్ని ప్రకటించారు. పిల్లలను బాధ్యత గల పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులదే కీలక పాత్ర అన్నారు. అధికారులతో మాట్లాడి స్లాబ్ లీకేజీలను అరికట్టడంలోపాటు అదనపు గదుల నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు స్ఫూర్తిరెడ్డి, ఎంపీడీవో సుబ్బారావు, హైస్కూల్ హెడ్‌మాస్టర్ ఓబులేసు, ఎంఈవో -1 ప్రసన్నకుమారి, ఎంఈవో-2 అంకయ్య, నాయకులు మందిపాటి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, తువ్వర ప్రవీణ్, నాసిన ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

● ఏడుగురి అరెస్టు, రూ.26 వేల స్వాధీనం

నెల్లూరు(క్రైం), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరంలోని కుక్కలగుంట కృష్ణ మందిరం వీధిలోని ఓ ఇంట్లో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై శుక్రవారం రాత్రి పోలీసులు దాడి చేశారు. నగర డీఎస్పీ ఐడీ పార్టీ సిబ్బంది, సంతపేట పోలీసులు సంయుక్తంగా ఈ దాడులు నిర్వహించారు. పేకాట స్థావరం నిర్వాహకుడు సుబ్బారావు, ఆరుగురు జూదరులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.26,100 నగదు, ఏడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

బియ్యం భోక్తులపై మౌనమేల...!

● రోజులు గడుస్తున్నా చర్యలు శూన్యం

ఉదయగిరి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పౌర సరఫరాల శాఖ గోదాములో బియ్యాన్ని స్వాహా చేసిన వారి విషయంలో ఉన్నతాధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రోజులు గడుస్తున్నా చర్యలు తీసుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆన్‌లైన్‌లో ఉన్న నిల్వలకు, ఉదయగిరి పౌరసరఫరాల గోదాములో ఉన్న నిల్వలకు భారీ వ్యత్యాస్యం ఉండడంతో గతనెల 21వ తేదీన జిల్లా అధికారులు గోదాముకు చేరుకుని రికార్డులు పరిశీలించారు. 4,000 బస్తాల బియ్యం స్వాహాకు గురైనట్లు గుర్తించి గోదామును సీజ్ చేశారు. పరిశీలనలో గుర్తించిన అంశాలతో రాష్ట్ర కార్యాలయానికి నివేదిక అందజేశారు. అనంతరం ఉదయగిరి పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా, శాఖా పరమైన విచారణ నివేదిక లేకుండా తాము కేసు తీసుకోలేమని, పూర్తిగా విచారణ జరిపి ఎప్పటి నుంచి బియ్యం స్వాహాకు గురయ్యాయి, ఎవరిపై అనుమానులున్నాయో స్పష్టమైన నివేదిక ఇవ్వాలని కోరారు. ఈ విషయాన్ని అధికారులు ఉన్నతాధికారులకు నివేదించారు. ఈ క్రమంలో గతనెల 26న విజయవాడ పౌరసరఫరాల ప్రధాన కార్యాలయ అధికారుల బృందం ఉదయగిరి గోదామును, అక్కడి రికార్డులను పరిశీలించింది. సెప్టెంబరు, అక్టోబరు మాసాల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించేసరికి చీకటి పడడం, అక్కడ విద్యుత్ సౌకర్యం సక్రమంగా లేకపోవడంతో నవంబరు మాసం రికార్డులు విజయవాడ తీసుకెళ్లింది. అప్పట్లో అధికారుల బృందాన్ని పలకరించగా గోదాములో 4,000 వేల బస్తాల బియ్యం స్వాహాకు గురైన మాట వాస్తవమేనని, నవంబరు మాసం రికార్డులు సైతం పరిశీలించి పూర్తి స్థాయి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని, రెండు రోజుల్లో చర్యలుంటాయని తెలిపారు. అయితే రోజులు గడుస్తున్నా ఈ కుంభకోణంలో సూత్రధారులెవరో.. పాత్రధారులెవరో తేల్చకపోవడం, ఏలాంటి చర్యలు చేపట్టకపోవడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బియ్యం భోక్తలెవరో తేలుస్తారో... లేక ఇలాగే నాన్చుతూ ఆపై అటకెక్కిస్తారో చూడాలి.



ఉదయగిరిలోని పౌరసరఫరాల శాఖ గోదాములో నిల్వలను పరిశీలిస్తున్న అధికారుల బృందం(ఫైల్)

సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన

కలువాయి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఆధ్వర్యంలో శుక్రవారం కలువాయిలో సైబర్ మోసాలపై ప్రజలకు కళాజాతా ద్వారా అవగాహన కల్పించారు. డిజిటల్ లావాదేవీల ప్రాధాన్యం, తక్కువ వడ్డీకి బంగారు రుణాలు, డిపాజిట్లపై అధిక వడ్డీ సహకార బ్యాంక్‌లు అందిస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో కలువాయి బ్రాంచ్ మేనేజర్ వర్ధన్, అసిస్టెంట్ మేనేజర్ జిలాని, సిబ్బంది సల్మాన్, సాయి పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 12313
వెండి కిలో ధర	రూ. 182600
వెండి ఒక గ్రాము	రూ. 187.60


ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి



సంగం ఉన్నత పాఠశాల పీటీఎం సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో షాలెట్


సీతారామపురం స్పెషల్ స్కూల్లో విద్యార్థికి భోజనం తినిపిస్తున్న ఎంఈవో షేక్ మస్తాన్‌వలి

విలువలతో కూడిన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యం

● రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ● పండుగ వాతావరణంలో మెగా పేరెంట్ టీచర్స్ సమావేశం



ఉదయగిరి : సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

చేజర్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పండుగ వాతావరణంలో నిర్వహించిన మెగా పేరెంట్ టీచర్స్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. తొలుత శాస్త్ర సాంకేతిక విజ్ఞాన ప్రదర్శనలను తిలకించి, లెర్నింగ్ టూల్స్ ద్వారా విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ రేపటి తరం భవిష్యత్తు కోసం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆలోచనల మేరకు మెగా పేరెంట్ టీచర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యమైన పౌష్టికాహారం, సర్వేపల్లి రాధాక్రిష్ణన్ విద్యామిత్ర కిట్లు, లీప్ యాప్‌ల ద్వారా విద్యార్థుల ప్రగతి తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా పాఠశాలకు చెందిన ఒక విద్యార్థి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరికీ ఐడి కార్డులు కావాలని అడగడంతో మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకువెళ్ళి కార్డులు ఇప్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు. పాఠశాలలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు జ్ఞాపికలను మంత్రి చేతుల మీదగా అందజేశారు. అనంతరం వారితో కలసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో పావని, డిడివో జానకిరాం, సోమశిల ప్రాజెక్ట్ చైర్మన్ కేశవచౌదరి, మండల అధ్యక్షుడు షేక్ సిరాజుద్దీన్, సొసైటీ చైర్మన్ రాఘవరెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు తాళ్ళూరు గిరినాయుడు, రావి పెంచలరెడ్డి, రావి లక్ష్మీనరసారెడ్డి, పలు గ్రామాల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

చదువుకు మించిన ఆస్తి లేదు : ఎమ్మెల్యే కాకర్ల

●**ఉదయగిరి:** చదువుకు మించిన ఆస్తి లేదని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు గుంటుపల్లి శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించిన మెగా పీటీఎం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి కోట్లాది రూపాయలు ఖర్చు చేసి ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్యనందిస్తోందన్నారు. విద్యార్థులు సాంకేతికతను సద్వినియోగం చేసుకొని నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు.

●**ఆత్మకూరు:** నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో శుక్రవారం మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ పండుగ వాతావరణంలో జరిగింది. ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో జరిగిన సమావేశాలకు ఎంఈవో అనంతలక్ష్మీ, ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ సూరా భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థుల తల్లిదండ్రులకు తమ పిల్లల ప్రగతిని తెలియజేసే హోలిస్టిక్ ప్రోగ్రస్ కార్డు (సమగ్ర ప్రగతి పత్రం)లు అందజేశారు.

వాసిలి ఉన్నత పాఠశాలకు రూ.50వేలు వితరణ

ఆత్మకూరు మండలంలోని వాశిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థి డాక్టర్ డి వెంకయ్య నాయుడు రూ. 50,000 వితరణగా అందజేశారు. ఈ నిధులు పాఠశాలకు కంప్యూటర్, ఇన్వర్టర్ కోసం అందజేసినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు, విజయ పాల డెయిరీ మాజీ డైరెక్టర్ గంగా శ్రీనివాసులు నాయుడు, ఉపసర్పంచ్ గంగా పద్మయ్యనాయుడు, ప్రధానోపాధ్యాయురాలు వి వసుంధరాదేవి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

●**సంగం:** స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గురుకుల పాఠశాలల్లో శుక్రవారం పీటీఎం సమావేశాలు జరిగాయి. ఎంపీడీవో షాలెట్, ఎంఈవో -2 మల్లయ్య ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థుల విద్యాభివృద్ధికి, పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. గురుకుల పీటీఎం సమావేశంలో ఐసీడీయస్ అధికారులు పాల్గొని బాల్య వివాహాలు, సాంఘీక దురాచారాలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అదేవిధంగా వెంగారెడ్డిపాళెంలో సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యం లో తల్లిదండ్రులకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనంలో (శుభ్‌దిన్ భోజన్) స్వీట్లు, అరటిపండ్లు అందించారు. ఈ కార్యక్రమంలో అయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, తల్లిదండ్రులు, కమిటీ సభ్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

●**కలువాయి:** స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన మెగా పేరెంట్ టీచర్స్ సమావేశంలో టీడీపీ మండల కన్వీనర్ చల్లా రఘురామిరెడ్డి పాల్గొని విద్యార్థులకు బహుమతులు అందజేశారు. తెలుగురాయపురం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డులు తల్లిదండ్రులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం. జీవీ మురళీకృష్ణ, టీడీపీ నాయకులు రాంనారాయణరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

●**ఏఎస్ పేట:** మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం మెగా పేరంట్ టీచర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో 2 సాయి ప్రసాద్ చిరమన, శ్రీకోలను, కావలిఎడవల్లి హైస్కూల్స్‌ను పరిశీలించారు. ఎంఈవో1 జ్యోతి అనుమసముద్రం మెయిన్, ఎస్సి, ఎస్‌డబ్ల్యూ పాఠశాలలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

●**సీతారామపురం:** స్థానిక కోటవీధిలోని స్పెషల్ స్కూల్, కస్తూర్బాగాంధీ విద్యాలయం, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాలల్లో శుక్రవారం మెగా పేరంట్ టీచర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో షేక్ మస్తాన్‌వలి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుంటే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని తెలియజేశారు.

విద్యార్థులకు పుస్తకాలు, పెన్నుల వితరణ


విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందజేస్తున్న తురక వెంకటేశ్వర్లు

సీతారామపురం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బసినేనిపల్లి గ్రామ పంచాయతీలోని ఎస్‌ఆర్ నగర్ గ్రామానికి చెందిన ఎస్‌ఆర్ నగర్ గ్రామ వ్యవస్థాపకుడు దివంగత తురక సత్యం జ్ఞాపకార్థంగా జిల్లా బీసీ సెల్ కార్యనిర్వాహక ప్రతినిధి తురక వెంకటేశ్వర్లు శుక్రవారం ఎస్‌ఆర్ నగర్‌లోని ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ కన్వీనర్ ముత్తంశెట్టి చెన్నకేశవులు, రమేష్, ఉపాధ్యాయులు శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

●**ఉదయగిరి :** మండలంలోని బిజ్జంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు దాతలు అందజేసిన స్టడీ మెటీరియల్‌ను శుక్రవారం ప్రధానోపాధ్యాయుడు జే మాధవరావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండాపురం మండలం సత్యవోలు గ్రామానికి చెందిన ఎస్‌ఆర్‌కే ఫౌండేషన్ అధినేత రామకృష్ణయాదవ్ స్టడీ కుర్చీలు, ప్యాడ్లు అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్కు రమణమ్మ, ఎస్‌ఎంసీ చైర్మన్ కవిత, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు


అధికారులతో మాట్లాడుతున్న ఏపీఎస్పీడీసీఎల్ టెక్నికల్ డైరెక్టర్ గురవయ్య

సంగం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలందించేందుకు కృషిచేస్తున్నామని ఏపీఎస్పీడీసీఎల్ టెక్నికల్ డైరెక్టర్ గురవయ్య పేర్కొన్నారు. శుక్రవారం ఆయన సంగంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులను, సిబ్బంది పనితీరును పరిశీలించారు. వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పీఎం సూర్యఘర్ పథకాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకునేలా ప్రజలను చైతన్యం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట డీఈ రమేష్, ఏడీ సతీష్, ఏఈ మన్మధరావు, సిబ్బంది పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశంలో మెడికల్ వ్యర్థాలను వేయడం నేరం

సంగం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య వైద్యశాలల్లో వాడిన మెడికల్ వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో వేయడం నేరమని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అశోక్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ముంబాయి రహదారి పక్కన కొండ లోయలో పారేసిన మెడికల్ వ్యర్థాలను పరిశీలించారు. సంగం పీహెచ్‌సీకి చెందినవి కాదని తెలిపారు. ఎక్కడినుంచి తెచ్చి ఇక్కడ వేశారో విచారించి ఉన్నతాధికారులకు నివేదిక అందచేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట స్థానిక వైద్యశాల ఫార్మసిస్ట్ ప్రదీప్, వైద్య సిబ్బంది ఉన్నారు.

ఆరోగ్యవంతమైన నేలతో నాణ్యమైన ఆహార ఉత్పత్తి

ఉదయగిరి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతైన నేల ఉన్నప్పుడే నాణ్యమైన ఆహార ఉత్పత్తి సాధ్యమవుతుందని కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జీ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మేకపాటి గౌతంరెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో ప్రపంచ మృత్తిక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నేల మనకు స్వచ్ఛమైన నీటిని, జీవ వైవిధ్యాన్ని అందిస్తుందని, దానిని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అచార్యులు గోపికృష్ణ, రఘునాథ్‌రెడ్డి, సునీత, కిషన్‌తేజ్, సూర్యకృష్ణ, శోభరాణి, అశోక్‌నాయక్, నాగహరీష్, మాలిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

దిత్వా తుఫాన్‌తో దెబ్బతిన్న పంట పొలాల పరిశీలన


సంగం: అన్నారెడ్డిపాళెంలో నీటి మునిగిన నారుమళ్లను పరిశీలిస్తున్న ఏవో శశిధర్

ఆత్మకూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్‌తో పంట పొలాలు నీట మునిగాయి. అధికారులు నష్టాలను అంచనా వేయడంలో నిమగ్నమయ్యారు. ఆత్మకూరు మండలంలో 70 ఎకరాల్లో శనగపంట, 170 ఎకరాలు మొక్కజొన్న, 50 ఎకరాల్లో పొగాకు, 300 ఎకరాల మేరకు వరినారు మళ్ల దెబ్బతినే అవకాశం ఉందని వ్యవసాయశాఖ -అధికారుల ప్రాథమిక సర్వేలో వెల్లడైంది. పంట నష్టాలను అంచనా వేసి నివేదికను ఉన్నతాధికారులకు పంపామని ఎంఏవో కె కిశోర్‌బాబు తెలిపారు. భారీ వర్షాల కారణంగా నీటమునిగిన వరినారుమళ్లలో ఐదు రోజుల లోపు నీటిని పూర్తిగా తొలగించి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని రైతులకు సూచించారు.

●**అనంతసాగరం:** దిత్వా తుఫాన్ ప్రభావంతో మండలంలో పలుగ్రామాల్లో దెబ్బతిన్న పంటలను ఏవో శైలజాకుమరి శుక్రవారం పరిశీలించారు. సంజీవనగరం, అనంతసాగరం గ్రామాల్లో పర్యటించారు. ఆమె మాట్లాడుతూ మొత్తం 700 ఎరకాల్లో వరినారుమళ్లు, 30 ఎకరాల్లో మినుము పంట దెబ్బతిందన్నారు. ఉన్నతాధికారులకు నివేదికను అందజేస్తామని తెలిపారు.

●**సంగం:** మండలంలో దిత్వా తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు నీట మునిగిన నారుమళ్లు, నాట్లను వ్యవసాయాధికారి శశిధర్ శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన రైతులకు సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

దాసరిపల్లిలో వీపీఆర్ నేత్ర వైద్య శిబిరం


రోగులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఉదయగిరి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దాసరిపల్లి గ్రామంలో శుక్రవారం వీపీఆర్ నేత్ర బస్సు శిబిరాన్ని మాజీ సర్పంచ్ సయ్యద్ జమ్మత్‌జాఫర్‌మొహిద్దీన్ టీడీపీ నాయకులతో కలిసి ప్రారంభించారు. అనంతరం వైద్యులు 400 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 220 మందికి అద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు బొజ్జా శ్రీనివాసులు, టీడీపీ నాయకులు నవాజ్, యూనస్, అక్రమ్‌అలీ, మైనుద్దీన్, సోహల్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులను ఆదరించాలి


భవిత కేంద్రంలో మాట్లాడుతున్న ఎంఈవో పి.రమేష్

వింజమూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భవిత కేంద్రంలో శుక్రవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈవో పి రమేష్ పాల్గొని మాట్లాడుతూ దివ్యాంగులు దేనిలోనూ తక్కువ కాదని వారిని ఆదరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యా వనరుల కేంద్రం సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆవాజ్ జిల్లా మహాసభను జయప్రదం చేయండి

ఉదయగిరి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులో ఆదివారం నిర్వహించే ఆవాజ్ జిల్లా 5వ మహాసభలను జయప్రదం చేయాలని మండల ఆవాజ్ కమిటీ అధ్యక్షుడు షేక్ నాయబ్‌రసూల్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మహాసభలకు ముస్లిం మైనారిటీ నాయకులు, ఆవాజ్ కమిటీ సభ్యులు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

వింజమూరు ఏపీ ఎన్జీవోల సంఘం ఎన్నిక ఏకగ్రీవం


ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

వింజమూరు, డిసెంబరు 5 (ఆంధ్ర జ్యోతి): ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ వింజమూరు తాలూకా యూనిట్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ శుక్రవారం ఉదయం ఎంపీడీవో కార్యాలయంలో జరిగింది. నామినేషన్ల ప్రక్రియ అనంతరం ఒక్కో పోస్టుకు ఒక్కో అభ్యర్థి నామినేషన్ దాఖలు చేయగా ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగినట్లు ఎన్నికల అధికారి కావలి తాలూకా అధ్యక్షుడు శివ సత్యనారాయణ, సహాయ ఎన్నికల అధికారి డీవీ.నాగరాజు, ఎన్నికల పర్యవేక్షణ అధికారి శ్రీధర్ ప్రకటించారు. వింజమూరు తాలూకా యూనిట్ అధ్యక్షుడిగా వెలుగోటి మధు, సహాధ్యక్షుడిగా ఎం కిరణ్ కుమార్, ఉపాధ్యక్షులుగా కె పద్మ, కె శ్రీనివాసుల రెడ్డి (ఎంపీడీవో, వింజమూరు), ఎ.వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా కె.రామారావు, సంయుక్త కార్యర్శులుగా బి రామిరెడ్డి, ఏ వివేకా, బి విజయమ్మ, సంయుక్త కార్యదర్శిగా డి తనూజ, కోశాధికారిగా పి నర సయ్య ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. నూతనంగా ఎన్నికైన వింజ మూరు తాలూకా యూనిట్ కార్యవర్గ సభ్యులను రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారుపల్లి వెంకటేశ్వర్లు, జిల్లా ఇన్‌చార్జ్ అధ్యక్షుడు నందిమండలం ఆంజనేయవర్మ, జిల్లా కార్యదర్శి గాదిరాజు రామ కృష్ణ సత్కరించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు వెలుగోటి మధు మాట్లా డుతూ ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు. కాగా, మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె స్వర్ణలత, జిల్లా జేఏసీ చైర్మన్ యు చిన్నమ్మ, వైస్ ప్రెసిడెంట్ ఇ కరుణమ్మ, జిల్లా కన్వీనర్ నవోదయ మహిళా విభాగం నూతన కార్యవర్గం మహిళా విభాగాన్ని ఎన్నుకున్నారు.

సాగునీటిని సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే కాకర్ల

ఉదయగిరి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొన్నెబోయిన చెంచురామయ్య గండిపాళెం జలాశయం నుంచి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, సతీమణి ప్రవీణలు క్రస్ట్‌గేట్లు ఎత్తి సాగునీటిని విడుదల చేశారు. తొలుత గంగమ్మ తల్లికి సారె సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించి జలహారతి చేపట్టారు. రబీ సీజన్ దృష్ట్యా కుడి, ఎడమ కాలువల ద్వారా 8 వేల ఎకరాల ఆయకట్టు భూములకు 45 క్యూసెక్కుల సాగు నీటిని విడుదల చేశారు. సాగునీటిని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెంచలబాబుయాదవ్, జలాశయ చైర్మన్ అడుసుమల్లి వెంకటసుబ్బయ్య, మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, సొసైటీ అధ్యక్షుడు గడ్డం వెంకటసామయ్య, సర్పంచ్ సామ్రాజ్యం, తహసీల్దారు షాజియా, డిప్యూటీ ఎంపీడీవో మోహన్‌రావు, జలవనరుల డీఈఈ చంద్రమౌళి, ఏఈలు సురేష్, వేణు ఎంఈవోలు వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ శ్రీనివాస రావు, టీడీపీ నాయకులు రియాజ్, బొజ్జా నరసింహా, నల్లిపోగు రాజా, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ గ్రామ కమిటీల ఎంపిక

మండలంలోని నేలటూరు, కృష్ణంపల్లి పంచాయతీల్లో శుక్రవారం ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీలను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. నూతనంగా ఎంపికైన కమిటీ ప్రభుత్వ పనితీరును ప్రజల్లోకి తీసుకెళ్లి గ్రామ స్థాయి నుంచి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. విబేధాల్లేకుండా అందరూ కలిసికట్టుగా ఉంటూ గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. అనంతరం నూతనంగా ఎంపికైన కమిటీని, గత ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేసిన నాయకులను సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

●**సీతారామపురం:** ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన మారంరెడ్డిపల్లి జేఎల్‌ఎం మహిమలూరి వెంకటేష్ కుటుంబాన్ని శుక్రవారం ఉదయగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల కన్వీనర్ కప్పు ప్రభాకర్‌రాజు, సొసైటీ చైర్మన్ సోమనబోయిన రాజశేఖర్, సర్పంచ్ ఆదినారాయణ, ఉదయగిరి కన్వీనర్ బయన్న, బుజ్జి, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

CRIME NEWS

మద్రాసు బస్టాండు వద్ద కారు బీభత్సం

● తోపుడు బండ్లపైకి దూసుకెళ్లిన వైనం
● ఇద్దరు మహిళలకు స్వల్పగాయాలు

నెల్లూరు(క్రైం), డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): నగరంలోని కూరగాయల మార్కెట్ సమీపంలో నెహ్రూ విగ్రహం వద్ద శుక్రవారం ఓ కారు బీభత్సం సృష్టించింది. ఈ ఘటనలో రోడ్డు పక్కన పూలు విక్రయించే ఇద్దరు చిరు వ్యాపారులకు స్వల్ప గాయాలయ్యాయి. నగరానికి చెందిన పీవీ సుబ్బయ్య శుక్రవారం వీఆర్‌సీ సెంటర్ నుంచి ఆర్టీసీ బస్టాండు వైపు కారులో వెళుతుండగా సరిగ్గా నెహ్రూ విగ్రహం వద్దకు వచ్చే సరికి కారుకు ఆటో అడ్డురాగా బ్రేకు వేయబోయి కంగారులో ఎక్స్‌లేటర్ తొక్కడంతో కారు వేగంగా రోడ్డుకు పక్కనే ఉండే పండ్ల బండ్లను గుద్దుకుంటూ అక్కడే ఉన్న పోస్టుబాక్సును ఢీకొని ఆగింది. ఈ ఘటనలో నగరంలోని కేఎల్‌ఎం షాపింగ్ మాల్‌కు సమీపంలోని ప్రాంతంలో నివాసం ఉంటున్న ఇద్దరు మహిళలకు స్వల్పగాయాలయ్యాయి. వెంటనే కారు నడుపుతున్న పీవీ సుబ్బయ్య క్షతగాత్రులను చికిత్స నిమిత్తం వైద్యశాలకు తరలించారు. ట్రాఫిక్ పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

గూడ్స్‌రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

కావలి రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కావలి రైల్వే స్టేషన్లో గూడ్స్ రైలు ఢీ కొని ఓ గుర్తు తెలియని వ్యక్తి (25) గురువారం అర్ధరాత్రి మృతి చెందాడు. లోకో పైలెట్ జీఆర్పీ పోలీసులకు ఇచ్చిన సమాచారం మేరకు.. రైల్వే స్టేషన్లోని రెండవ నెంబరు ప్లాట్ ఫారం నుండి ట్రాక్ దాటుతుండగా మూడవ లైన్లో చెన్నె వైపు వెళ్తున్న గూడ్స్ రైలు ఢీకొంది. దీంతో అతడు సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. ట్రాక్‌పై మృతదేహం పడి ఉన్న తీరును బట్టి ట్రాక్ దాటుతూ ప్రమాదవశాత్తు గానీ, ఆత్మహత్య చేసుకోవాలన్న ఉద్దేశంతోగానీ ఈ ఘటన జరిగి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ ఎస్ఐ వెంకట్రావ్ తెలి పారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి...

కోవూరు, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): కడప- నెల్లూరు మార్గంలోని పోతిరెడ్డిపాళెం సమీపంలో శుక్రవారం మోటారు బైకుపై వెళుతున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాల్లో వెళ్తే.. బుచ్చిరెడ్డిపాళెం మండల పరిధిలోని రేబాల గ్రామానికి చెందిన షేక్ ఇబ్రహీం(45) మోటారుబైక్‌పై నెల్లూరు నగరానికి బయలుదేరాడు. వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనాస్థలానికి చేరకున్నారు. అదేమార్గంలో వెళ్తున్న రేబాల గ్రామస్థులు మృతదేహాన్ని గుర్తించారు. బేల్దారి పనులకు వెళుతూ జీవనం సాగించే ఇబ్రహీం నెల్లూరు నగరానికి వెళ్తుండగా ప్రమాదం జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఎస్ఐ ముత్యాలరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలి ఆరోపణలు అవాస్తవం

● కావలి డీఎస్పీ శ్రీధర్

కావలి, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): కావలిఆర్టీసీ బస్టాండ్ పరిధిలో ఓ వృద్ధురాలు యువకుల బలహీనతలను ఆసరాగా చేసుకుని, వారిని ప్రలోభపెట్టి డబ్బు తీసుకుని పోతున్నారని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆమెపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టామని కావలి డీఎస్పీ పీ. శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్‌లో ఉన్న సీసీ పుటేజీలు ఆధారంగానే ఆమెపై విచారణ చేశామన్నారు. ఆమెను ప్రశ్నించగా పొంతనలేని సమాధానాలు ఇచ్చిందన్నారు. అయితే ఆమె వయస్సు రీత్యా గ్రామపెద్దలు, బంధువుల అభ్యర్థన మేరకు హెచ్చరించి పంపామన్నారు. అయితే ఆమహిళ ఏరియా వైద్యశాలలో చేరి కుటుంబ సభ్యులతో కలసి పోలీసులపై తప్పుడు ఆరోపణలు చేయటం బాధాకరమని, ఆమె చెప్పిన విషయాల్లో వాస్తవం లేదన్నారు. ఇలాంటి అసత్య ఆరోపణలు చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకోవాల్సివస్తుందన్నారు. కావలి సబ్‌డివిజన్‌లో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించిఇ చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పెన్నానదిలో మహిళ ఆత్మహత్య


గుర్తు తెలియని మహిళ మృతదేహం

నెల్లూరు (క్రైం), డిసెం బరు 5 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని పెన్నా రైల్వే వంతెనపై నుంచి గుర్తు తెలియని మహిళ శుక్రవారం ఉదయం నదిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికుల సమాచారం మేరకు నవాబుపేట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. సుమారు 45- 50 ఏళ్ల మధ్య వయసున్న మహిళ మృతి చెందిందని, మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించినట్లు పోలీసులు తెలిపారు. మృతురాలి వివరాలు తెలిసినవారు 944079 6306కు సమాచారం ఇవ్వాలని ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్ రెడ్డి కోరారు.

పరిశ్రమల్లో స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలి

(5వ పేజీ తరువాయి)

ఏర్పాటుతో ఈ ప్రాంతం మొత్తం కలుషితమై ఊళ్లకు ఊళ్లు ఖాళీ చేయాల్సిన దుస్థితి ఏర్పడుతుందని అన్నారు. భూసేకరణ చేస్తున్న గ్రామాలకు ఆర్‌ఆర్ ప్యాకేజీ అమలుచేసి ఖాళీ చేయించాలని, పునరావాస కాలనీలు నిర్మించాలని విన్నవించారు. ఇప్పటివరకు ఇండోసోల్, రామాయపట్నం పోర్టులలో 10 శాతం కూడా స్థానికులకు ఉద్యోగాలు కల్పించలేదని చాపల రమణయ్య, పోట్లేళ్ల మురళి, పి. శ్రీను, నూతలపాటి శ్రీనివాసులు తదితరులు మాట్లాడారు.

● బీపీసీఎల్‌తో అభివృద్ధి : కలెక్టర్

ప్రభుత్వ రంగ సంస్థ అయిన బీపీసీఎల్ రాకతో ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. సుమారు 5 వేల ఎకరాల్లో రూ.1.03 లక్షల కోట్లతో ఈ పరిశ్రమ ఏర్పాటు కాబోతున్నట్లు తెలిపారు. స్థానికులకు ఉపాధి అవకాశాలు దొరుకుతాయని తెలిపారు. కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వర రావు మాట్లాడుతూ తొలుత నైపుణ్య శిక్షణ సంస్థను ఏర్పాటు చేసి, అందులో స్థానిక యువతకు శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. భూములు కోల్పోతున్న రైతులకు, రైతు కూలీలకు న్యాయం చేయాలని, అలాగే మత్స్యకార కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ బోర్డు ఈఈ అశోక్ కుమార్, సబ్‌కలెక్టర్ హిమ వంశీ, కావలి రెవిన్యూ డివిజనల్ అధికారి చైతన్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆర్థిక సంఘం నిధుల మంజూరు

నెల్లూరు (సిటీ), డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థలకు 15వ ఆర్థిక సంఘం 2వ విడత నిధులు రూ.281 మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను ఈ నిధులు మంజూరైనట్లు ఆర్థిక సంఘం ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. కార్పొరేషన్లు, మున్సిపాలిటీలతో ఇతర స్థానిక సంస్థలు ఉండగా, గ్రేడ్లు, జనాభా ప్రాతిపదికన రెండు, మూడు రోజుల్లో నిధులను కేటాయించి ఆయా సంస్థల ఖాతాల్లో జమ చేయనున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	145
స్కిన్ చికెన్	260
స్కిన్‌లెస్	284

కోడిగుడ్ల ధర (100): 670



వేడుకగా వేణుగోపాల స్వామి కల్యాణం

అల్లూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : అల్లూరు పట్టణ పరిధిలోని వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ముందుగా స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణ వేదికపై కొలువుదీర్చారు. ఉదయగిరి అనంతాచార్యులు, పణి స్వామితో కూడిన అర్చక బృందం శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం జరిపించారు. ఈ వేడుకను చూసేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు.

విద్యార్థులకు క్యారియర్లు, నీటి బాటిళ్ల పంపిణీ

కలిగిరి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వద్ద దివ్యాంగ విద్యార్థులకు జైగౌడ ఉద్యమం ఉదయగిరి నియోజకవర్గ అధ్యక్షుడు పీ మాల్యాద్రి గౌడ్ శుక్రవారం క్యారియర్లు, నీటి బాటిళ్లను వితరణగా అందజేశారు. మాల్యాద్రిగౌడ్ మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో దివ్యాంగులకు ఉపకరణాలను శుక్రవారం అందించామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులతో పాటు చిన్నా, మహేష్, నజీర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు బహుమతులు



బహుమతులు అందుకున్న విద్యార్థులతో దాతలు, టీచర్లు

లింగసముద్రం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక కేఆర్ జడ్పీ హైస్కూల్‌లో 4వ తరగతి నుండి 10వ తరగతి వరకు పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు దాతలు నగదు బహుమతులు అందచేశారు. ఇదే హైస్కూల్‌లో గణిత ఉపాధాయుడిగా పనిచేసిన నీలకంఠశాస్త్రి జ్ఞాపకార్థం ఆయన శిష్యుడు ఎస్ఆర్‌ఐ కదిరి పార్థసారధి పంపించిన రూ.50 వేల నగదును ఆయన సోదరుడు నరసింహారావు హెచ్‌ఎం యు మాధవరావుకు అందించారు. దీంతో ఆయన విద్యార్థులకు అందచేశారు. ఈసందర్భంగా ఇటీవల స్టూడెంట్ అసెంబ్లీకి వెళ్లిన యేసుపోగు గ్లోరిని హెచ్‌ఎం, ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

సమాజ సేవలో భాగస్వాములు కావాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న మహేంద్రరెడ్డి, శ్రీరామసాయిబాబా వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు

కందుకూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా యువజన అధికారి ఏ మహేంద్రరెడ్డి సూచించారు. శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక శ్రీగాయత్రీ విద్యాపరిషత్ డిగ్రీ కాలేజీలో అంతర్జాతీయ స్వచ్ఛంద దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా అంతర్జాతీయ స్వచ్ఛంద దినోత్సవంపై విద్యార్థినీ, విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్‌ఎం ఆర్. వెంకటేశ్వర్లు (ఆర్వీ), కళాశాల ప్రిన్సిపాల్ పి. గీతాశ్రీనివాసరావు, శ్రీరామసాయిబాబా వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు రవ్వా శ్రీనివాసులు, కోట వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రజలకు అండగా నిలవడం నేరమా ?

బిట్రగుంట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ సంస్థలు అన్యాయంగా చేస్తున్న భూసేకరణను వ్యతిరేకిస్తూ స్థానిక ప్రజలకు అండగా నిలవడం నేరమా? అని మండల సీపీఎం సీనియర్ నాయకుడు తుమ్మలవెంకయ్య ప్రశ్నించారు. బోగోలు మండల సీపీఎం కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రుద్రకోట, పెద్దపట్టపుపాలెం తదితర ప్రాంతాల్లో కార్పొరేట్ సంస్థలు చేస్తున్న భూసేకరణను ఆయా గ్రామాల ప్రజలు వ్యతిరేస్తున్నారని తెలిపారు. వారికి మద్దతుగా వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు మాల్యాద్రిని రామయ్యపట్నం వెళ్లనివ్వకుండా గృహనిర్బంధం చేయడం సమంజసం అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండలాధ్యక్షుడు చల్లా నరహరి, భవన నిర్మాణ కమిటీ అధ్యక్షుడు షేక్ బాదుల్లా, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులకు సహకరించాలి

● తహసీల్దారు గిరీష్ కుమార్

కలిగిరి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కావలి-దుత్తలూరు జాతీయ రహదారి విస్తరణ కార్యక్రమంలో భాగంగా పట్టణంలో అక్రమ కట్టడాల తొలగింపు విషయమై శుక్రవారం తహసీల్దారు గిరీష్‌కుమార్ యజమానుల నుండి హక్కు పత్రాలను సేకరించారు. గ్రామనత్తం భూములతోపాటు పట్టా భూములు కలిగిన యజమానులకు సంబంధించి రోడ్డు మధ్య నుండి 50 అడుగులమేర కట్టడాలు ఎంతమేర తొలగించాల్సి వస్తుందో సర్వేయర్ల చేత కొలతలు తీయించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని రహదారి విస్తరణ పనులకు పట్టణ ప్రజలు సహకరించాలని తహసీల్దారు కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు వెంట వీఆర్వో, వీఆర్ఏ, సర్వేయర్లు ఉన్నారు.



యజమానులతో మాట్లాడుతున్న తహసీల్దారు గిరీష్

‘ట్రాప్’ గ్యాంగ్‌లపై గురి!

(5వ పేజీ తరువాయి)

పోలీసులు బ్రేకులు వేశారు. వరుసపెట్టి ముఠాలను వెతికి పట్టుకొని జైలుకు పంపుతున్నారు. అయితే జైలుకెళ్లడం, తిరిగి రావడం ఈ గ్యాంగులకు అలవాటుగా మారిపోయింది. ఈ నేపథ్యంలో ముఠా కీలక నేతలపై మరింత కఠిన చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ వినిపిస్తోంది. అదే సమయంలో వందల మంది బాధితుల నుంచి రూ.కోట్లు దోచుకొని ఉన్నారు. ఆ ముఠాల నుంచి దోచుకున్న డబ్బును రికవరీ చేసి బాధితులకు న్యాయం చేస్తారో లేదో చూడాలి.

పిల్లలతో స్నేహంగా మెలగాలి

కావలి మెగా పీటీఎంలో కలెక్టర్ హిమాన్షు శుక్లా

కావలి రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థులతో తల్లిదండ్రులు స్నేహపూర్వకంగా మెలగాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. స్థానిక వెంగళరావు నగర్‌లోని పొట్టిశ్రీరాములు మున్సిపల్ హైస్కూల్‌లో శుక్రవారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం జరిగింది. ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే దగ్గుమాటి వెంకట క్రిష్ణారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం నేడు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తోందన్నారు. నెలకు ఒక్కసారైనా పాఠశాలలకు వెళ్లి పిల్లల చదువు, నడవడిక గురించి తల్లిదండ్రులు ఆరా తీయాలన్నారు. ఎమ్మెల్యే కోరిక మేరకు పాఠశాల అభివృద్ధి కోసం రూ. 10 లక్షలు నిధులు మంజూరు చేస్తున్నట్లు కలెక్టర్ ప్రకటించారు.

చెడు వ్యసనాలకు అలవాటుపడితే జీవితాలు గల్లంతే: ఎమ్మెల్యే దగ్గుమాటి : విద్యార్థులు చెడు వ్యసనాలకు అలవాటుపడితే జీవితాలు గల్లంతేనని ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వం విద్యకు, పారిశ్రామికీకరణకు ఎంతో ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఎన్ని ఇబ్బందులు ఉన్నా కష్టపడి చదవాలని, ధైర్యంగా నిలబడాలన్నారు. అప్పుడే సమాజంలో మంచి గుర్తింపు వస్తుందన్నారు. జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు కలెక్టర్ ఎంతగానో కృషిచేస్తున్నారన్నారు. అనంతరం పట్టణంలో 100 అడుగుల జాతీయ జెండా, గ్యాలరీలో ఏర్పాటు చేసిన మహనీయుల చిత్రపటాలను కలెక్టర్, ఎమ్మెల్యే తిలకించారు. కలెక్టర్‌తో కలసి ఎమ్మెల్యే సెల్ఫీపాయింట్‌లో ఫోటోలు దిగారు. ఈ కార్యక్రమం లో ఆర్డీవో సన్నీ వంశీ క్రిష్ణ, మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్, తహసీల్ధార్ శ్రావణ్‌కుమార్, ఎంఈవోలు గోవిందయ్య, వెంకట సుబ్బయ్య, పాఠశాల ప్రధానో పాధ్యాయుడు వల్లేటి వెంకటేశ్వర్లు, కావలి జనసేన ఇన్‌చార్జి అళహరి సుధాకర్, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గుత్తికొండ కిషోర్, ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబురావు, జనసేన పట్టణ అధ్యక్షుడు బొబ్బా సాయి, స్థానిక నాయకులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



కావలిలో జరిగిన ఉపాధ్యాయ, తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

● మెగా పీటీఎంకు విశేష స్పందన

జలదంకి, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాశాఖ చేపట్టిన మెగా పీటీఎం (పేరెంట్స్, టీచర్స్ మేనేజ్‌మెంట్ కమిటీ) ఆత్మీయ సమావేశానికి జలదంకి మండలంలో విశేష స్పందన లభించింది. విద్యార్థుల తల్లిదండ్రులు ఉత్సాహంగా హాజరై తమ పిల్లలు ఎలా చదు



జలదంకి : హాజరైన తల్లిదండ్రులు, గ్రామపెద్దలు

వుతున్నారో ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు పలువురు గ్రామపెద్దలు ముందుకురావడం విశేషం. మండలంలోని లింగరాజు అగ్రహారం ప్రాథమిక పాఠశాలలో ఇదివరకే పలు అబివృద్ధి పనులు చేపట్టిన ‘మన ఊరు పిలుస్తోంది’ ట్రస్ట్ తరుపున హాజరైన ఛైర్మన్ గాలి శ్రీనివాసులు మౌలిక వసతుల విషయంలో మరింత సహకారం అందిస్తానని పేర్కొన్నారు. పట్ల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. సర్పంచ్ మంగలి తిరుమలను విద్యార్థుల తల్లిదండ్రులు సీసీరోడ్డు నిర్మించాలని కోరగా సర్పంచ్ తప్పకుండా వేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం ఎంఈఓలు నాగేశ్వరరావు, పద్మనాభయ్య పర్యవేక్షణలో జరిగాయి.

● తల్లిదండ్రుల సహకారం అవసరం

అల్లూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : తానూ విద్యార్థి దశలో పేదరికాన్ని అనుభవించానని కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి అన్నారు. అల్లూరు మండలం, నార్తుమోపూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉపాధ్యాయుడిగా తన ప్రయాణం ప్రారంభమైందని, కష్టాల్లో నుంచి పుట్టుకొచ్చిన పట్టుదలతో తాను ఈ స్థాయికి చేరుకున్నానన్నారు. ఉపాధ్యాయుల కృషి ఎంత అవసరమో విద్యార్థి అభివృద్ధికి తల్లిదండ్రుల సహకారం కూడా అంతే అవసరమన్నారు. విద్యాశాఖలో పెనుమార్పులు చోటు చేసుకున్నాయని, దేశంలోనే విద్యాశాఖను ఉన్నతస్థాయికి తీసుకెళ్లేందుకు మంత్రి లోకేష్ కృషి చేస్తున్నారన్నారు. తన సహకారం ఎల్లప్పుడూ విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు రేబాల శంకర్ రెడ్డి, నెల్లూరు నిరంజన్‌రెడ్డి, బండి శ్రీనివాసులు రెడ్డి, పలగాటి శ్రీనివాసులు రెడ్డి, మేడా కృష్ణారెడ్డి, ఊటు శ్రీకాంత్ రెడ్డి, విడవలూరు దశరథరామిరెడ్డి, ఎండేటి హరికృష్ణ, మండల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

● కోలాహలంగా పీటీఎం

బిట్రగుంట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మెగా టీచర్స్, పేరెంట్స్ మీటింగ్ శుక్రవారం కోలాహలంగా జరిగింది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ నరసమ్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఎంఈవో జయమ్మ, ఎంపీడీవో సుబ్రహ్మణ్యం హాజరయ్యారు. విద్యార్థినులకు మాస్టర్ రవిగన్ ఆధ్వర్యంలో నృత్యంతో



బిట్రగుంట : గురుకులంలో నృత్యంతో మార్షల్ ఆర్ట్స్ ప్రదర్శిస్తున్న బాలికలు

తైక్వాండో మార్షల్ ఆర్ట్స్ విన్యాసాలు ప్రదర్శించారు, పుస్తక, క్రీడా ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఎంఈవో, ఎంపీడీవోలు మాట్లాడుతు పిల్లల చదువుల పట్ల తల్లితండ్రులు బాధ్యత తీసుకోవాలన్నారు. అనంతరం హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులను విద్యార్థులకు పంపిణీ చేశారు. కప్పరాళ్లతిప్ప జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు, రైల్వే విశాంతి ఉద్యోగి పరిమి సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మెగా పేరెంట్ టీచర్స్ సమావేశం

కందుకూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కందుకూరు పట్టణం, రూరల్ మండల పరిధిలోని వివిధ ప్రాథమిక పాఠశాలలు, ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం మెగా పేరెంట్ టీచర్స్ సమావేశం ఘనంగా నిర్వహించారు. స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం ఎం. నరసింహమూర్తి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో విద్యార్థుల తల్లిదండ్రులకు పాఠశాలలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ పిల్లల పట్ల తల్లిదండ్రులు సైతం శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో పాటు తల్లిదండ్రులకు కూడా మధ్యాహ్న భోజనం ఏర్పాటుచేశారు. మున్సిపాలిటీ పరిధిలోని వెంకటాద్రిపాలెం ప్రాథమిక పాఠశాలలో మెగా పేరెంట్ టీచర్స్‌మీటింగ్‌లో ఎంఈఓలు ఎం. నాగకుమారశర్మ, ఎం. సుబ్బారెడ్డిలు పాల్గొని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, బోధనాపద్ధతుల గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ షేక్ నాగూర్‌వలీ ఆధ్వర్యంలో మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం నిర్వహించారు.



కందుకూరు : మెగా పీటీఎంకు తల్లిదండ్రులకు స్వాగతం పలుకుతున్న జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల టీచర్లు

● గురువులు, తల్లిదండ్రులను గౌరవించాలి

లింగసముద్రం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : గురువులను, తల్లిదండ్రులను విద్యార్థులు గౌరవించాలని ఎంఈవో-1 కె మాల్యాద్రి సూచించారు. శుక్రవారం స్థానిక కేఆర్ జడ్పీ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయుడు యు మాధవరావు అధ్యక్షతన మెగా పీటీఎం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులతో కలిసి ఉపాధ్యాయులు విద్యార్థుల ప్రగతిని సమీక్షించారు. అనంతరం ఎంఈవో మాల్యాద్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం



లింగసముద్రం : కేఆర్ జడ్పీ హైస్కూల్‌లో జరిగిన మెగా పీటీఎంలో మాట్లాడుతున్న ఎంఈవో మాల్యాద్రి

అందిస్తున్న సౌకర్యాలను ఉపయోగించుకొని విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 ఎంవి శివకుమార్, పలువురు ఎస్ఎంసి కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

● ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యాబోధన

ఉలవపాడు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యాబోధన అందుతుందని మండల తహసీల్దార్ టీ శ్రీవాసులు పేర్కొన్నారు. మండలంలోని భీమవరం హైస్కూల్‌లో శుక్రవారం ఇన్‌చార్జ్ హెచ్‌ఎం శివరావు అధ్యక్షతన నిర్వహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమ్మేళనంలో ప్రత్యేక పరిశీలకులుగా తహసీల్దార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రయివేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులతో కలిసి మొక్కను నాటారు.



ఉలవపాడు : పీటీఎం సందర్భంగా భీమవరం జడ్పీ హైస్కూల్‌లో మొక్క నాటిన తహసీలార్

● వలేటివారిపాలెం : మండలంలోని చుండి మోడల్ స్కూల్, చుండి ఎంపీపీ స్కూల్, వలేటివారిపాలెం హైస్కూల్ తదితర పాఠశాలల్లో శుక్రవారం మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చుండి మోడల్‌స్కూల్ ప్రిన్స్‌పాల్ శ్రీవెంకటేశ్వర్ మాట్లాడుతూ పేద విద్యార్థుల కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వలేటివారిపాలెం హైస్కూల్ హెచ్‌ఎం కమల్‌కుమార్, చుండి ఎంపీటీసీ చౌడబోయిన యానాది, నాయకులు చెరువుపల్లి మాల్యాద్రి, కామినేని వీరయ్య, కాకుమాను ఆంజనేయులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సునీత, కామినేని శ్రీనివాసులు, అంకయ్య పాల్గొన్నారు.

● విద్యార్థుల ప్రగతికి ఉపాధ్యాయులు బాటలు వేయాలి

దగదర్తి, (బిట్రగుంట) డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పాఠశాల అభివృద్ధి కార్యక్రమాలతో పాటు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలిసి విద్యార్థుల ప్రగతికి బాటలు వేయాలని ఎమ్మెల్సీ బీద రవిచంద్ర పేర్కొన్నారు. దగదర్తి మండలం అనంతవరం లయన్స్ నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆదిశేషయ్య ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన మెగా పేరెంట్స్, టీచర్స్ ఆత్మీయ సమావేశానికి ఆయన హాజరయ్యారు. విద్యార్థుల పుస్తక ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ విద్యాలయాలకు దీటుగా విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ తీర్చిదిద్దుతున్నారన్నారు. జిల్లాలోనే మోడల్ స్కూల్‌గా ప్రథమ స్థానంలో నిలబెట్టడానికి ఉపాధ్యాయులు, తల్లితండ్రుల సహకారం చాలా అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు భాస్కర్, విజయరత్నం, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, హెచ్‌ఎం మారుతి, ఎస్ఎంసీ ఛైర్మన్ నరేష్, టీడీపీ నేత మంద శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



దగదర్తి : అనంతవరం పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బీద రవిచంద్ర

● విలువలతో కూడిన విద్యను అభ్యసించాలి

కావలి రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని ఎంపీడీవో శ్రీదేవి పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం జరిగింది. సర్వాయపాలెం జెట్పీ హైస్కూల్లో ప్రధానోపాధ్యాయుడు తోట వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీదేవి పాల్గొన్నారు. 10వ తరగతి విద్యార్థులు 100 రోజుల కార్యాచరణ ప్రణాళికను అనుసరించి పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ ఛైర్మన్ మాధవరావు, ఎంపీటీసీ జంపాని శ్రీనివాసులు, పంచాయతీ అభివృద్ధి అధికారి రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

● పిల్లల ప్రగతిని వివరించేందుకే...

కొండాపురం, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో శుక్రవారం మెగా పేరెంట్స్, టీచర్స్ డే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆదర్శ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న మండల విద్యాశాఖాధికారి-2 ఆనందరావు మాట్లాడుతూ ఈ కార్యక్రమం పాఠశాలలను విద్యార్థుల ప్రగతిని తల్లిదండ్రులకు వివరించేందుకు ఆత్మీయ సమావేశం మంచి వేదిక అన్నారు. పాఠశాల అభివృద్ధిలో తలిదండ్రులు భాగస్వామ్యులను చేసేందుకు అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ నిధులను ఎటువంటి అభివృద్ధి పనులకు ఉపయోగించాలనే విషయాలపై విద్యా కమిటీ ఛైర్మన్లు, సభ్యులతో చర్చించారు. సాయిపేట దామా చినబాబు మెమోరియల్ జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు రామమోహనరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి తల్లిదండ్రులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమాలలో ఎంపీడీవో ఆదినారాయణరావు, టీడీపీ కన్వీనర్ పోలినేని చంద్రబాబు నాయుడు, గుడవళ్లూరు సర్పంచ్ మాచర్ల, నేకునాంపేట జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ ఖాదర్ బాషా పాల్గొన్నారు.

● కలిగిరిలో..

కలిగిరి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈవో సురేష్ పేర్కొన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం జరిగిన పీటీఎం 3.0 కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తోందన్నారు. విద్యాశాఖమంత్రి నారా లోకేష్ వినూత్న ఆలోచనలతో విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు కృషి చేస్తున్నారన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సహపంక్తి భోజనం చేశారు.



కలిగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో సహపంక్తి భోజనం చేస్తున్న ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు

50 శాతం రాయితీతో విద్యుత్‌లోడ్ క్రమబద్ధీకరణ

కావలి, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌లోడ్ క్రమబద్ధీకరణకు ఈ నెల 31 వరకు అవకాశం ఉందని, 50 శాతం రాయితీతో క్రమబద్ధీకరించుకోవచ్చని జిల్లా విద్యుత్‌శాఖ ఎస్ఈ కే రాఘవేంద్రం తెలిపారు. కావలి డివిజన్ కార్యాలయంలో శుక్రవారం అధికారులతో ఎస్ఈ సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం పుల్లారెడ్డినగర్ సబ్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. విద్యుత్ సమస్యలపై ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన వాట్సాప్ (9552300009) నంబరును ఉపయోగించుకుని విద్యుత్ సేవలను పొందవచ్చన్నారు. క్షేత్ర స్థాయిలో ట్రాన్స్‌ఫారంల నిర్వహణ సక్రమంగా లేక ట్రాన్స్‌ఫారంలు ఫెయిల్ అవుతున్నాయన్నారు. ట్రాన్స్‌ఫారంలను రెగ్యులర్‌గా మెయింటెనెన్స్ చేయాలని, ఏఈలు క్షేత్రస్థాయికి వెళ్లి వాస్తవ పరిస్థితులు తెలుసుకుని వినియోగదారలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. వినియోగదారులకు డిజిటల్ పేమెంట్స్‌పై సంస్థ ఉద్యోగులందరూ అవగాహన కల్పించాలన్నారు. 33కేవీ ఫీడర్లు, 11 కేవీ ఫీడర్లపై ప్రస్తుత విద్యుత్ లోడ్, వినియోగదారుల సంఖ్య, ఓవర్‌లోడ్ ఫీడర్ల పరిస్థితులను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కావలి ఈఈ బెనర్జీ, డిప్యూటీ ఈఈలు రవికుమార్, రవిచంద్ర, ఏఈవో రామాంజనేయులు, ఏఈలు అకౌంట్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సబ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్ఈ రాఘవేంద్రం



ఇల్లు కోల్పోయిన కుటుంబానికి దుస్తులు, వంటపాత్రల కిట్ అందచేస్తున్న రెడ్‌క్రాస్ బాధ్యులు

అగ్ని ప్రమాద బాధితులకు చేయూత

కావలి,డిసెంబరు5(ఆంధ్రజ్యోతి) అల్లూరు మండలం సింగపేట చెలిక సంఘానికి చెందిన ఏకుల చిన చెంచయ్య, వెంకమ్మ దంపతులు ఇల్లు ఇటీవల అగ్నిప్రమాదంలో కాలిపోయింది. అసోసియేషన్ ఫర్‌ది రూరల్ డెవలప్‌మెంట్ సంస్థ వ్యవస్థాపకులు బషీర్ సూచన మేరకు అగ్నిప్రమాద బాధిత గిరిజన కుటుంబానికి కావలి రెడ్‌క్రాస్ బాధ్యులు సహాయం అందించారు. కావలి రెడ్‌క్రాస్ భవనంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో వారికి దుస్తులు, వంట సామగ్రి కిట్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ విపత్తు నిర్వహణ విభాగం కన్వీనర్ జనిగర్ల మనోహర్, రెడ్‌క్రాస్ బాధ్యులు డీ. రవిప్రకాష్, కే. హరినారపరెడ్డి, బెజవాడ ప్రసన్న కుమార్, బీఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

కావలి,డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక కావలి నియోజకవర్గంలో వేగంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని స్థానిక ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం 37 మంది లబ్ధిదారులకు రూ.26,18,395 విలువ కలిగిన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన అందజేశారు. త్వరలో కావలిలో అనేక కొత్త రోడ్ల నిర్మాణాలతోపాటు, అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీలో కావలి రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు గుత్తికొండ కిషోర్, జ్యోతి బాబూరావు, ఆవుల రామక్రిష్ణ, మాలేపాటి నాగేశ్వరరావు, అల్లం హనుమంతరావు, పోట్లూరి శ్రీనివాసులు, అర్షియా బేగం, షేక్ అలహర్ తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

'పరకామణి'తో పరాచకాలా..!

పరకామణి దొంగతనాన్ని చాలా చిన్నదంటూ వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. తిరుపతిలోని కూటమి నేతలు శుక్రవారం ఆయనపై ధ్వజమెత్తారు. 'పరకామణి'తో పరాచకాలేంటి జగన్ అంటూ ధ్వజమెత్తారు. ఎవరేమన్నారంటే..

- తిరుపతి/తిరుపతి (జీవకోన), ఆంధ్రజ్యోతి



గజదొంగకు చిన్నదే కావచ్చు

తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకుని రూ.వేలకోట్లు సంపాదించిన గజదొంగకు పరకామణి చోరీ చిన్నదే కావచ్చు. క్రిస్టియన్‌గా శ్రీవారి దర్శనానికి వెళితే ఒక్కసారి కూడా డిక్లరేషన్‌పై సంతకం పెట్టని వ్యక్తికి ఇది చిన్నదే కావచ్చు. కానీ, కోట్లాదిమంది హిందువులకు మాత్రం ఇది పెద్ద విషయమే.

- పట్టాభి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్



ఆర్థిక నేరస్థుడికి ఇదేమి లెక్క?

వైసీపీ నేత జగన్మోహన్ రెడ్డి మాటలకు శ్రీవారి భక్తులు దిగ్భ్రాంతికి గురయ్యారు. పెద్ద ఆర్థిక నేరస్థుడికి పరకామణి దొంగతనం కేసు తక్కువే కదా! శ్రీవారి చెంత దాదాపు రూ100కోట్లు నొక్కేస్తే చాలా చిన్న విషయమా? కోట్లాది మంది భక్తుల మనోభావాలు దెబ్బతీస్తారా? పరకామణి కేసులో నలుగురు తోడు దొంగలు ఉండారని ఆధారాలతో సహా చూపించినా తనని ఒక్కరినే విచారిస్తున్నారని భూమన కరుణాకరరెడ్డి అనడం విడ్డూరంగా ఉంది.

- సుగుణమ్మ, ఏపీజీబీసీ ఛైర్‌పర్సన్



చర్చిలో జరిగితే ఇలాగే స్పందిస్తారా?

రూపాయి దొంగలించినా అది పవిత్రమైన స్వామి సొత్తు. అది మీ దృష్టిలో చిన్న చోరీనా? లక్షలకోట్లు కొల్లకొట్టి బెయిల్‌పై ఉన్న మీకు అదిచిన్నదిగానే కావచ్చు. ఏసుప్రభు దగ్గర జరిగివుంటే ఇదేవిధంగా స్పందన ఉండేదా? కోట్లాదిమంది హిందువులు బాధపడేవిధంగా మాట్లాడారు. పరకామణి అంశంలో ప్రజాభిప్రాయానికి వెళ్లే దమ్ముందా?

- భానుప్రకాష్ రెడ్డి, టీటీడీ సభ్యుడు



చిల్లర కేసుగా మాట్లాడతావా?

రూ.వందల కోట్లు దోచేసిన పరకామని కేసును చిల్లర కేసుగా మాట్లాడటం ఏంటీ? స్వామివారి ప్రతిష్ఠకు భంగం కలిగించేలా మాట్లాడతావా? నీ బంధువు భూమన, మీ బాబాయి వైవీ, నీ వాళ్ల ధనంజయరెడ్డి, ఎస్వీ పరమేశ్వర్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి కాజేసిన డబ్బును అప్పనంగా పంచేసుకుంటే.. నీవేమో ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేస్తావా?

- రవినాయుడు, శాప్ ఛైర్మన్


ఐఏఎస్ అధికారులంటే లెక్కలేదా?



సీఎంగా పనిచేసిన జగన్ రెడ్డి.. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను వాడు, వీడు అని పలకడం దారుణం. అందులోనూ యాదవ కులానికి చెందిన మాజీ ఐఏఎస్ అధికారి కృష్ణయ్యను తూలనాడారు. యాదవులందరికీ క్షమాపణ చెప్పాలి. వైసీపీ హయాంలో శ్రీవారి ప్రసాదాల్లో కల్తీ జరగడం వల్లే నాణ్యత లోపించిందని ఎన్నికల సభల్లో చెప్పాను. ఇప్పుడది బహిర్గతమైంది.

- నరసింహ యాదవ్, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్

శ్రీవారి కానుకలంటే లెక్కలేదా?



దేశ నలుమూలల నుంచి నిత్యం వచ్చే లక్షలాదిమంది భక్తులు శ్రీవారికి కానుకలు సమర్పిస్తుంటారు. అలాంటి పవిత్రమైన పరకామణి లెక్కింపులో దొంగతనం జరిగితే జగన్‌రెడ్డి లెక్కలేకుండా మాట్లాడతారా? 11 సీట్లు వచ్చినప్పుడే మానసిక పరిస్థితి దెబ్బతింది. ఇప్పుడది నిజమని స్పష్టమైంది. హిందువులకు క్షమాపణ చెప్పాలి.

- ఆర్సీ మునికృష్ణ, డిప్యూటీ మేయర్, తిరుపతి

ఏనుగులు తిన్నోడికి పీనుగులు ఒక లెక్కా



లక్షల కోట్లు దోచేస్తేనే జగన్ దృష్టిలో దొంగ. ఏనుగులు తిన్నోడికి పీనుగులు ఒక లెక్కా. పరకామణి దొంగను ఆయన అయ్యో పాపం అంటున్నారు. ఆయనను పార్టీలో చేర్చుకోండి. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను వాడు, వీడు అంటారా? వాళ్లేమన్నా తాడేపల్లి ప్యాలెస్‌లో చదువుకున్నారా? వారికి క్షమాపణలు చెప్పాలి. జగన్‌పై వారు కేసులు పెట్టాలి. జగన్ మాటల్ని తీవ్రంగా ఖండిస్తున్నాం.

- కిరణ్ రాయల్, జనసేన నేత



మమ్మల్ని దోషులుగా చిత్రీకరించడానికే..

మా హయాంలో ఉన్న బోర్డు సభ్యులు ఇప్పుడూ కొనసాగుతున్నారు. వారినెందుకు విచారణకు పిలవలేదు. మమ్మల్ని దోషులుగా చూపడానికే అధికారులు పనిచేశారు. రవికుమార్ తన ఆస్తులను రిజిస్ట్రేషన్ చేసి టీటీడీకి ఇస్తే.. అప్పటి అధికారులకు ఏం సంబంధం? రవికుమార్‌వి అవినీతి ఆస్తులైతే ఎందుకు అతడికి తిరిగి ఇవ్వలేదు. టీటీడీలో ఓ రూల్ ఉంది. డోనర్స్ పూర్వాపరాలు తెలుసుకోరు.

- భూమన కరుణాకరరెడ్డి, టీటీడీ మాజీ ఛైర్మన్

2,220 పాఠశాలల్లో మెగా పీటీఎం 3.0

- భాగస్వాములైన 2.63 లక్షల మంది

తిరుపతి(విద్య), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా 3,370 విద్యా సంస్థల్లో శుక్రవారం పండుగ వాతావరణంలో మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ (మెగా పీటీఎం) 3.0 జరిగింది. ఇందులో 2,63,389 మంది భాగస్వాములయ్యారు. విద్యా విధానాన్ని మరింతగా బలోపేతం చేసి, విద్యార్థులను అభివృద్ధి పథంలో నడిపించడమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టింది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ కార్యక్రమాలు సాగాయి. వరదల కారణంగా 26 పాఠశాలలు మినహా మిగిలిన 2,220 పాఠశాలలో వేడుకగా సాగాయి. ఈ కార్యక్రమాల్లో 1,15,683 మంది విద్యార్థులు, 22,789 తల్లిదండ్రులు, 2,547 మంది ప్రజా ప్రతినిధులు, 2,485 మంది అధికారులు, 2,445 మంది ఓల్డ్ విద్యార్థులు, ఇతరులు 4,121 మంది మొత్తం 2,63,389 మంది భాగస్వాములయ్యారు. ఇక జిల్లాలోని ప్రభుత్వ, కొన్ని ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో కూడా పీటీఎం జరిగింది. విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.



గత నెలలో విజయవాడలో జరిగిన మాక్ అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకురాలిగా పాల్గొన్న ఎస్వీ జేఎన్ఎం విద్యార్థి భవ్యశ్రీని సన్మానిస్తున్న పట్టాభి తదితరులు

కార్యక్రమాలు అనేకం.. ఎంతో ఉపయుక్తం

పీటీఎం కార్యక్రమాల్లో భాగంగా పేరెంటింగ్ సెషన్లను నిర్వహించారు. విద్యార్థులపట్ల తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. ముఖ్యంగా పిల్లలు సెల్‌ఫోన్ వాడకంవల్ల కలిగే అనర్థాల గురించి చెప్పారు. విద్యార్థుల మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించేందుకు, తద్వారా మంచి విద్యార్థులుగా వారిని తీర్చిదిద్దేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. చివరిగా విద్యార్థుల తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు వ్యక్తిగతంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రోగ్రెస్ రిపోర్టులను తల్లిదండ్రులకు చూపించి వివరించారు.

ఆకట్టుకున్న ప్రతిభా ప్రదర్శనలు

కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులు అనేక ప్రతిభా కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. పాఠశాలల్లో ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటుచేసి సైన్స్, మ్యాథ్స్, రోబోటిక్స్, ఇన్నోవేషన్ ప్రాజెక్టులు, డిజిటల్ ల్యాబ్ పరికరాల ప్రదర్శన, పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ ఫ్రీ కాన్సెప్ట్ మోడళ్లు, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ మోడళ్లు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. లైబ్రరీ బుక్స్ ప్రదర్శనలు, ఒకేషనల్ ఎడ్యుకేషన్ ఎక్స్‌పోలో భాగంగా అగ్రికల్చర్, ఐటీ, ఆటోమొబైల్స్, వెల్‌నెస్, హెల్త్‌కేర్ తదితరాలను విద్యార్థులు ప్రదర్శించారు. సంగీత, నృత్య కార్యక్రమాలతో అలరించారు.

ఎవరు ఎక్కడెక్కడ?

తిరుపతి నగరం దొడ్డాపురం ఎంసీహెచ్‌ఎస్‌లో ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం, గూడూరు జడ్పీబీహెచ్‌ఎస్‌లో ఎమ్మెల్సీ కళ్యాణచక్రవర్తి, పాకాల మండలం దామలచెరువు జడ్పీహెచ్‌ఎస్‌లో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, డక్కిలి మండలం కమ్మవారిపల్లిలో వెంకటగిరి ఎమ్మెల్యే కురుగుండ్ల రామకృష్ణ, చిల్లకూరులో గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, సత్యవేడు ఏపీటీడబ్ల్యూఆర్‌ఎస్ బాయ్స్ పాఠశాలలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, రేణిగుంటలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, సూళ్లూరుపేట మండలం మన్నారుపోలూరులో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, వడమాలపేట మండలం పత్తిపత్తూరులో నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, తిరుపతి అర్బన్ ఎస్టీ లేఔట్‌లోని ఎస్వీజేఎన్ఎం పాఠశాలలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరాం, జీబీసీ ఛైర్‌పర్సన్ సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు. తిరుపతి టీపీ ఏరియా టీపీపీఎం స్కూల్‌లో మేయర్ శిరీష, ఎంజీఎం హైస్కూల్‌లో ఇన్‌చార్జి జేసీ, కమిషనరు మౌర్య, ఎస్జీ కాలనీ ఎంసీహెచ్‌ఎస్‌లో ఎంపీ గురుమూర్తి పాల్గొన్నారు.



బాల్య వివాహాలొద్దు

'బాల్య వివాహాలవల్ల పిల్లల ఆరోగ్యం, విద్య, భవిష్యత్తు నాశనమవుతాయి. అతిగా మొబైల్ వాడటంతో నష్టాలే ఎక్కువ. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ ప్రమాదాలపై ఇప్పటి నుంచే అవగాహన కలిగి ఉండాలి' అని ఎస్పీ సుబ్బరాయుడు సూచించారు. తిరుపతి చిన్నబజారు వీధిలోని బాలిక ఉన్నత పాఠశాలలో జరిగిన మెగా పీటీఎంలో ఆయన బాల్య వివాహాలకు వ్యతిరేకంగా విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు.

బ్యాంకర్లకు ఆదర్శం 'గురుగ్రామ్'

- డిజిటల్ మోసాలపై అప్రమత్తంగా ఉండండి
- ఖాతాదారులు మోసపోకుండా చూడాలన్న ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇటీవల సైబర్ నేరాలు పెరిగాయి. డిజిటల్ అరెస్టులు, ఇతర బెదిరింపులతో రూ.లక్షలు కాజేస్తున్నారు. వీటి విషయంలో బ్యాంకర్లు అప్రమత్తంగా ఉండి.. ఖాతాదారులు నష్టపోకుండా చూడాలని పోలీసు శాఖ విజ్ఞప్తి చేస్తోంది. 'గురుగ్రామ్' ఘటనను ప్రస్తావిస్తూ బ్యాంకర్లకు ఎస్పీ సుబ్బరాయుడు పలు సూచనలు చేశారు. ఇంతకీ గురుగ్రామ్‌లో ఏం జరిగిందంటే.. అక్కడి యాక్సిస్ బ్యాంకులోని ఓ ఖాతా నుంచి అనుమానాస్పదంగా అధిక మొత్తంలో నగదు బదిలీలు జరిగాయి. దీనిని గమనించిన బ్రాంచ్ రిలేషన్‌షిప్ మేనేజర్ సబర్వాల్.. వెంటనే రిసీవింగ్ బ్యాంకులను అప్రమత్తం చేశారు. లావాదేవీలను తాత్కాలికంగా నిలిపివేశారు. సైబర్ క్రైమ్ పోలీసులకు సమాచారమిచ్చి లబ్ధిదారుల ఖాతాలను ఫ్రీజ్ చేయించారు. ఈ చర్యతో ఆ ఖాతా నుంచి వెళ్లిన రూ.64 లక్షలను ఆపగలిగారు. తదుపరి లావాదేవీలు ఆగడంతో ఆ సీనియర్ సిటిజన్‌కు రూ.6 కోట్ల నష్టం తప్పింది. ఇలా బ్యాంకు మేనేజరు అప్రమత్తతో 'డిజిటల్ అరెస్టు' పేరిట జరుగుతున్న మోసాన్ని అరికట్టారు. దీనిపై ఆ ఒంటరి కస్టమర్‌ను పలుమార్లు సంప్రదించారు. ఈ ఘటనను ఆదర్శంగా తీసుకుని బ్యాంకర్లు.. అప్రమత్తంగా ఉండాలని పోలీసు శాఖ కోరుతోంది.

మోసగాళ్ల పద్ధతులు

పోలీస్, సీబీఐ, ఎన్ఐఏ, కస్టమ్స్ పేరిట వాట్సాప్ కాల్ చేయడం. మనీ ల్యాండరింగ్, ఇతరత్రా పేరిట డిజిటల్ అరెస్టులని బెదిరిస్తారు. దర్యాప్తు కోసమని పెద్ద మొత్తాలను ప్రత్యేక ఖాతాలకు బదిలీ చేయించుకుంటున్నారు. ఎక్కువగా సీనియర్ సిటిజన్లపైనే మోసగాళ్లు దృష్టి పెడుతున్నారు.

బ్యాంకర్లు.. ఏం చేయాలంటే

బ్యాంకు మేనేజర్లు, అధికారులు, ఫ్రంట్ డెస్క్ సిబ్బంది అధిక లావాదేవాలను పర్యవేక్షించాలి. సీనియర్ సిటిజన్ల ఖాతాలు, డార్మెంట్ అకౌంట్లు, కొత్తగా యాక్టివ్ అయిన ఖాతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. అనుమానాస్పద లావాదేవీలపై ఇంటర్వెన్షన్ ప్రొటోకాల్ పాటించాలి. అవసరమైతే తాత్కాలికంగా హోల్డ్‌లో పెట్టాలి. పెద్ద మొత్తాల బదిలీలపై కస్టమర్‌ను సంప్రదించాలి. వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులకు సమాచారమివ్వాలి. లబ్ధిదారుల ఖాతాలను ఫ్రీజ్ చేయించాలి. డిజిటల్ అరెస్టు స్కామ్‌లు, ఫేక్ కాల్స్ ప్రమాదాలపై కస్టమర్లకు అవగాహన కల్పించాలి. ఇలాంటి చర్యల వల్ల సైబర్ నేరాలను నియంత్రించవచ్చని ఎస్పీ సుబ్బరాయుడు బ్యాంకు మేనేజర్లకు సూచన చేశారు.





డ్రోన్ ఎగురవేసిన శుభం కండేల్‌వాల్ - శిలాతోరణంపై డ్రోన్

శిలాతోరణం వద్ద డ్రోన్

- అదుపులో ఇద్దరు

తిరుమల, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా తిరుమలలో డ్రోన్ ఎగరేసిన ఇద్దరు భక్తులను టీటీడీ విజిలెన్స్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం ఉదయం శిలాతోరణం వద్ద వద డ్రోన్ ఎగురవేసి వీడియోలు తీస్తున్న జైపూర్‌కు చెందిన ఎన్ఆర్ఐ భక్తుడు శుభం కండేల్‌వాల్ అలియాస్ సర్వలక్షణ్‌దాస్, ఒంగోలుకు చెందిన భాను సుందర్ అలియాస్ అర్జున్ బంధుదాస్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఇస్కాన్ భక్తులమని, హిందూ ధర్మప్రచారం కోసమే ఈ ప్రయత్నం చేశామని వారు వివరణ ఇచ్చారు. వీరిని విజిలెన్స్ సిబ్బంది పోలీసులకు అప్పగించారు. అలిపిరి తనిఖీల్లో అవరోధం లేకుండానే వీరు తిరుపతి నుంచి బస్సులో డ్రోన్‌తో రావడం విశేషం.

16న టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం

- వైకుంఠద్వార దర్శన ఏర్పాట్లపైనే ప్రధాన చర్చ

తిరుమల, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఈనెల 16న టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు ఆధ్వర్యంలో ధర్మకర్తల మండలి సమావేశం జరుగనుంది. డిసెంబరు 30 నుంచి జనవరి 8వ తేదీ వరకు పదిరోజుల పాటు జరుగనున్న వైకుంఠద్వార దర్శనాలపై చర్చ జరుగనుంది. అలాగే టీటీడీ కొనుగోళ్లపై కొన్ని నిర్ణయాలు తీసుకోన్నారు. జనవరి 25న జరుగనున్న రథసప్తమికి చేపట్టాల్సిన ఏర్పట్లపై కూడా చర్చించనున్నారు. బోర్డ్ సెల్ విభాగం అంజెండా అంశాలను సిద్ధం చేస్తోంది.

9 నుంచి పులుల గణన

మంగళం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): తిరుపతి డివిజన్ పరిధిలోని 92 బీట్లలో ఈనెల 9వ తేదీ నుంచి పులులు లెక్కించనున్నారు. నాలుగేళ్లకు ఒకసారి దాదాపు 40 రోజుల పాటు మూడు దశల్లో ఈ గణన జరుగుతుందని తిరుపతి రేంజ్ అటవీశాఖ అధికారి సుదర్శన్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ● మొదటి దశలో ఎనిమిదిరోజుల పాటు పెద్దపులి, చిరుతలు, ఎలుగుబంట్లు, అడవి కుక్కలు, ఏనుగులు, జింకలు, ఇతర జంతువులను లెక్కిస్తారు. మొదటగా ప్రతిబీట్‌లో ఒక బీట్ ఆఫీసర్, ఇద్దరు వాచర్లుఉదయం 6 నుంచి 9 గంటల వరకు ఐదు కిలోమీటర్లు పాటు నడుచుకుంటూ వెళుతు మాంసాహార జంతువుల ఆనవాళ్లను మూడు రోజుల పాటు కనుక్కుంటారు. అనంతరం రెండు రోజుల పాటు డేటా ఎంటర్ చేస్తారు. ఆ తర్వాత మూడు రోజులు శాఖాహార జంతువులు, వాటి ఆనవాళ్లు, అడవుల పరిస్థితిని పరిశీలిస్తారు. మరుసటి రోజు డేటా మొత్తాన్ని నాగార్జునసాగర్ టైగర్ రిజర్వ్‌కు పంపుతారు. ఎంస్టైప్స్ మొబైల్ యాప్స్ ద్వారా డేటా సేకరిస్తారు. ● రెండో దశలో కెమెరాలను ఏర్పాటు చేసి.. గుర్తిస్తారు. ● మూడో దశలో వన్యప్రాణుల పాదముద్రలు, గోర్లు, వెంట్రుకలు, ఇతర శరీర ఆనవాళ్లను పరిశీలించి డేటా సేకరిస్తారు.

మరోసారి వాన ముప్పు

- 9న భారీ వర్ష సూచన

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడే వాయుగుండం కారణంగా జిల్లాలో ఈనెల 9న మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ వెల్లడించింది. తదుపరి భారీ వర్షాలకు జిల్లా యంత్రాంగం సమయాత్తం అవుతోంది. శుక్రవారం ఉదయం 11 నుంచి ఎలాంటి వర్షపాతం నమోదు కాలేదు. జిల్లాలో శుక్రవారం ఉదయం 8.30 గంటల వరకు నమోదు అయిన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. చిట్టమూరు 87.8మి.మీ., బాలాయపల్లి 56.4, వాకాడు 51.6, గూడూరు 50.6, చిల్లకూరు 42,4, సూళ్ళూరుపేట 42.2, కోట 38,8, డక్కిలి 37.2, కేవీబీపురం27.6 మి.మీ. వర్షపాతం నమోదు అయింది.

వరి.. కాపాడుకోవాలి మరి



దిత్వా తుపాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు వరిపైర్లు నీట మునిగాయి. ఇలాగే ఎక్కువ కాలం ఉంటే పంట దెబ్బతినే అవకాశం ఉంది. అందుకని రైతులు పొలాల్లోని నీటిని బయటకు పంపిస్తున్నారు. ఇలా.. శుక్రవారం నాయుడుపేట మండలం మేనకూరు వద్ద ఓ రైతు తన వరి పొలంలో నీటిని ట్రాక్టర్ ద్వారా బయటకు పంపి కాపాడుకుంటున్నారు.

- నాయుడుపేట టౌన్, ఆంధ్రజ్యోతి

పది ఇండిగో విమానాల రద్దు

- సాంకేతిక సమస్యతో చెన్నైలో దిగిన విమానం

రేణిగుంట డిసెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): హైదరాబాదు, విశాఖపట్నం, ముంబై, విజయవాడ నుంచి శుక్రవారం తిరుపతి విమానాశ్రయానికి రావాల్సిన పది ఇండిగో విమానాలు రద్దయ్యాయి. ఇక, హైదరాబాద్ నుంచి ఉదయం 10.35 గంటలకు తిరుపతికి ప్రయాణికులతో బయలుదేరిన ఇండిగో విమానంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో చెన్నైలో ల్యాండ్ అయింది. అలాగే, హైదరాబాద్ నుంచి 8.55 గంటలకు వచ్చిన స్పైస్ జెట్ విమానం వాతావరణం అనుకూలించక 10 నిమిషాలు గాలిలో చక్కర్లు కొట్టి 9 గంటలకు దిగింది. హైదరాబాద్ నుంచి ఉదయం 7.15 గంటలకు రావాల్సిన ఎయిర్ అలయన్స్ విమానం అరగంట ఆలస్యంగా చేరుకుంది. శివమొగ్గ నుంచి స్టార్ ఎయిర్ 40 నిమిషాలు ఆలస్యంగా వచ్చింది.



అక్కదేవతలకు కార్తీకపూజలు

తిరుమల నుంచి తిరుపతికి చేరుకునే మొదటి ఘాట్‌రోడ్డులోని అక్కగార్ల గుడిలో ఏడుగురు అక్కగార్లకు శుక్రవారం ఉదయం టీటీడీ ట్రాన్స్‌పోర్టు విభాగం ఆధ్వర్యంలో కార్తీక మాస పూజలు నిర్వహించారు. సారె సమర్పించారు. ఈ సందర్భంగా అక్కగార్ల ఆలయాన్ని పుష్ప, విద్యుత్ అలంకరణతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. ఈకార్యక్రమంలో టీటీడీ సీవీఎస్వో మురళీకృష్ణ, అన్నప్రసాదం డిప్యూటీఈవో రాజేంద్ర, ట్రాన్స్‌పోర్టు డీఎం లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

జనవరికల్లా అందుబాటులోకి బయోగ్యాస్‌ప్లాంట్



తిరుమల, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): తిరుమలలో బయోగ్యాస్ ప్లాంట్ పనులను త్వరితగతిన పూర్తిచేసి 2026 జనవరి నాటికి అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఐఓసీఎల్ ప్రతినిధులకు అవసరమైన సహకారం అందించాలని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. తిరుమలలోని డంపింగ్ యార్డు వద్ద ఐఓసీఎల్ సంస్థ ఏర్పాటు చేస్తున్న బయోగ్యాస్ ప్లాంట్ నిర్మాణ పనుల పురోగతి, ఘన వ్యర్థాల నిర్వహణపై పద్మావతి గెస్ట్‌హౌస్‌లో టీటీడీ, ఐఓసీఎల్ ప్రతినిధులతో శుక్రవారం అదనపు ఈవో సమీక్షించారు. గ్యాస్‌ప్లాంట్ ప్రాంగణంలో కాలుష్య ద్రవాల నివారణకు అదనపు గల్పర్ మెషిన్లు ఏర్పాట్లు చేయాలన్నారు.


సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 4 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 27 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.3.86 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 51,082

తలనీలాలు సమర్పించినవారు: 19,836



సీనియర్ సిటిజన్స్‌కు నేరుగా దర్శనాలు కల్పించండి



'డయల్ యువర్ టీటీడీ ఈవో' లో కోరిన భక్తులు

'మేము దివ్యాంగులం. ఐదు నెలలుగా ఆన్‌లైన్‌లో టోకెన్ల కోసం ప్రయత్నిస్తున్నా లభించడం లేదు.'

అన్‌లైన్‌లోనే ఇస్తే పాకుతూ ముందుకు సాగే మాలాంటి వాళ్లం ఎలా దర్శనం చేసుకోగలం,

'నాకు 64 ఏళ్లు. ఎంతకాలం ఉంటానో తెలీదు. మాలాంటివాళ్లకు తిరుమలలోనే కరెంట్ బుకింగ్ ద్వారా దర్శనం కల్పించండి.'

వృద్ధులు, దివ్యాంగులను ఆన్‌లైన్ బుకింగ్‌కి పరిమితం చేయకండి. నేరుగా వచ్చినా స్వామి దర్శనం కల్పించండి అని పలువురు భక్తులు డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో శుక్రవారం ఫోన్‌ల ద్వారా ఈవో అనిల్ కుమార్ సింఘాల్‌ను కోరారు. ఇలా కోరిన వారిలో మహేశ్వరయ్య (వెంకటగిరి), వెంకటేశ్వరరావు (ఏలూరు), శ్రీనివాస్(చెన్నై), దుర్గాప్రసాద్(భీమవరం) ఉన్నారు. ఇందుకు.. గతంలో క్యూలైన్ విధానంపై భక్తులు అసంతృప్తి వ్యక్తం చేయడంతోనే ఆన్‌లైన్‌లో కేటాయిస్తున్నామని బదులిచ్చారు.

గుడిలో 'యో.. పోయా..'లు వద్దు

అలాగే, నాదనీరాజనం వేదికపై గత తరహాలో భారతం, రామాయణం, అన్నమయ్య కీర్తనలు, గరుడపురాణ కార్యక్రమాలు నిర్వహించాలని శ్రీనివాసులు(హైదరాబాద్), రవి(రాజమండ్రి) కోరగా, త్వరలో నిర్ణయం తీసుకుంటామని ఈవో బదులిచ్చారు. టీటీడీ ఉద్యోగులు, శ్రీవారిసేవలను ఆలయంలో 'యో.. పోయా' అంటూ దురుసుగా మాట్లాడుతున్నారని, అలా కాకుండా గోవిందా అనేలా చర్యలు తీసుకోవాలని శివశంకర్(వైజాగ్) సూచన చేశారు. తప్పకుండా చర్యలు తీసుకుంటామని ఈవో చెప్పారు.

స్థానికులకు అన్యాయం

వైకుంఠద్వార దర్శనాల కేటాయింపులో స్థానికులకు అన్యాయం జరిగిందని చంద్రశేఖర్‌రెడ్డి(తిరుపతి) ఈవో దృష్టికి తీసుకెళ్లగా, తొలి మూడురోజుల్లో బయటవాళ్లే కాకుండా స్థానికులు కూడా టోకెన్లు పొందారని ఈవో చెప్పారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

ఒంటిమిట్టకు 50 ఏళ్ల మాస్టర్‌ప్లాన్

అధికారులను ఆదేశించిన ఈవో అనిల్‌కుమార్ సింఘాల్

తిరుమల, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): పురాతన ప్రాశస్త్యం ఉన్న ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయంలో వచ్చే 50 ఏళ్లకు సరిపడేలా పూర్తిస్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేలా మాస్టర్ ప్లాన్‌ను రూపొందించాలని టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ అధికారులను ఆదేశించారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో ఆయన శుక్రవారం సాయంత్రం అధికారులతో దీనిపై సమీక్షించారు. కల్యాణకట్ట, పుష్కరిణి, నక్షత్ర వనాలు, ఆధ్యాత్మిక చిహ్నాలు, మ్యూజియం, డిజిటల్ స్క్రీన్లు, కళామందిరం, చెరువులో 108 అడుగుల జాంబవతుడి విగ్రహం, మాడవీధుల అభివృద్ధి, సీసీ కెమెరాల ఏర్పాటు తదితర అంశాలతో మాస్టర్‌ప్లాన్ రూపొందించాలన్నారు. విజయవాడకు చెందిన స్కూల్ ఆఫ్ ప్లానింగ్ ఆర్కిటెక్చర్ అనిల్‌కుమార్ మాస్టర్‌ప్లాన్‌కు సంబంధించిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.



ఇంటి ముందు దిగాలుగా రాజమ్మ

పాపానాయుడుపేటలో పేలిన గ్యాస్ సిలిండర్

● ధ్వంసమైన ఇంటి గోడ, కిటికీలు, సామాన్లు

ఏర్పేడు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపానాయుడుపేటలో ఓ ఇంట్లో గురువారం రాత్రి 11 గంటల సమయంలో స్టోర్‌రూంలో ఉన్న గ్యాస్ సిలిండర్ పేలడంతో ఇల్లు దెబ్బతినింది. ఈ ఘటనలో ప్రాణనష్టం వాటిల్లకపోగా గృహోపకరణాలు, ఇంటి గోడ ధ్వంసమయ్యాయి. పాపానాయుడుపేటకు చెందిన రాజమ్మ భర్త పదేళ్ల కిందట, కుమారుడు ఐదేళ్ల కిందట మృతి చెందారు. ప్రస్తుతం ఈమె ఒంటరి మహిళ. ఈమె ఏడాదికి రెండు సార్లు సదాశివకోనకు వెళ్లి ఈశ్వరుడికి పూజలు చేసి అక్కడే భక్తులకు అన్నదానం చేస్తోంది. ఈ క్రమంలో ఈనెలలో కోనకు వెళ్లడానికి సరుకులు, గ్యాస్ సిలిండర్‌ను స్టోర్‌రూంలో పెట్టింది. గురువారం రాత్రి భోజనం చేసి వరండాలో పడుకుంది. షార్ట్ సర్క్యూట్‌తో వైర్లు కాలి గోతాల మీద పడటంతో ప్లాస్టిక్ కాలిన వాసన రాజమ్మకు వచ్చింది. స్టోర్‌రూంలో మంటలు ఎగసిపడుతున్నట్లు గుర్తించి వెంటనే వెలుపలకు పరుగులు తీసింది. రాత్రి 11గంటలు కావడంతో రాజమ్మ పెట్టిన కేకలకు కొంతమందే బయటకు వచ్చారు. అప్పటికే ప్లాస్టిక్ కవర్లకు వ్యాపించిన మంటలు సిలిండర్‌కు అంటుకుని పేలింది. ఒక్కసారిగా స్థానికులు ఉలిక్కిపడ్డారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది పాపానాయుడుపేటకు చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో స్టోర్ రూం గోడలు బీటలు వారాయి. సరుకులు కాలి బూడిదయ్యాయి. ఈ ఘటనపై ఏర్పేడు రెవెన్యూ, పోలీసు అధికారులు పాపానాయుడుపేటకు చేరుకుని విచారణ జరిపారు. జరిగిన నష్టాన్ని నివేదిక రూపంలో ఉన్నతాధికారులకు పంపుతున్నట్లు తెలిపారు.

'ఎర్ర' స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం దుంగలు అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.6 లక్షల జరిమానా విధిస్తూ శుక్రవారం తిరుపతి ఎర్రచందనం కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి నరసింహమూర్తి తీర్పు చెప్పారు. ఎర్రచందనం టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ తెలిపిన ప్రకారం.. తమిళనాడు రాష్ట్రం వేలూరుకు చెందిన పళని లక్ష్మణ్ 2016లో తిరుమల తుంబురుతీర్థం వద్ద ఎర్రచందనం తరలిస్తూ అటవీశాఖ అధికారులకు పట్టుబడ్డాడు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు అతడిని అరెస్టు చేయగా.. అతడు బెయిల్‌పై బయటకు వచ్చాడు. విచారణలో ఉన్న ఈ కేసును తాజాగా తిరుపతిలోని రాష్ట్ర ఎర్రచందనం ప్రత్యేక కోర్టుకు బదిలీ చేశారు. ఇరు వర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.6 లక్షల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ అమరనారాయణ వాదనలు వినిపించారు.



ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు?

● బాలాజీ రైల్వేడివిజన్ సాధించుకుందామని మేధావుల పిలుపు

తిరుపతి కేంద్రంగా మొదలైన బాలాజీ రైల్వే డివిజన్ డిమాండు క్రమంగా ఊపందుకుంటోంది. రాయలసీమ అభివృద్ధికి ఇది ఊతంగా మారుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మేధావివర్గం గొంతు కలుపుతున్నారు. బాలాజీ డివిజన్ ఎందుకు అవసరమో ప్రజలకు వివరించేందుకు సిద్ధమవుతున్నారు. తిరుపతి నుంచి ఢిల్లీదాకా డివిజన్ వాణి వినిపిస్తున్నారు. డివిజన్ సాధించేందుకు ఇదే సరైన సమయమని చెబుతున్నారు. అందరూ కలిసిరావాలని పిలుపునిస్తున్నారు. బాలాజీ రైల్వే డివిజన్‌వల్ల మనకు కలిగే ప్రయోజనాలేమిటో కొందరు ప్రముఖుల అభిప్రాయాలు ఇవి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

సాధించి తీరుతాం



తిరుపతి బాలాజీ రైల్వే డివిజన్ డిమాండు ఇప్పటిది కాదు. మనకు ఎప్పుడో రావాల్సింది. రాజకీయ ఒత్తిళ్ల కారణంగా, బాలాజీ డివిజన్ దారి మళ్లి గుంటూరుకు వెళ్లింది. ఈసారి ఎలాగైనా డివిజన్ సాధనే లక్ష్యంగా ముందుకు వెళుతున్నాం. మన ఆవేదనను ఎంపీల దృష్టికి తీసుకెళుతున్నాం. త్వరలోనే పదిమందితో ఢిల్లీకి వెళ్లనున్నాం. డివిజన్ ఏర్పాటైతే 10వేలకు పైగా ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి కల్పన ఉంటుంది. తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప జిల్లాలకు మరిన్ని సదుపాయాలు, వసతులు, ఫైట్ హ్యాండ్లింగ్ సౌకర్యాలు వస్తాయి. రాష్ట్రానికి భౌగోళిక-ఆర్థిక సమతుల్యత తీసుకువస్తుంది. దీనిద్వారా రాయలసీమలో పారిశ్రామిక పెట్టుబడుల వృద్ధికి గట్టి పునాది ఏర్పడుతుంది.

- కుప్పాల గిరిధర్, కన్వీనర్, బాలాజీ రైల్వే డివిజన్ సాధనసమితి

కొత్తరైళ్లు వేసుకోవచ్చు



బాలాజీ డివిజన్ వస్తే తిరుపతి రూపురేఖలు మారిపోతాయి. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా అభివృద్ధి జరుగుతుంది. 30 మంది సివిల్ అధికారులు వస్తారు. ఎగుమతి, దిగుమతుల ద్వారా వందల కోట్ల రూపాయల ఆర్థిక లావాదేవీలు జరుగుతాయి. తిరుపతి నుంచి కొత్తకొత్త ప్రదేశాలకు రైళ్లు వేసుకోవచ్చు. రాయలసీమలో ఉండే ప్రాజెక్టులకు అనుకూలంగా ఉంటుంది. పుటపర్తిని కలుపుకోవచ్చు. అన్ని పుణ్యక్షేత్రాలకు రైళ్లువేసుకోవచ్చు. తిరుపతి నుంచి నెల్లూరు, కాట్పాడికి లోకల్ ట్రైన్స్ వేసుకోవచ్చు.

- వేణుగోపాల్ రెడ్డి, సాధన సమితి నేత

సీమ ముఖచిత్రం మార్చవచ్చు



రాష్ట్ర విభజన జరుగుతున్న సమయంలో గుంతకల్లు జోన్ అడిగాం. అది మరుగున పడింది. ఇప్పుడు కేవలం డివిజన్ మాత్రమే అడుగుతున్నాం. దేశవ్యాప్తంగా ఉన్న 70 డివిజన్లలో తిరుపతి ఎందుకు అడుగుతున్నామంటే డివిజన్ ఉంటే డీఆర్‌ఎం మనకు అందుబాటులో ఉంటారు. డివిజన్ ఏర్పాటు ద్వారా వెస్ట్ రైల్వే స్టేషన్, తిరుచానూరు రైల్వే స్టేషన్లు అభివృద్ధిచేసుకోవచ్చు. మదనపల్లి మీదుగా కడప, పీలేరు మీదుగా తాడిపత్రికి రైల్వే లైన్లు వేసుకోవచ్చు. పాకాల నుంచి పలమనేరు మీదుగా మరొక రైల్వే లైను వేయాలని డిమాండు ఉంది. డివిజన్ కల సాకారమయ్యే దిశగా తక్షణమే రాష్ట్రప్రభుత్వం స్పందించి కేంద్రం దృష్టికి తీసుకెళ్లి రాయలసీమ ముఖచిత్రాన్ని మార్చాలి.

- భూమన్, రాయలసీమ ఉద్యమ నేత

పార్టీలకతీతంగా ఉద్యమించాలి

పాతికేళ్ల ముందుటి తిరుపతి వేరు, ఇప్పుడు వేరు. పెరిగిన జనాభా, రెట్టింపైన భక్తులు, విస్తరించిన పరిధి. విద్య, వైద్య సంస్థలు, పరిశ్రమలు పెద్దఎత్తున తిరుపతి జిల్లాకు వచ్చాయి. వీటన్నింటినీ దృష్టిలోపెట్టుకుని చూస్తే బాలాజీ రైల్వే డివిజన్ అవసరం ఉందని అర్థమవుతుంది. పరిశ్రమలకు అవసరమైన ముడిసరకులు, తయారైన ఉత్పత్తుల ఎగుమతి, దిగుమతులకు అవసరమైన రవాణా సులభతరం అవుతుంది. టూరిజంగా జిల్లా మరింత అభివృద్ధి చెందుతుంది. ఉద్యోగ, ఉపాధి కల్పన మెరుగవుతుంది. కనెక్టివిటీ బాగుంటే అభివృద్ధి బాగుంటుంది. డివిజన్ సాధన ద్వారానే ఇది సాధ్యమవుతుంది. రాయలసీమ మరింత అభివృద్ధి చెందుతుంది. పార్టీలకతీతంగా ప్రయత్నం చేస్తే తప్పకుండా సాధ్యమవుతుంది.



- డాక్టర్ స్వరాజ్యలక్ష్మి, సాధనసమితి నాయకురాలు

కనువిందుగా సదాశివకోన

వడమాలపేట మండలం సదాశివకోనలో జలపాతాలు కనువిందుచేస్తున్నాయి. సదాశివకోన, అమ్మవారికోనల్లో ఉవ్వెత్తున్న ఎగసిపడుతున్నాయి. ఈ జలపాతాల నీళ్ల ఏర్పేడు మండలంలోని సదాశివకోన ప్రాజెక్టుకు చేరుతున్నాయి.

- వడమాలపేట, ఆంధ్రజ్యోతి





పరవళ్లు తొక్కుతున్న కైలాసనాథ కోన


నారాయణవనం మండలంలోని కైలాసనాథ కోన జలపాతం పరవళ్లు తొక్కుతోంది. కొండలమీద నుంచి కిందకు దూకే జలపాతం సందర్శకుల్ని మంత్రముగ్ధులను చేస్తున్నది. వర్షాలతో పరిస్థితులు కొద్దిగా ప్రమాదకరంగా మారే అవకాశం ఉండటంతో భద్రతపరంగా తాత్కాలికంగా ప్రవేశాన్ని నిలిపివేశారు.

- నారాయణవనం, ఆంధ్రజ్యోతి

జలపాతాల జోరు

బుచ్చినాయుడు కండ్రిగ మండలంలోని ఉబ్బలమడుగు, కేవీబీపురం మండలంలోని ఆరె జలపాతాలు వయ్యారాలు ఒలుకుతున్నాయి. ప్రస్తుతం ఈ జలపాతాల వద్దకు పర్యాటకులను ఆపేశారు. మరో రెండు రోజుల్లో అనుమతించనున్నారు.

- సత్యవేడు, ఆంధ్రజ్యోతి





ఉబ్బల మడుగు - ఆరె జలపాతం...

ప్రామాణిక పరిశోధనలకు రూ.25 లక్షలు అందిస్తాం

● ఆంకోసిస్ బయోసంస్థ వ్యవస్థాపకుడు సురేష్ ● వెటర్నరీ వర్సిటీలో ముగిసిన జాతీయ సదస్సు

తిరుపతిరూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ వర్సిటీలోని బయోకెమిస్ట్రీ, ఫార్మకాలజీ విభాగాల్లో ప్రామాణిక పరిశోధనలు రూపొందించేందుకు ప్రోత్సాహంగా రూ.25లక్షల అందిస్తామని ఆంకోసిస్ బయోసంస్థ వ్యవస్థాపకుడు, వర్సిటీ పూర్వవిద్యార్థి డాక్టర్ పూసల సురేష్ పేర్కొన్నారు. ఎస్వీ వెటర్నరీ కళాశాల వేదికగా 'ఇంపాక్ట్ ఆఫ్ వెటర్నరీ రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్స్ ఆన్ యానిమల్ హెల్త్ అండ్ ప్రొడక్టివిటీ' అంశంపై శుక్రవారం ముగిసిన రెండు రోజుల పీజీవిద్యార్థుల జాతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. వర్సిటీలో చేపడుతున్న పరిశోధనలు ప్రామాణికత, నాణ్యతగా ఉన్నాయని అభినందించారు. భవిష్యత్‌లో వర్సిటీతో కలసి సంయుక్తంగా పరిశోధనలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఇంటర్‌డిసిప్లినరీ పరిశోధనల అవసరం మరింతగా పెరుగుతుందని, దీన్ని దృష్టిలో ఉంచుకుని అధునాతన పరిశోధనలు రూపొందించాలని ఇన్‌చార్జి వీసీ జేవీ రమణ సూచించారు. వెటర్నరీ సైన్స్ డీన్ ఆర్వీ సురేష్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ, అసోసియేట్‌డీన్ డాక్టర్ జగపతిరామయ్య, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఆర్.వినూ, కోఆర్గనైజింగ్ సెక్రటరీలు డాక్టర్ మురళీధర్, డాక్టర్ చైతన్య, డాక్టర్ సుధీర్, డాక్టర్ రాజ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న క్విజ్‌పోటీలు

బీవీఎస్సీ ఫైనలియర్ చదివే విద్యార్థులకు ఆరుసెషన్లలో నిర్వహించిన క్విజ్ పోటీలు ఆకట్టుకున్నాయి. ఫైనల్‌లో ప్రతిభచాటిన పదిమందికి అవార్డులతోపాటు నగదు బహుమతి అందించారు. ఉత్తమ పరిశోధనా పత్రాలు, పోస్టర్ ప్రజంటేషన్స్ చేసిన వారికి అవార్డులు, సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు.



సర్టిఫికెట్లు అందిస్తున్న వీసీ జేవీ రమణ, సురేష్ తదితరులు



ప్రిన్సిపాల్‌పై ఫిర్యాదు చేసేందుకు కోర్టుకు వచ్చిన విద్యార్థులు

డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌పై జడ్జికి ఫిర్యాదు

సత్యవేడు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుజాతపై విద్యార్థులు శుక్రవారం స్థానిక కోర్టులో న్యాయమూర్తి వెంకట నాగరాజుకు ఫిర్యాదు చేశారు. హాజరు శాతం తక్కువగా ఉందంటూ తమ చేత పరీక్ష ఫీజులు కట్టించుకోకుండా ఇబ్బంది పెడుతున్నారన్నారు. అసభ్య పదజాలంతో దూషిస్తున్నారంటూ ఆరోపించారు. విద్యార్థుల ఫిర్యాదును ఉన్నత విద్యాశాఖ అధికారులకు పంపిస్తానని జడ్జి వెంకట నాగరాజు తెలిపారు.

పది కిలోల గంజాయి స్వాధీనం

● ఒడిశాకు చెందిన ఇద్దరి అరెస్టు

రేణిగుంట డిసెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): రైల్వే స్టేషన్ కార్ పార్కింగ్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ఒడిశాకు చెందిన కైలాష్, బాబు గౌడ్‌ను శుక్రవారం అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. వీరిని తనిఖీ చేయగా 10 కిలోల గంజాయి దొరికిందన్నారు. గుజరాత్ రాష్ట్రం సూరత్ చెందిన చాహల్‌కు గంజాయిని అప్పగించేందుకు వెళుతున్నట్లు విచారణలో చెప్పారన్నారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి, ఈ ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపామన్నారు. సీఐ జయచంద్ర, స్టేషన్ రైటర్ చలపతి పాల్గొన్నారు.



గంజాయిని, నిందితులను చూపుతున్న డీఎస్పీ

సీఐఐ యంగ్ ఇండియన్స్ చాప్టర్ చైర్‌గా నితిన్

తిరుపతి(వైద్యం)/చంద్రగిరి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సీఐఐ యంగ్ ఇండియన్స్, తిరుపతి చాప్టర్ తన వార్షిక సెషన్‌ను శుక్రవారం తిరుపతిలోని తాజ్ హోటల్లో నిర్వహించారు. తిరుపతి చాప్టర్ చైర్‌గా రావండ్స్ ప్లాస్టిక్ సేల్స్ అండ్ మార్కెటింగ్ యూనివర్సిటీలో మాస్టర్స్ పూర్తి చేసిన నితిన్ దత్తులూరిని, జాయింట్ చైర్‌గా చిత్తూరులోని బాలాజీ హేచరీస్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ ప్రతీక్ పోలవరపును నియమించారు. యువత పారిశ్రామిక రంగంలో రాణించడం వల్ల దేశం అభివృద్ధిపథంలో ఎంతో ముందుకు వెళుతుందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనరు మౌర్య, యంగ్ ఇండియన్స్ చైర్‌పర్సన్ వర్ష విశ్వనాథ్‌కస్తూరి, జాయింట్ చైర్ ప్రదీప్ సెంథిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



నితిన్ దత్తులూరి

విద్యతోనే ఉజ్వల భవిత: విజయశ్రీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ

నాయుడుపేట టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. నాయుడుపేట మండలంలోని మేనకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ విద్య గొప్పదనాన్ని విద్యార్థులకు వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ విద్యావ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టారన్నారు. ఇందులో భాగంగానే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశాలు నిర్వహించడం శుభపరిణామమన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాలలో మౌళిక వసతుల కల్పన తదితర అంశాల గురించి తెలుసుకున్నారు. నాయుడుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో మేనకూరు సర్పంచ్ వెంకటేశ్వర్లు, ప్రధానోపాధ్యాయురాలు కవిత, సీడీపీవో ఉమామహేశ్వరి, ఎంఈవో మునిరత్నం, ఎంపీడీవో సురేష్‌బాబు, ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్‌కుమార్, నాయకులు రఫీ, సన్నారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, కామిరెడ్డి అశోక్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కన్నెమ్మ, నిత్య కృష్ణారెడ్డి, సూరి, సుబ్బారావు, నారాయణ, రవి, చక్రపాణి, ముత్యాలయ్య తదితరులు పాల్గొన్నారు.

చెరువు కట్టకు మరమ్మతులు

పెళ్లకూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా కుంగిన చెంబేడు చెరువు కట్టకు మరమ్మతులు పూర్తి చేశారు. గురువారం ఉదయం ప్రారంభమైన చెరువు కట్ట మరమ్మతులు పనులు శుక్రవారంతో ముగిశాయి. ఇరిగేషన్ ఈఈ బాబు, డీఈ విశ్వనాథం, ఏఈ శ్రీనివాసులు, నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు, తహసీల్దార్ హరికృష్ణ, నాయుడుపేట రూరల్ సీఐ సంఘమేశ్వరరావు, ఎస్ఐ నాగరాజు, వీఆర్వోలు సుధాకర్, వంశీకృష్ణ చెరువు కట్ట వద్దనే ఉంటూ మరమ్మతులను పనులను పర్యవేక్షించారు. తహసీల్దార్ హరికృష్ణ మాట్లాడుతూ కట్ట మరమ్మతులు పునులు పూర్తి చేశామని, చిల్లకూరు పునరావస కేంద్రాల నుంచి ఎగువతాగేళివాసులను గ్రామానికి తరలించినట్లు తెలిపారు.

పోస్టుకార్డుల ఉద్యమానికి మద్దతు

గూడూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గూడూరును నెల్లూరు జిల్లాలో కలపాలని జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన పోస్టుకార్డుల ఉద్యమానికి ప్రింట్ మీడియా వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మద్దతునిచ్చారు. శుక్రవారం స్థానిక కోర్టు సెంటర్‌లో ప్రింట్ మీడియా సభ్యులు పోస్టుకార్డు ఉద్యమంలో పాల్గొన్నారు. గూడూరును నెల్లూరులో కలపాలని విజ్ఞప్తి చేస్తూ ముఖ్యమంత్రికి పోస్టు కార్డులను పంపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు గూడూరును నెల్లూరు జిల్లాలో కలపాలని, లేనిపక్షంలో జిల్లాగా కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సునీల్ కుమార్, జమాలుల్లా, శరత్‌యాదవ్, బాలకృష్ణ, నాని, భవానీ, సురేష్, సలీం తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు ఆహార పొట్లాల పంపిణీ



వరద బాధితులకు ఆహారపొట్లాలు అందజేస్తున్న పీఆర్‌క్లబ్ సభ్యులు

గూడూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న గిరిజనులకు శుక్రవారం పీఆర్ క్లబ్ ఆధ్వర్యంలో ఆహార పొట్లాలను అందజేశారు. పీఆర్‌క్లబ్ సెక్రటరీ ఎల్లసిరి గోపాల్‌రెడ్డి మాటాడుతూ వర్షాల కారణంగా మధురెడ్డి గిరిజనకాలనీ, చెన్నూరులోని వైఎస్సార్ గిరిజన కాలనీల్లో నీరు చేరడంతో గిరిజనులు అవస్థలు పడుతున్నారన్నారు. క్లబ్ సభ్యుడు వెంగల్‌రెడ్డి దామోదర్‌రెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు దాతృత్వంతో గిరిజనులకు ఆహార పొట్లాలను అందజేశామన్నారు. కార్యక్రమంలో ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి, పేటేటి శ్రీనివాసరావు, పులిమి శివకుమార్, జనార్దనరెడ్డి, జైపాల్‌రెడ్డి, అన్నం రఘురామయ్య, బండి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు...



గూడలిలో అన్నం ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

కోట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పలు గ్రామాల్లో వరద బాధితులకు ఆహార ప్యాకెట్లను కూటమి నాయకులు పంపిణీ చేశారు. వెంకన్నపాళెం, కోటమ్మగుడికాలనీ, సాయినగర్, గూడలి, దక్షిణపొలం, కొండమిట్ట, ప్రకాశంకాలనీలతో పాటు బెంగాల్ నుంచి వచ్చి వరినాట్లు వేస్తున్న కూలీలకు టీడీపీ, జనసేన నాయకులు వెంకటకృష్ణారెడ్డి, రఘురామయ్య, జలీల్ అహ్మద్, మధుయాదవ్, రఘునాథరెడ్డి, అల్లం బాబు, ఉదయభాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు ఆహార ప్యాకెట్లను అందజేశారు.

మన్నెగుంటలో...

చిల్లకూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మన్నెగుంట గ్రామంలోని వరద బాధితులకు శుక్రవారం మీనాక్షి విద్యుత్ పరిశ్రమ ఆధ్వర్యంలో ఆహార పొట్లాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచు ఏడుకొండలు, పరిశ్రమ ప్రతినిధులు కేబీబీ నూరాఫెల్, శివరామకృష్ణారావు, మహదేవ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

చిట్టమూరు, డిసెంబర్ 5(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావం వల్ల వరద తాకిడికి గురైన గ్రామాలకు కొండేపాటి గంగాప్రసాద్ సౌజన్యంతో గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ సహకారంతో శుక్రవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. తీరప్రాంత గ్రామాలైన కోగిలి పంచాయతీలోని రాఘవేంద్రపురం ఎస్టీ కాలనీ, ఎల్లూరు పంచాయతీలోని, గొల్లలసట్టు, సన్నారెడ్డి కండ్రిగ, గునపాడు పంచాయతీ మామిడితోపు ఎస్టీ కాలనీల్లో కుటుంబాలకు టీడీపీ మండల అధ్యక్షుడు గణపర్తి కిషోర్ నాయుడు, ఎస్ఐ చిన్నబలరామయ్య, మారంరెడ్డి జనార్దనరెడ్డి, రషీద్ బాషా, సుధాకర్‌రెడ్డి చేతుల మీదుగా నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అబ్దుల్, గణపతి, శ్రీహరి రెడ్డి తదితరులు ఉన్నారు.

దివ్యాంగులకు...

గూడూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక వీరభద్రస్వామి ఆలయంలో శుక్రవారం రెడ్ సంస్థ ఆధ్వర్యంలో ఆంధ్రమహిళా మండలి, ఇన్నర్‌వీల్‌క్లబ్ సహకారంతో దివ్యాంగులకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ తనూజ, మాధురి, లక్ష్మీ, విష్ణువందన, శశిరేఖ, జనా సుధీర్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల భాగస్వామ్యంతోనే పాఠశాలల అభివృద్ధి

వాకాడు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రుల భాగస్వామ్యంతోనే పాఠశాలల అభివృద్ధి సాధ్యమని టీడీపీ మండల అధ్యక్షుడు దువ్వూరు మధుసూదనరెడ్డి అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌లో శుక్రవారం నిర్వహించారు.

పోక్సో కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు

దొరవారిసత్రం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష పడింది. 2022 డిసెంబరు 6వ ఇంట్లో ఒంటరిగా ఉన్న బాలిక పట్ల కుప్పారెడ్డిపాలెం గ్రామానికి చెందిన కల్లెంబాకం సుమన్ యువకుడికి అసభ్యకరంగా ప్రవర్తించాడని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నెల్లూరు పోక్సో కోర్టులో కేసు విచారణ జరిగింది. నేరం రుజువు కావడంతో నిందితుడికి మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.10 వేలు జరిమాన విధిస్తూ న్యాయమూర్తి సుమ తీర్పు ఇచ్చారు.

10న ఉచిత కంటి వైద్య శిబిరం

వాకాడు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వాకాడు ముస్లిం వీధిలో ఉన్న సీతారామాంజనేయస్వామి ఆలయం పక్కన ఉన్న ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో ఈ నెల 10వ తేదీన ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రిలో వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఎంవీరావు ఫౌండేషన్ చైర్మన్ ముప్పవరపు లీలామోహన్‌కృష్ణ తెలిపారు. వివరాలకు 9440096224, 7569890729 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

అటవీ భూమి ఆక్రమణపై ఫిర్యాదు

బాలాయపల్లి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని పిగిలాం కొత్తపాళెంలో అటవీ భూమిని కొందరు ఆక్రమించారని గిరిజనకాలనీ వాసులు తహసీల్దార్ విజయలక్ష్మికి శుక్రవారం ఫిర్యాదు చేశారు.



పూర్తిస్థాయి నీటిమట్టంతో చెన్నూరు చెరువు - కలుజు పారుతున్న మర్రిపల్లిమడుగు చెరువు

నిండుకుండల్లా చెరువులు

పదేళ్ల తర్వాత పూర్తిస్థాయిలో నీటిమట్టం

గూడూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గూడూరు మండలంలో అన్ని చెరువులు నిండుకుండల్లా తొణికిసలాడుతున్నాయి. పదేళ్ల తర్వాత పూర్తిస్థాయిలో నిండి కలుజులు పారుతుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 100 ఎకరాలకు పైగా ఆయకట్టు కలిగిన 21 చెరువులు, 100 ఎకరాల లోపు ఆయకట్టు కలిగిన 19 చెరువులు ఉన్నాయి. మొత్తం 40 చెరువుల కింద 7,500 ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ భూములను పూర్తిస్థాయిలో సాగు చేయాలంటే 860 ఎమ్‌సీఎఫ్‌టీ (మెట్రిక్ క్యూబిక్ ఫీట్) నీరు అవసరముంటుంది. 2015లో తుఫాన్ల కారణంగా అప్పట్లో అన్ని చెరువులు నిండి పూర్తిస్థాయి నీటి సామర్థ్యాన్ని కలిగి ఉండడంతో రైతులు పంటలను సాగు చేశారు. ఆ తరువాత ఇప్పటి వరకు చెరువుల్లో పూర్తిస్థాయి సామర్థ్యం లేకపోవడంతో చివరి ఆయకట్టు భూములకు నీరు అందకపోవడంతో రైతులు తెలుగుగంగపై ఆధారపడి సాగు చేపట్టేవారు. చివరి ఆయకట్టుకు నీరు అందక ఆశించిన మేర దిగుబడులు రాక ఆవేదన చెందేవారు. ఇటీవల కురిసిన వర్షాలకు అన్ని చెరువులు పూర్తి సామర్థ్యంతో జలకళను సంతరించుకున్నాయి. నిండు కుండల్లా మారి కలుజులు ప్రవహిస్తుండంతో, చివరి ఆయకట్ట వరకు నీరు అందుతుందని, సస్యశామలంగా పంటలను పండించుకోవచ్చనని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం: పాశిం



విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే పాశిం

చిల్లకూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు మంత్రి నారా లోకేశ్ విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన చిల్లకూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించి మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధి, విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపడుతోందన్నారు. డీఎస్సీ నిర్వహించి నూతనంగా ఉపాధ్యాయులను నియమించడం జరిగిందన్నారు. అలాగే తల్లికి వందనం ద్వారా కుటుంబంలో ఎంత మంది పిల్లలు ఉన్నా రూ.15వేల చొప్పున జమ చేశామన్నారు. విద్యార్థులు చిన్నతనం నుంచే కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరకోవాలని సూచించారు. పాఠశాలలోని తాగునీటి సమస్య పరిష్కరించి ప్రహరీ నిర్మించాలని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కోరగా, సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే చెప్పారు. పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థి గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడని ఉపాధ్యాయులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా శస్త్రచికిత్సకు అవసరమై ఖర్చు తానే భరిస్తానని భరోసా ఇచ్చారు. అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో డీవైఈవో సనత్‌కుమార్, ఎంఈవో రఫూఫ్, ఎంపీడీవో గోపి, తహసీల్దారు శ్రీనివాసులు, హెచ్‌ఎం జ్యోతి, శ్రీనివాసులు, విద్యాకమిటీ చైర్మన్ కవిత, చిల్లకూరు పట్టాభి రామిరెడ్డి, కొండా రామచంద్రారెడ్డి, గుండాల లీలావతి, పచ్చా వెంకటేశ్వర్లు నాయుడు, నెల్లూరు రామ్మూర్తి, మునిశేఖర్‌గౌడ్, సోమశేఖర్, దినేష్, మల్లికార్జున్, మధు, సురేష్‌బాబు, బాలరమణయ్య, వెంకట రమణయ్య తదితరులు పాల్గొన్నారు.





పాములకాలువ బ్రిడ్జి వద్ద, బోడిలింగాలపాడు మలుపువద్ద జాతీయ రహదారిలో గుంతలు

జాతీయ రహదారులపై గుంతలు

తడ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో పలుచోట్ల జాతీయ రహదారులు గుంతలు పడి వాహనదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. ముఖ్యంగా బోడిలింగాలపాడు మలుపువద్ద గుంతలు ప్రమాదకరంగా ఉన్నాయి. ఇక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అప్పుడప్పుడు అధికారులు ప్యాచ్ వర్కులు చేస్తున్నా రెండు, మూడు రోజులకే మళ్లీ గుంతలు పడిపోవడం సాధారణమైపోయింది. అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని వాహనదారులు కోరుతున్నారు.

పోలీసుస్టేషన్‌లో డీఎస్పీ తనిఖీలు



రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ చెంచుబాబు

దొరవారిసత్రం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం పోలీసు స్టేషన్‌ను నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. కేసుల దర్యాప్తులో పురోగతి గురించి సీఐ సంగమేశ్వరరావు, ఎస్ఐ అజయ్‌కుమార్‌తో మాట్లాడారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ జాతీయ రహదారిలో ప్రమాదాలను అరికట్టేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనుమతి లేకుండా నిర్వహిస్తున్న దాబా హోటళ్లపై చర్యలు చేపడతామన్నారు.

వేనాటి మునిరెడ్డికి నివాళి

సూళ్లూరుపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని టీడీపీ కార్యాలయంలో వేనాటి మునిరెడ్డి వర్ధంతి శుక్రవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి టీటీడీ మాజీ సభ్యుడు వేనాటి రామచంద్రారెడ్డి నివాళులర్పించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చిట్టేటి పెరుమాల్, నాపా మునిరాజా, మెస్ రమణయ్య, రమష్ రెడ్డి, బుజ్జిబాబు, వంకా శ్రీనివాసులు, పర్వతరెడ్డి చంద్రారెడ్డి, మహిళా నాయకురాలు బుద్ధి విజయలక్ష్మి, మంజుల, విజయమ్మ, వేనాటి అభిమానులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

గూడూరు అర్బన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని చెన్నూరు జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బాలనాగమ్మ అన్నారు. శుక్రవారం పాఠశాలలో పేరెంట్స్, టీచర్స్ సమావేశం నిర్వహించారు. అదేవిధంగా జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో తిరుపతి పార్లమెంటు తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి పాల్గొన్నారు.

రేపు అయ్యప్పస్వామి జ్యోతుల గ్రామోత్సవం

సూళ్లూరుపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో ఏటా నిర్వహించే అయ్యప్పస్వామి జ్యోతుల గ్రామోత్సవం ఆదివారం జరగనుంది. షార్ బస్టాండు వద్దనున్న ప్రసన్న వెంకటేశ్వర ఆలయం వద్ద ఆదివారం సాయంత్రం జ్యోతిని వెలిగించి గ్రామోత్సవాన్ని ప్రారంభించనున్నారు.

దివ్యాంగులకు ఉద్యోగ మేళా

సూళ్లూరుపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన దివ్యాంగుల జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. నెల్లూరులోని దివ్యాంగుల నైపుణ్యాభివృద్ధి, సాధికారిత పునరావాస సంస్థ సంయుక్త ప్రాంతీయ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ జాబ్ మేళాకు 98 మంది హాజరయ్యారు. వీరిలో 28 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నాగభూషణం తెలిపారు.

వలస నేతలకు పదవులొద్దు



శివప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న రాజేంద్ర

నాయుడుపేట టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కోసం కష్టపడి చేసేవారికి సముచిత స్థానం ఇవ్వాలని ఆ పార్టీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి దార్ల రాజేంద్ర నియోజకవర్గ పరిశీలకుడు శివప్రసాద్‌ను కోరారు. శుక్రవారం నెల్లూరులో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. నాయుడుపేట పట్టణ టీడీపీ అధ్యక్షుడిగా కందల కృష్ణారెడ్డినే కొనసాగించాలని, లేనిపక్షంలో పార్టీలో కొత్తవారికి అవకాశం కల్పించాలని కోరారు. అంతేకానీ అధికారంలోకి వచ్చాక వైసీపీ నుంచి వలస వచ్చిన వారిని నియమించవద్దని విజ్ఞప్తి చేశారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం

వాకాడు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెలిపూడి పంచాయతీ వెంకటరెడ్డిపాళెం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు కావలి గున్నయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన కుటుంబాన్ని పార్టీ నాయకులు పరామర్శించి రూ.12వేలు ఆర్థిక సాయం అందజేశారు.





కోట మండలం తిన్నెలపూడిలో నీటమునిగిన వరిపైరు - లక్ష్మక్కకండ్రిగలో పొలాల్లో ఇసుక మేటలు

నీట మునిగిన పంట పొలాలు

కోట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ కారణంగా కురిసిన వర్షాలతో కోట మండలంలోని పలు గ్రామాల్లోని వరిపైర్లు నీటమునిగాయి. తిన్నెలపూడి, లక్ష్మక్కకండ్రిగ, పడమటిపాళెం, రాజుపాళెం గ్రామాల్లో వరిపైర్లు దెబ్బతిన్నాయి. స్వర్ణముఖి, మామిడి కాలువలు ఉప్పొంగడంతో పడమటి పాళెంలోని ఒక రైతుకు చెందిన ఐదు ఎకరాలలో వరిపైరు తేలిపోగా నాట్లు దెబ్బతిన్నాయి. అదేవిధంగా లక్ష్మక్కకండ్రిగలో వరి పొలాలపై ఇసుక మేటలు వేయడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సూళ్లూరుపేట: దిత్వా తుఫాన్ ప్రభావంతో వారం రోజుల పాటు కురిసిన వర్షానికి సూళ్లూరుపేట మండలంలో వందలాది ఎకరాల పంట పొలాలు నీటి మునిగాయి. మంగళంపాడు, ఇలుపూరు, ఎన్‌వీకండ్రిగ, కోటపోలూరు, గోపాల్ రెడ్డిపాలెం, గొల్లమలువు, కుదిరి, కడపత్ర, దామరాయి, కొరిడి గ్రామాల్లో వరి మడులు చెరువులను తలపిస్తున్నాయి.

వాకాడు: ఎడతెరపిలేకుండా కురిసిన వర్షాలకు వాకాడు, కల్లూరు, కాశీపురం, తదితర గ్రామాల్లో వరినాట్లు నీటమునిగాయి. వ్యవసాయ శాఖ అధికారిణి దీప పరిశీలించి రైతులకు సూచనలిచ్చారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ విద్య: కురుగొండ్ల



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, డిసెంబర్ 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్‌కు దీటుగా విద్యాబోధన అందించేందుకు మంత్రి నారా లోకేశ్ చర్యలు తీసుకుంటున్నారని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. శుక్రవారం పట్టణంలోని బాలికల గురుకుల పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్స్ - టీచర్స్ మీటింగ్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందించేందుకు మంత్రి నారా లోకేశ్ విద్యావ్యవస్థలో మార్పులు తీసుకొస్తున్నారని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యా బోధనకే పరిమితం కాకుండా విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీయాలన్నారు. అనంతరం పాఠశాలలో తరగతులు, ల్యాబ్, డిజిటల్ లెర్నింగ్ రూంలను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న వసతులు, ట్యాబ్‌లెట్లు, డిజిటల్ మెటీరియల్స్, స్కూల్ కిట్స్ విద్యార్థులకు ఏవిదంగా ఉపయోగపడుతున్నాయో తెలుసుకొన్నారు. విద్యార్థులు చూపిన ప్రతిభ, టూల్స్‌తో సాధిస్తున్న పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ తమ్మిరెడ్డి తనూజ, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీరామదాసు గంగాధర్, ఏఎంసీ చైర్మన్ వునుగోటి విశ్వనాథ నాయుడు, ప్రిన్సిపాల్ కామేశ్వరి, సీడీపీవో షంషాద్ బేగం, ఎంపీడీవో గుణశేకర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, సీఐ రమణ, ఎస్ఐ ఏడుకొండలు, నాయకులు పులికొల్లు రాజేశ్వరావు, బీరం రాజేశ్వరావు, పప్పు చంద్రమౌళిరెడ్డి, అవ్వారు సత్యనారాయణ, మంకు ఆనంద్, రామకృష్ణ, జనసేన నాయకులు రామారావు అనీల్, రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

డీడీవో కార్యాలయాలతో సత్వరాభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్

నాయుడుపేట, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): డీడీవో కార్యాలయాలతో సత్వరాభివృద్ధి సాధ్యమవుతుందని సూళ్లూరుపేట నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి, ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్ అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సహకారంతో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ రాష్ట్రవ్యాప్తంగా 77 డివిజన్ డెవలప్‌మెంట్ కార్యాలయాలను ప్రారంభించారన్నారు. తద్వారా వేగవంతంగా గ్రామీణ సేవలు అందుతాయని చెప్పారు. కార్యక్రమంలో అట్ల కృష్ణారావు, గిండి సతీష్, బాలుశెట్టి, విజయ్, కేశవరెడ్డి, కుంపటి శీను, రోహిణి, సల్మా, భానుప్రకాష్, శ్రీనివాస్, ఉపేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

సన్న, చిన్నకారు రైతులకు సాదాబైనామా రిజిస్ట్రేషన్లు

డక్కిలి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సన్న, చిన్నకారు రైతులకు సాదాబైనామా రిజిస్ట్రేషన్లు చేసేందుకు ప్రభుత్వం అనుమతించిందని తమసీల్దారు శ్రీనివాసులు తెలిపారు. 2024 జూన్ 15వ తేదీ లోపు జరిగిన సాదాబైనామా లావాదేవీలను రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి రిజిస్ట్రేషన్ ఫీజు, స్టాంప్ డ్యూటీ మినహాయింపు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రపంచ మృత్తికా దినోత్సవం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నాగభూషణం

సూళ్లూరుపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జంతు, వృక్షశాస్త్ర విభాగాలు సంయుక్తంగా ప్రపంచ మృత్తికా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించాయి. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నాగభూషణం మాట్లాడుతూ పర్యావరణంలో నేల ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. కాలుష్యం వల్ల నేల తన సహజ స్వభావం కోల్పోతుందన్నారు. డాక్టర్ జశ్వంత్ మాట్లాడుతూ నేల విశిష్టత, దానిని సంరక్షించుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాస్, ఉషారాణి, అమ్మాజీ, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం

కోట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పిన్న వయస్సులో బాల్య వివాహాలు చేసి చిన్నారులను ఉరితాళ్లకు వేలాడతీయవద్దంటూ మహిళా అధికారులు బాలికలు ప్రతిజ్ఞ చేశారు. కోటలోని బాలికల ఉన్నత పాఠశాల, ఊనుగుంట పాళెంలలో శుక్రవారం ఐసీడీఎస్ అధికారుల ఆధ్వర్యంలో బాల్య వివాహాల వల్ల నష్టాలపై అవగాహన కల్పించారు. సీడీపీవో మునికుమారి, మహిళా ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలు బాల్య వివాహాలు చేసుకుంటే కలిగే నష్టాలను ప్రయోగాత్మకంగా వివరించారు. బాలికలు 18 సంవత్సరాలు నిండిన తరువాత వివాహం చేసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యవంతులు ఉంటారని చెప్పారు. చిన్న వయస్సులో వివాహాలు చేసుకోవడం వల్ల వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్లు కవిత, కృష్ణమ్మ, అంగన్‌వాడీ వర్కర్లు ఉన్నారు.